
# చైతన్యరథం

సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్ళు





## ఆక్వా కల్చర్ రంగాన్ని ఆదుకోండి

- సోయాబీన్ మీల్ దిగుమతికి అనుమతివ్వండి
- ఎఫ్‌సీవీ పొగాకు ఎగుమతిని ప్రోత్సహించండి
- ముగ్గురు కేంద్రమంత్రులకు సీఎం చంద్రబాబు లేఖలు

3

# సులభతరంగా రిజిస్ట్రేషన్ సేవలు



2

సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలను ప్రైవేటీకరిస్తున్నారంటూ చేస్తున్న దుష్ప్రచారంపై సీఎం చంద్రబాబు స్పందించారు.ప్రజలకు మెరుగైన సేవలందించేందుకే రిజిస్ట్రేషన్ సేవా కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని వెల్లడించారు. దీనివల్ల ఒకే చోట సేవలు అందుతాయని వివరించారు. వాస్తవాలను ప్రజలకు తెలియజేయాలని ఆదేశించారు. సచివాలయంలోని ఆర్టీజీఎస్ సెంటర్‌లో వివిధ శాఖల పనితీరుపై ఆయన సమీక్షించారు.

- అందుకోసమే సేవా కేంద్రాలు ఏర్పాటు
- ప్రైవేటీకరణ అంటూ దుష్ప్రచారం చేస్తున్నారు
- వాస్తవాలను ప్రజలకు తెలియజేయాలి
- డాక్యుమెంట్ రైటర్లకు ఉపాధి మార్గాలు చూపిస్తాం
- దీపం-2.0 లబ్ధిదారులకు నిర్ధారిత తేదీల్లో నగదు
- సాంకేతిక అంశాలను పరిశీలించి అమలుచేయాలి
- జలధారకు వీబీజీ రామ్ జీని అనుసంధానించాలి
- లిటిగెంట్ పిటిషన్లను గుర్తించి కౌన్సెలింగ్ ఇవ్వాలి
- ఆర్టీజీఎస్ సమీక్షలో సీఎం చంద్రబాబు



- ఆగస్టు 1న మోదీ చేతులమీదుగా ప్రారంభం
- జీఎమ్మార్ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్,
- ఏవియేషన్ హబ్ వర్శిటీ, ఎడ్యుసిటీలకు శ్రీకారం
- సంప్రదాయ నృత్యరూపాలతో ఘనస్వాగతం పలకాలి
- 10 రోజుల పాటు విస్తృత ప్రచారం నిర్వహించాలి
- వేదికపై అరకు కాఫీ బ్రాండింగ్ కనిపించాలి
- ప్రధాని పర్యటన ఏర్పాట్లపై సమీక్షలో సీఎం చంద్రబాబు

## ఉత్తరాంధ్ర మణిహారంగా

3

# భోగాపురం ఎయిర్‌పోర్ట్

భోగాపురంలో నిర్మించిన అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం ఆగస్టు 1న ప్రధాని మోదీ చేతులమీదుగా ప్రారంభించనున్న నేపథ్యంలో ఏర్పాట్లపై సోమవారం ఉన్నతాధికారులతో సీఎం చంద్రబాబు సమీక్షించారు. ప్రారంభోత్సవ వేడుకలను చారిత్రాత్మక ఘట్టంగా నిర్వహించాలని ఆదేశించారు. ప్రధాని మోదీకి ఉత్తరాంధ్ర ప్రజల సంస్కృతి, సంప్రదాయాలను తెలుపుతూ సంప్రదాయ నృత్యరూపాలతో ఘనస్వాగతం పలకాలని సూచించారు.



4

## సకల సౌకర్యాలతో

# 'తల్లి-బిడ్డ ఎక్స్‌ప్రెస్'

- త్వరలో అందుబాటులోకి 500 కొత్త వాహనాలు
- ఏటా 2.75 లక్షల మంది బాలింతలకు మేలు
- పరిశీలించిన ముఖ్యమంత్రి చంద్రబాబు
- బ్రాండింగ్ డిజైన్లకు ఆమోదం



# గిరిజన సంఘాలతో త్వరలో చర్చలు

- వారి హక్కులకు ప్రథమ ప్రాధాన్యమిస్తాం
- జీవో 3 ప్రయోజనాలు దక్కేలా ప్రత్యామ్నాయాలు
- గత ప్రభుత్వం దానిని పరిరక్షించలేకపోయింది
- చట్టపరమైన అడ్డంకులు అధిగమించేలా చూస్తాం
- 1/70 అమలులో ఎటువంటి అనుమానాలు వద్దు
- జోన్-1లోకి అల్లూరి సీతారామరాజు జిల్లా,
- జోన్-2లోకి పోలవరం జిల్లాను చేర్చాలి
- బాక్సైట్ విషయంలో ఆందోళన వద్దు..
- అవినీతితో అంతర్జాతీయ సమస్యగా మార్చారు
- ఎస్టీల సంక్షేమం, అభివృద్ధిపై సమీక్షలో సీఎం చంద్రబాబు

5

# ప్రభుత్వ పాఠశాలలు చూసి అసూయపడాలి



ప్రభుత్వ పాఠశాలలను చూసి అసూయపడేలా వాటిని తీర్చిదిద్దుతామని మంత్రి నారా లోకేష్ తెలిపారు. మంగళగిరి నియోజకవర్గంలోని తల్లికి వందనం పథకం లబ్ధిదారులతో మంగళగిరి బైపాస్ కొండపనేని టౌన్‌షిప్ పార్క్‌లో సోమవారం ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థుల తల్లుల నుంచి పలు సలహాలు, సూచనలు స్వీకరించారు. యువగళం పాదయాత్ర సమయంలో కష్టాలు చూసి ఎంతమంది పిల్లలు ఉన్నా అందరికీ తల్లికి వందనం పథకం వర్తింపజేసి అమలు చేయాలని సంకల్పించినట్లు చెప్పారు.

- ఇందుకు అందరి ఆశీస్సులు ఉండాలి
- సమాజంలో మార్పునకు విద్యే ప్రధానం
- యువగళం పాదయాత్రలో సమస్యలు చూశా
- ఎంతమంది పిల్లలున్నా తల్లికి వందనం
- వర్తింపజేయాలని నాడే సంకల్పించాం
- మంగళగిరిని నెం.1గా తీర్చిదిద్దుతాం
- తల్లికి వందనం లబ్ధిదారులతో
- ముఖాముఖిలో మంత్రి నారా లోకేష్

6



# రెండో విడత

# 'మన ఇల్లు-మన లోకేష్'

- 3 వేల మందికి పట్టాల పంపిణీకి ఏర్పాట్లు
- మంగళగిరి నియోజకవర్గ ప్రజలకు ప్రయోజనం
- నేటి నుంచి రెండురోజుల పాటు కార్యక్రమం
- దశాబ్దాల మొండి సమస్యకు శాశ్వత పరిష్కారం

5





12

## చెప్పేవి శ్రీరంగ నీతులు..

# చేసేవి అవినీతి పనులు, భూకబ్జాలు

*తమ్మినేనిని వెంటనే అరెస్ట్ చేయాలి: వర్ల రామయ్య*

చైతన్యరథం




# సేవల సులభతరానికే రిజిస్ట్రేషన్ సేవా కేంద్రాలు

- ప్రైవేటీకరణ అంటూ దుష్ప్రచారం చేస్తున్నారు
- డాక్యుమెంట్ రైటర్లకు ఉపాధి మార్గాలు చూపిస్తాం
- దీనిపై వాస్తవాలను ప్రజలకు తెలియజేయాలి
- దీపం-2.0 లబ్ధిదారులకు నిర్ధారిత తేదీల్లో నగదు
- సాంకేతిక అంశాలను పరిశీలించి అమలుచేయాలి
- జలధారకు వీబీజీ రామ్ జీని అనుసంధానించాలి
- లిటిగెంట్ పిటిషన్లను గుర్తించి కౌన్సెలింగ్ ఇవ్వాలి
- ఆర్టీజీఎస్ సమీక్షలో సీఎం చంద్రబాబు




అమరావతి (చైతన్యరథం): సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలను ప్రైవేటీకరిస్తున్నారంటూ కొందరు పనిగట్టుకుని దుష్ప్రచారం చేస్తున్నా రని.. దీనిపై వాస్తవాలను ప్రజలకు తెలియజేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. ప్రజలకు మెరుగైన సేవలందిం చేందుకే రిజిస్ట్రేషన్ సేవా కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని వెల్ల డించారు. సచివాలయంలోని ఆర్టీజీఎస్ సెంటర్‌లో సోమవారం వివిధ శాఖల పనితీరుపై సీఎం సమీక్షించారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను ప్రైవేటీకరిస్తున్నారనే అంశం సమీక్షలో ప్రస్తావనకు వచ్చింది. ప్రజలకు మెరుగైన రిజిస్ట్రేషన్ సేవలందించేందుకు ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉంది. రిజిస్ట్రేషన్ సేవలను మరింత సులభతరం చేసేలా రిజిస్ట్రేషన్ సేవా కేంద్రం(ఆర్‌ఎస్‌కే)లను ఏర్పాటు చేస్తున్నాం. ఇది ప్రైవేటీకరణ ఎంత మాత్రమూ కాదు. పాస్‌పోర్టు సేవా కేంద్రాల తరహాలోనే రిజిస్ట్రేషన్ సేవా కేంద్రాలు పనిచేస్తాయి. పాస్‌పోర్టు సేవా కేంద్రాల పనితీరు ఏ విధంగా జరు గుతుందో.. ఆ తర్వాత ప్రక్రియ ఏ విధంగా జరుగుతుందో వివ రించండి. పాస్‌పోర్టు సేవా కేంద్రాలు అందుబాటులోకి వచ్చాక పాస్‌పోర్టు ప్రాసెసింగ్ అనేది చాలా సులువైంది. ఇదే తరహాలో రిజిస్ట్రేషన్ సేవా కేంద్రాల పనితీరు ఉంటుంది. అయితే రిజిస్ట్రేషన్ సేవా కేంద్రాల విషయంలో కొందరు పనిగట్టుకుని దుష్ప్రచారం చేస్తున్నారు. ప్రజలకు వాస్తవాలు వివరించే బాధ్యతను అధికారులు తీసుకోవాలి. రిజిస్ట్రేషన్ సేవా కేంద్రాల వల్ల కలిగే లాభాలను వివరించాలి. డాక్యుమెంట్ రైటర్లు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. డాక్యుమెంట్ రైటర్ల ఉపాధికి ఇబ్బంది లేని విధంగా మార్గాలు చూపెడతాం. దీపం-2.0 పథకం లబ్ధిదారు లకు ఇచ్చే సబ్సిడీని క్రమపద్ధతిలో ఇవ్వాల్సిన అవసరం ఉంది. ఈ సబ్సిడీని నిర్ధారిత తేదీల్లో ఇచ్చే అంశాన్ని పరిశీలించాలి. ఈ అం శంపై పౌరసరఫరాల శాఖ-ఆర్థిక శాఖ అధికారులు సమన్వయం చేసుకోవాలి. దీనికి సంబంధించిన సాంకేతిక అంశాలను పరిశీ లించి అమలు చేయాలని ఆదేశించారు.

### లిటిగెంట్ పిటిషనర్లకు కౌన్సెలింగ్

లిటిగెంట్ పిటిషనర్లను ఏ విధంగా కట్టడి చేయాలో ఆలోచించా లి. ఎలాంటి ప్రజా ప్రయోజనం లేకుండా చేసే ఫిర్యాదుదారులను గుర్తించి వారికి కౌన్సెలింగ్ ఇవ్వాలి. రాష్ట్రవ్యాప్తంగా 81 మంది లిటిగెంట్ పిటిషనర్లు ఉన్నట్టు గుర్తించాం. వీరు సరాసరి ఒక్కొక్క రు 246 పిటిషన్లు పెడుతున్నారు. వీరి వివరాలను జిల్లా కలెక్టర్లకు పంపించాలి. వారు పెట్టే అర్జీల్లో ప్రజా ప్రయోజనాలు ఉంటే వాటి ని పరిశీలించాలి. ప్రభుత్వాన్ని, అధికారులను బద్నాం చేసే ఉద్దే శంతో పిటిషన్లు పెట్టే వారిని గుర్తించాలి. ఫిర్యాదుల పరిష్కారంలో ఆర్థికేతర సమస్యలను వెంటనే పరిష్కరించాలి. ప్రాధాన్యతల వారీ గా ఆర్థిక సమస్యలను పరిష్కరిద్దాం. ఈ ఏడాది ఎల్‌నినో ప్రభావం కారణంగా ప్రస్తుతం 49 శాతం లోటు వర్షపాతం ఉంది. ఈ ప్రభావం నుంచి బయటపడేసే ప్రత్యామ్నాయ మార్గాలను అన్వే షించాలి. ఈ మేరకు రైతుల్లో అవగాహన కల్పించాలి. డ్రై క్రాప్స్ వేసేలా రైతులను ప్రోత్సహించండి. ఇదే సమయంలో వీబీజీ రామ్ జీ పనులను పెద్దఎత్తున చేపట్టాలి. జలధార పనులకు వీబీజీ రామ్ జీ పనులను అనుసంధానం చేయాలి. ప్రజాభిప్రాయాలను ఎప్పటి కప్పుడు తెలుసుకుని పని విధానం మార్చుకోవాలి. పరిపాలనా విధానాలను మెరుగుపరుచుకోవాలి. సమస్యలు ఉత్పన్నమయ్యాక చర్యలు తీసుకోవడంతో పాటు ముందుగానే ఏయే సమస్యలు వస్తా యనే విషయాన్ని అంచనా వేసి దానికి అనుగుణంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సమీక్షలో సీఎస్ సాయిప్రసాద్ సహా వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# ఏపీలో పలు జిల్లాలకు రెయిన్ అలర్ట్

**ఉపరితల ఆవర్తనం ప్రభావంతో మార్పులు - పిడుగులతో వర్షాలు పడే అవకాశం**



అమరావతి (చైతన్యరథం): రాష్ట్రంలో మంగళవారం పలుచోట్ల వర్షాలు కురిసే అవకాశం ఉందని రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ తెలిపింది. పశ్చిమ మధ్య బంగాళాఖాతం, ఉత్తర కోస్తా ప్రాంతా లపై ఏర్పడిన ఉపరితల ఆవర్తనం ప్రభావంతో రాష్ట్రంలో వాతా వరణంలో మార్పులు చోటుచేసుకోనున్నట్లు వెల్లడించింది. కోస్తాంధ్రలో గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో ఈదు రుగాలులు వీచే అవకాశం ఉందని అధికారులు హెచ్చరించారు. మేఘావృత వాతావరణంతో పాటు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని పేర్కొన్నారు. శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, పోలవరం ప్రాంతం, కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల్లో పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. రాష్ట్రంలోని ఇతర జిల్లాల్లో కూడా అక్కడక్కడా తేలిక పాటి వర్షాలు పడే అవకాశం ఉందన్నారు. అనకాపల్లి జిల్లా ఎలమంచిలిలో అత్యధికంగా 66.7 మిల్లీమీటర్ల వర్షపాతం నమో దైందన్నారు. అలాగే పెంజెరువులో 42.5 మిల్లీమీటర్లు, సోమలిం గపాలెంలో 40 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు అధికారులు వెల్లడించారు. వర్షాలు, పిడుగులు, ఈదురుగాలుల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని విపత్తు నిర్వహణ సంస్థ సూచిం చింది. పిడుగులు పడే సమయంలో చెట్ల కింద నిలబడవద్దని, అలాగే భారీ హోర్డింగులు, విద్యుత్ స్తంభాలు, విద్యుత్ వైర్లకు దూరంగా ఉండాలని హెచ్చరించింది. అలాగే సముద్రం అలజడిగా ఉండే అవకాశం ఉన్నందున చిన్న పడవలతో వేటకు వెళ్లొద్దని మత్స్యకారులకు అధికారులు సూచించారు. పరిస్థితు లను ఎప్పటికప్పుడు గమనిస్తూ అధికార యంత్రాంగం జారీ చేసే సూచనలను పాటించాలని విజ్ఞప్తి చేశారు.

# లిక్కర్ స్కాంలో ఇలా దోచేశారు..

- అనుకూలంగా టెండరు నిబంధనలు మార్చారు
- మద్యం రవాణాలో అడ్డగోలు దోపిడీ
- వాసుదేవరెడ్డి రిమాండ్ రిపోర్టులో కీలక అంశాలు




విజయవాడ(చైతన్యరథం): వైసీపీ హయాంలో జరిగిన మద్యం కుంభకోణం కేసులో ఇప్పటికే పలు కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి. తాజాగా ఏపీ బేవరేజెస్ కార్పొరేషన్ మాజీ ఎండీ వాసుదేవరెడ్డికి సంబంధించి విజయవాడలోని ఏసీబీ కోర్టుకు సిట్ సమర్పించిన రిమాండ్ రిపోర్టులో కీలక అంశాలను ప్రస్తావించింది. ఈ స్కాంలో వాసుదేవరెడ్డి, రాజ్ కసిరెడ్డితో పాటు కారుమూరి సునీల్ సహా మరికొంత మంది కలిసి ప్రభుత్వ ఆదాయానికి గండికొట్టారని స్పష్టం చేసింది. జిల్లాస్థాయిలో వికేంద్రీకృత విధానాన్ని రద్దు చేసి ఆ స్థానంలో రాష్ట్రస్థాయి విధానాన్ని తీసు కొచ్చారని పేర్కొంది. తద్వారా ప్రభుత్వ ఖజానాకు రూ.400 కోట్ల మేర నష్టం వాటిల్లిందని ఆ రిపోర్టులో వివరించింది. ప్రభుత్వ అనుమతులు రాకుండానే టెండర్ పత్రాలు సిద్ధం చేశారని తెలిపింది. కార్టన్ రవాణా ఖర్చు రూ.19.68కి బదులు రూ.35కి పెంచారని చెప్పింది. మద్యం రవాణా టెండర్లలో రూ.192 కోట్ల అడ్డగోలు దోపిడీ చేశారని పేర్కొంది. సిగ్మా, ప్రసాద్ ట్రాన్స్‌పోర్ట్ కంపెనీలకు లబ్ధి కలిగేలా.. టెండర్ నిబంధనలు రూపొందించా రని స్పష్టం చేసింది. షెల్ కంపెనీలు, పెట్రోల్ బంకులు, బినామీల ద్వారా నగదు మళ్లించారని పేర్కొంది. వాసుదేవరెడ్డి బంధువు విజయ నరసింహారెడ్డి(ఏ2) పేరుతో ఉన్న కంపెనీలకు నిధులు బదిలీ అయ్యాయని తెలిపింది. నిందితుల నుంచి హార్డ్ డిస్కులు, ల్యాప్ టాప్‌లు, పెన్ డ్రైవ్స్ స్వాధీనం చేసుకున్నట్లు వివరించింది. ఇందులో కారుమూరి సునీల్, రాజ్ కసిరెడ్డి పాత్ర కీలకమని రిమాండ్ రిపోర్ట్‌లో స్పష్టం చేసింది. మద్యం రవాణా టెండర్ల కేసులో విజయవాడలోని ఏసీబీ కోర్టు రెండు వారాలు రిమాండ్ విధించింది. వాసుదేవరెడ్డి, రాజ్‌కసిరెడ్డి, సునీల్‌లను జైలుకు తరలించాలని ఆదేశించింది. హైదరాబాద్‌లో ఉన్న నింది తులను పీటీ వారెంట్‌తో సీఐడీ సిట్ అధికారులు విజయవాడకు తరలించి కోర్టులో హాజరుపరిచారు.



# ఆక్వా కల్చర్ రంగాన్ని ఆదుకోండి

- సోయాబీన్ మీల్ దిగుమతికి అనుమతివ్వండి
- అమరావతిలో ఎన్ఎఫ్‌డీబీ కార్యాలయం అవసరం
- డీజీఎఫ్‌టీ ద్వారా ఫిష్ మీల్ ఎగుమతి నియంత్రణ
- ఎఫ్‌సీవీ పొగాకు ఎగుమతిని ప్రోత్సహించండి
- ఏరియేటర్లు, ప్రాసెస్ చేయని పొగాకుపై జీఎస్టీ తగ్గించండి
- ముగ్గురు కేంద్రమంత్రులకు సీఎం చంద్రబాబు లేఖలు



అమరావతి (చైతన్యరథం): జన్యుపరంగా మార్పు చేసిన సోయాబీన్ మీల్‌ను దిగుమతి చేసుకునేందుకు రొయ్యల మేత తయారీదారులకు అనుమతి ఇవ్వాలని ముఖ్యమంత్రి చంద్రబాబు కేంద్ర మత్స్య, పశు సంవర్ధక శాఖ మంత్రి రాజీవ్ రంజన్‌సింగ్ కు లేఖ రాశారు. రొయ్యల మేత తయారీలో ప్రధాన ముడిసరుకైన సోయాబీన్ మీల్ ధరలు విపరీతంగా పెరగడంతో మేత తయారీ ఖర్చులు పెరిగాయని వివరించారు. దీనివల్ల రొయ్యల రైతులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని లేఖలో పేర్కొన్నా రు. దేశంలో రొయ్యల మేత కొరతను తీర్చేందుకు, ధరల నియంత్రణకు సోయాబీన్ మీల్ దిగుమతికి అనుమతి ఇవ్వాలని కోరారు. 2021లోనూ రొయ్యల మేత తయారీదారులకు పరిమిత స్థాయిలో దిగుమతి చేసుకునేందుకు అనుమతులిచ్చారని లేఖలో పేర్కొన్నారు. ఈక్వెడార్ నుంచి పెరిగిన రొయ్యల ఉత్పత్తి, ఎగుమ తుల వల్ల అంతర్జాతీయ మార్కెట్లలో దేశీయ ఉత్పత్తులకు ఇబ్బం దులు ఎదురవుతున్నాయన్నారు. అమెరికా, చైనా, యూరోప్ లాంటి ప్రధాన మార్కెట్లలో భారతీయ రొయ్యల ఎగుమతులు తీవ్ర పోటీని ఎదుర్కుంటున్నాయని తన లేఖలో వివరించారు. జన్యుమార్పిడి చేసిన సోయాబీన్‌ను వ్యవసాయానికి, విత్తన ఉత్ప త్తికి వినియోగించే అవకాశం లేదని తద్వారా జీవ వైవిధ్యానికి దేశీయ వంగడాలకు ముప్పు లేదని వివరించారు. ప్రభుత్వం సోయాబీన్ మీల్ దిగుమతికి అనుమతి ఇస్తే రొయ్యల మేత పరిశ్రమకు నాణ్యమైన ముడిసరుకు అందుబాటులోకి వస్తుందని స్పష్టం చేశారు. లక్షలాది మంది రొయ్యల రైతులు, కార్మికులకు ఉపాధి కలుగుతుందని, తద్వారా విదేశీ మారకద్రవ్యం లభిస్తుందని తెలిపారు.

### బ్లూ ఎకానమీకి సహకారం ఇవ్వండి

ఆంధ్రప్రదేశ్‌లో ఆక్వా రంగాన్ని మరింత అభివృద్ధి చేయటంతో పాటు ఎప్పటికప్పుడు సహకారం అందించేందుకు వీలుగా జాతీ య మత్స్య అభివృద్ధి బోర్డు కార్యాలయం అమరావతిలో ఏర్పాటు చేయాలని సీఎం మరో లేఖలో మంత్రిని కోరారు. ఈ ఏడాది జూన్ 5 తేదీన విశాఖలో జరిగిన సీఫుడ్ ఎక్స్‌పోర్ట్స్ వర్క్‌షాప్‌లో అమరావతిలో ఎన్ఎఫ్‌డీబీ ప్రాంతీయ కార్యాలయం ఏర్పాటుకు హామీ ఇచ్చిన విషయాన్ని గుర్తుచేశారు. ఈ మేరకు అమరావతి లోని నెక్కల్లు గ్రామంలో 7.89 ఎకరాల ప్రభుత్వ భూమిని ఎన్ఎఫ్‌డీబీ ప్రాంతీయ కార్యాలయం, శిక్షణ కేంద్రం, పార్క్, ప్రజల సందర్శనార్థం ఆక్వేరియం ఏర్పాటు కోసం కేటాయించా మన్నారు. తక్షణం ఈ భూమిని స్వాధీనం చేసుకుని నిర్మాణాలు ప్రారంభించాలని కేంద్ర మంత్రిని కోరారు. 2028 నాటికల్లా ప్రాంతీయ కార్యాలయం, అక్వేరియం, శిక్షణా కేంద్రాల పనులు పూర్తి చేసి అందుబాటులోకి తేవాలని కోరారు. ఈ ప్రాంతీయ కేంద్రం బ్లూ ఎకానమీ అభివృద్ధికి ప్రధాన కేంద్రంగా మారుతుం దని వివరించారు.

### వాణిజ్య, పరిశ్రమల మంత్రి పీయుష్ గోయల్‌కు లేఖ

ఆంధ్రప్రదేశ్‌లోని అక్వా కల్చర్ రంగాన్ని కాపాడేలా చర్యలు తీసుకోవాలని కేంద్ర వాణిజ్యం, పరిశ్రమల శాఖ మంత్రి పీయుష్ గోయల్‌కు సీఎం చంద్రబాబు లేఖ రాశారు. ఈక్వెడార్ నుంచి అమెరికా, చైనా, యూరోప్ లాంటి దేశాలకు ఎగుమతులు పెరగ టంతో అంతర్జాతీయ మార్కెట్లో రొయ్యల ధరలు గణనీయంగా పడిపోయాయని తెలిపారు. దేశంలో ఫిష్ మీల్ లభ్యతను క్రమ బద్ధీకరించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రస్తుతం రొయ్యల ఫీడ్‌లో ఉపయోగించే చేప పొడిని 5 శాతం ప్రోత్సాహకాలతో ఎగుమతికి అనుమతిస్తున్నారని తెలిపారు. ఈ కారణంగా దేశీయ ఫీడ్ తయారీదారులు ఎక్కువ ధరలకు కొనుగోలు చేయాల్సి వస్తోందన్నారు. డీజీఎఫ్‌టీ ద్వారా ఎగుమతులను నియంత్రించా లని కోరారు. దేశీయ రొయ్యల ఫీడ్ తయారీదారుల అవసరాలు తీరిన తర్వాతే ఎగుమతులకు అనుమతించాలని కోరారు. జీఎం సోయాబీన్ మీల్ దిగుమతికి కూడా అనుమతి ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

### నిర్యాత్ ప్రోత్సాహన్ పథకం వర్తింపజేయాలి

ఏపీ నుంచి ఎఫ్‌సీవీ పొగాకు ఎగుమతులకు ప్రోత్సాహకాలు కల్పించాలని కోరారు. లక్షలాది మంది రైతు కుటుంబాలకు ఉపా ధి కల్పిస్తూ విదేశీ మారకద్రవ్యాన్ని ఆర్జించేందుకు దోహద పడుతోందని వెల్లడించారు. దేశంలోని పొగాకు ఉత్పత్తిలో ఎఫ్‌సీవీ పొగాకు 70 శాతం మేర ఎగుమతి అవుతోందని వెల్లడిం చారు. జింబాబ్వే, టాంజానియా లాంటి దేశాల్లోని ఎగుమతి దారులకు ఆయా దేశాలు రాయితీలు, సుంకాల మినహాయింపు ఇస్తున్నాయని తెలిపారు. భారతీయ పొగాకు ఎగుమతిదారులకు ఎలాంటి మద్దతు లేకపోవటంతో తీవ్రమైన పోటీ ఎదుర్కొంటు న్నారని తెలిపారు. ఆగస్టు 2021లో రోడ్‌టెప్ పథకం కింద టీ, కాఫీ, మసాలా దినుసులు లాంటి వ్యవసాయ వస్తువులను చేర్చిన ప్పటికీ ప్రాసెస్ చేయని పొగాకును (హెచ్ఎస్ కోడ్ 2401) మాత్రం ఈ జాబితాలో చేర్చలేదన్నారు. సమాన వడ్డీ పథకం, నిర్యాత్ ప్రోత్సాహన్ లాంటి పథకాల కింద ఎఫ్‌సీవీ పొగాకుకు సబ్సిడీ లేకపోవటంతో ఎగుమతిదారులకు భారం పడుతోందని సీఎం వివరించారు. తక్షణమే ప్రాసెస్ చేయని పొగాకు (హెచ్ఎస్ కోడ్ 2401-2401 10, 2401 20, 2401 30) రకాలను ఇతర వ్యవసాయ ఉత్పత్తులతో పాటు రోడ్‌టెప్ పథకం కింద ప్రయోజనాలు వర్తింపజేయాలని కోరారు.

### కిసాన్ క్రెడిట్ కార్డుపై రూ.5 లక్షల టాప్ అప్ ఇవ్వండి

ఆక్వా కల్చర్ రంగాన్ని ఆదుకునేలా ఆక్వా కల్చర్ ఏరియేటర్లపై జీఎస్టీని 18 నుంచి 5 శాతానికి తగ్గించాలని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌ను మరో లేఖలో కోరారు. భారత- అమెరికా వాణిజ్య ఒప్పందంతో ఆక్వా దిగుమతులపై సుంకం 10 శాతానికి తగ్గినా ఇంకా చట్టపరమైన అనిశ్చితి కొనసాగుతోందని, టారిఫ్ సంక్షోభంపై కేంద్ర ఆర్థిక శాఖ జోక్యం చేసుకోవాలని కోరారు. కిసాన్ క్రెడిట్ కార్డుపై రూ.5 లక్షల వరకూ వన్ టైమ్ టాప్ అప్ ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. దేశీయ మార్కెటింగ్ కోసం ఎన్ఎఫ్‌డీబీ ద్వారా రూ.100 కోట్ల కార్పస్ ఫండ్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. విలువ ఆధారిత ఉత్పత్తులకు ప్రోత్సాహం కల్పించేందుకు రొయ్య ఎగుమతులను పెంచేలా సబ్సీడీలు ఇవ్వ టంతో పాటు సామర్థ్యాలను పెంచేలా చూడాలని లేఖలో పేర్కొన్నా రు. అలాగే ప్రాసెస్ చేయని పొగాకు హెచ్ఎస్ఎన్ కోడ్ 2401 పై జీఎస్టీని 40 నుంచి 28 శాతానికి తగ్గించాలని కోరారు. ఏపీలోని లక్షలాది మంది పొగాకు రైతులతో పాటు డీలర్లు, ఎక్స్ పోర్టర్లకు ఊరట కలిగించేలా నిర్ణయం తీసుకోవాలని విజ్ఞప్తి చేశా రు. జీఎస్టీ పెంపు వల్ల వర్కింగ్ క్యాపిటల్ సమస్యలు తలెత్తి సకా లంలో రైతులకు చెల్లింపులు చేయటంలో ఇబ్బందులు తలెత్తుతు న్నాయని తెలిపారు. జీఎస్టీ తగ్గింపు కారణంగా ఆర్థిక లావాదేవీలు మెరుగవుతాయని స్పష్టం చేశారు.

## ఉత్తరాంధ్ర మణిహారంగా

# భోగాపురం ఎయిర్‌పోర్ట్

- ఆగస్టు 1న మోదీ చేతులమీదుగా ప్రారంభం
- జీఎమ్మార్ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్,
- ఏవియేషన్ హబ్ వర్శిటీ, ఎడ్యుసిటీలకు శ్రీకారం
- సంప్రదాయ నృత్యరూపాలతో ఘనస్వాగతం పలకాలి
- 10 రోజుల పాటు విస్తృత ప్రచారం నిర్వహించాలి
- వేదికపై అరకు కాఫీ బ్రాండింగ్ కనిపించాలి
- ప్రధాని పర్యటన ఏర్పాట్లపై సమీక్షలో సీఎం చంద్రబాబు



అమరావతి (చైతన్యరథం): భోగాపురంలో నిర్మించిన అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం ఉత్తరాంధ్రకు మణిహారంగా నిలుస్తుందని ముఖ్యమంత్రి చంద్రబాబు వ్యాఖ్యానిం చారు. ఆగస్టు 1 తేదీన ప్రధాని మోదీ చేతులమీదుగా ఈ అంతర్జాతీయ విమానాశ్రయాన్ని ప్రారంభించనున్న నేపథ్యంలో ఆ కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లపై సోమవారం ఉన్నతాధి కారులతో సమీక్షించారు. ఉత్తరాంధ్రలో ప్రతిష్టాత్మకంగా నిర్మించిన భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభోత్సవ వేడుకలను అత్యంత వైభవంగా, చారిత్రాత్మక ఘట్టంగా నిర్వహిం చాలని ఆదేశించారు. ప్రధాని మోదీకి ఉత్తరాంధ్ర ప్రజల సంస్కృతి, సంప్రదాయాలను తెలుపుతూ థింసా, సవర, కొమ్ము కోయ తదితర సంప్రదాయ నృత్య రూపాలతో ఘనస్వాగతం పలకాలని తెలిపారు. ఆగస్టు 1న విమానాశ్రయ ప్యాసింజర్ టెర్మినల్ భవనాన్ని ప్రారంభించడంతో పాటు.. జీఎంఆర్ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్, ఏవియేషన్ హబ్-యూనివర్సిటీతో పాటు జీఎంఆర్-మాన్సాస్ ఎడ్యుసిటీలను ప్రధాని మోదీ లాంఛనంగా ఆవిష్కరి స్తారని అధికారులు తెలిపారు. ఉత్తరాంధ్ర మణిహారంగా నిలవ నున్న ఈ విమానాశ్రయం లాజిస్టిక్స్ కేంద్రంగా గ్లోబల్ కనెక్టివిటీని అందిస్తూ రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి ఒక గేమ్ చేంజర్‌లా మారుతుందని సీఎం స్పష్టం చేశారు.

### ఉత్తరాంధ్ర అంతటా వేడుకగా ప్రారంభోత్సవం

ఈ ప్రాజెక్టు కోసం భూములిచ్చిన రైతులు, యజమానులను గౌరవించేలా వారికి ఒకసారి ఉచిత విమాన ప్రయాణ అవకాశం కల్పించాలని అధికారులను ఆదేశించారు. ఎయిర్‌పోర్టు ప్రారంభో త్సవం సందర్భంగా బహిరంగ సభను నిర్వహించాలని సూచించారు. సభకు వచ్చే ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ట్రాఫిక్ మళ్లింపు, ప్రత్యేక పార్కింగ్ స్లాట్లతో పాటు పటిష్ట బందో బస్తు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. సభకు వచ్చే వారి కోసం అల్పాహారం, భోజనం, తాగునీటి లాంటి సదుపాయాలు కల్పించా లన్నారు. మంగళవారం నుంచి జూలై 31 వరకూ అల్లూరి సీతా రామరాజు అంతర్జాతీయ విమానాశ్రయంపై విస్తృతంగా ప్రచారం నిర్వహించాలని సూచించారు. రానున్న 10 రోజుల్లో ఉత్తరాంధ్ర జిల్లాల్లోని ప్రతి ఇంటా ఈ ప్రారంభోత్సవ వేడుక స్ఫూర్తి చేరేలా కార్యక్రమాలు చేపట్టాలని తెలిపారు. అంతర్జాతీయ వేదికలపై ప్రధాని మోదీ ప్రమోట్ చేస్తున్న అరకు కాఫీ బ్రాండింగ్ కూడా వేదికగా దీనిని మలచాలని సూచించారు. మంగళవారం నుంచి చేపట్టే కార్యక్రమాల్లో ఉత్తరాంధ్రకు చెందిన ప్రజాప్రతినిధులు అంతా హాజరుకావాలని నిర్దేశించారు. ఈ సమీక్షకు హోం మంత్రి అనిత, సీఎస్ సాయిప్రసాద్, ఐఅండ్ఐ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.టి.కృష్ణబాబు, విజయనగరం, శ్రీకాకుళం జిల్లా కలెక్టర్లు, ఎస్పీలు, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీని వాసరావు, సివిల్ ఏవియేషన్ అధికారులు, జీఎంఆర్ ప్రతినిధులు హాజరయ్యారు.

# సకల సౌకర్యాలతో 'తల్లి-బిడ్డ ఎక్స్‌ప్రెస్'

- త్వరలో అందుబాటులోకి 500 కొత్త వాహనాలు
- ఏటా 2.75 లక్షల మంది బాలింతలకు మేలు
- పరిశీలించిన ముఖ్యమంత్రి చంద్రబాబు
- బ్రాండింగ్ డిజైన్లకు ఆమోదం







అమరావతి(చైతన్యరథం): రాష్ట్రంలో మాతాశిశు సంక్షేమానికి అత్యున్నత ప్రాధాన్యత ఇస్తున్న ప్రభుత్వం గర్భిణులు, బాలింతలు, నవజాత శిశువులకు మరింత నాణ్యమైన, సురక్షితమైన రవాణా సేవలు అందించేందుకు కొత్తగా 'తల్లి-బిడ్డ ఎక్స్‌ప్రెస్' వాహనాలను అందుబాటులోకి తెస్తోంది. ఈ వాహనాలను సోమవారం ముఖ్యమంత్రి చంద్రబాబు సీఎం క్యాంపు కార్యాలయంలో పరి శీలించారు. ఈ సందర్భంగా కార్యక్రమం కోసం సిద్ధం చేసిన వాహనాల రూపకల్పన, భద్రతా ప్రమాణాలు, తల్లి-శిశువులకు కల్పించిన ప్రత్యేక సౌకర్యాలు, వాహనాలపై రూపొందించిన బ్రాండింగ్ నమూనాలను ముఖ్యమంత్రి క్షుణ్ణంగా పరిశీలించారు. ప్రజలకు ఈ సేవలపై స్పష్టమైన అవగాహన కలిగేలా, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాన్ని ప్రతిబింబించేలా రూపొందించిన బ్రాండిం గ్ డిజైన్లకు సీఎం ఆమోదం తెలిపారు.

### అందుబాటులోకి 500 వాహనాలు

ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవించిన బాలింతలు, వారి నవజాత శిశువులు, సహాయకులను ఉచితంగా వారి ఇళ్లకు చేర్చడంతో పాటు అధిక ప్రమాద గర్భిణులు, తీవ్ర రక్తహీనతతో బాధపడే గర్భిణులకు వైద్యపరీక్షల నిమిత్తం ఆసుపత్రులకు వచ్చే గర్భిణులకు ఈ వాహనాలతో రవాణా సేవలు అందించనున్నారు. ఈ కార్యక్రమం కోసం రాష్ట్రవ్యాప్తంగా 500 ప్రత్యేక ఎస్‌యూవీ/ ఎంయూవీ వాహనాలను వినియోగించనున్నారు. ప్రతి సంవత్సరం సుమారు 2.75 లక్షల మంది బాలింతలు ఈ సేవల ద్వారా ప్రయోజనం పొందనున్నారు.

### రియల్ టైమ్ పర్యవేక్షణకు జీపీఎస్ వ్యవస్థ

వాహనాల్లో తల్లి-శిశువుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రత్యేకంగా సౌకర్యాలను కల్పించారు. వెనుక సీట్లలో సీటు బెల్టు లు, బాలింతలు సులభంగా ఎక్కేందుకు ఫుట్‌రెస్ట్, ఎయిర్ కండిషనింగ్, ఫస్ట్ ఎయిడ్ కిట్, ఫైర్ సేఫ్టీ పరికరాలు ఏర్పాటు చేశారు. అదేవిధంగా ప్రతి వాహనంలో జీపీఎస్ ట్రాకింగ్ వ్యవస్థ ఏర్పాటు చేయడం ద్వారా రియల్ టైమ్ పర్యవేక్షణకు అవకాశం కల్పించారు. వాహనాల పరిశీలన సందర్భంగా అధికారులు కార్య క్రమం అమలు విధానం, వాహనాల నిర్వహణ, రాష్ట్రవ్యాప్తంగా సేవల విస్తరణపై ముఖ్యమంత్రికి వివరించారు. వాహనాలపై అధికారిక స్టిక్కరింగ్ పూర్తి చేసి రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో వీటి సేవలు అందించనున్నారు. ఈ కార్యక్రమంలో వైద్య ఆరోగ్య-కుటుంబ సంక్షేమ శాఖ కార్యదర్శి వీరపాండ్యన్, ఆ శాఖ ఉన్నతా ధికారులు, జాతీయ ఆరోగ్య మిషన్ అధికారులు పాల్గొన్నారు.

## గ్రామీణ ప్రతిభావంతులకు

# వదాన్య ఫౌండేషన్ చేయూత

**జాతీయ సంస్థల్లో ముగ్గురికి సీట్లు - విద్యార్థులకు మంత్రి లోకేష్ అభినందనలు**







అమరావతి (చైతన్యరథం): వదాన్య ఫౌండేషన్ నిర్వాహకులు తమ ఆదాయం నుంచి కొంత భాగాన్ని పేద పిల్లల విద్యాభ్యాసం కోసం ఖర్చు చేసి ఆర్థికంగా చేయూతనిస్తున్నారు. ఇచ్చిన ఆసరాను అందిపుచ్చుకుని ఉత్తమ ర్యాంకులు సాధించి జాతీయ సంస్థల్లో ఈ ఏడాది ముగ్గురు విద్యార్థులు సీట్లు కూడా సాధించారు. వారికి మంత్రి నారా లోకేష్ సోమవారం అభినందనలు తెలిపారు. శ్రీసత్యసాయి జిల్లా కొత్తచెరువు గ్రామానికి చెందిన అశోక్ పడపాటి వృత్తిరీత్యా హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రతిభగల పేద విద్యార్థులకు చేయూతను అందించాలన్న సంకల్పంతో 2010లో అశోక్, అతని స్నేహితులు తమ జీతాల నుంచి కొంతభాగాన్ని పక్కనబెట్టి వదాన్య ఫౌండేషన్‌ను స్థాపించారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఒక టాలెంట్ టెస్ట్ నిర్వహించి ప్రతిభగల విద్యార్థులను ఎంపిక చేసి వారికి ఐఐటీ, నీట్ వంటి జాతీయస్థాయి పోటీ పరీక్షల్లో శిక్షణ ఇస్తున్నారు. అందులో భాగంగా ఈ ఏడాది వదాన్య ఫౌం డేషన్ ద్వారా శిక్షణ పొందిన జుగేష్‌కుమార్ ఐఐటీ మద్రాస్, తులసి కార్తీక్ భారతీయ విజ్ఞాన సంస్థ (ఐఐఎస్‌సీ) బెంగళూరు, యశ్వంత్ కుమార్‌రెడ్డి ఐఐటీ రూర్కీలో ప్రవేశాలు పొందారు. వీరంతా పదో తరగతి వరకు గ్రామీణ ప్రభుత్వ పాఠశాలల్లో చదివి ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాల నుంచి వచ్చినవారే. వదా న్య ఫౌండేషన్ అందించిన నిరంతర మార్గదర్శకత్వం, విద్యా సహాయం, జేఈఈ అడ్వాన్స్‌డ్ శిక్షణతో వారు ఈ ఘనతను సాధించారు.

### పోటీ పరీక్షలకు సహకారం తీసుకుంటాం

వదాన్య ఫౌండేషన్ వ్యవస్థాపకుడు అశోక్ పడపాటి, ఈ ఏడాది జాతీయస్థాయి సంస్థల్లో ర్యాంకులు సాధించిన ముగ్గురు విద్యార్థు లు సోమవారం ఉండవల్లి నివాసంలో మంత్రి నారా లోకేష్‌ను కలిశారు. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతిభావంతులైన విద్యార్థులను చిన్న వయసులోనే గుర్తించి ప్రోత్సహిస్తున్న ఫౌండేషన్ వ్యవస్థాప కుడిని లోకేష్ అభినందించారు. 9,10వ తరగతి విద్యార్థుల కోసం 500కు పైగా ప్రాక్టీస్ ప్రశ్నలతో రూపొందించిన వదాన్య టాలెంట్ టెస్ట్ ప్రశ్నల పుస్తకాన్ని లోకేష్‌కు అందజేశారు. ఫౌండే షన్ కృషిని మంత్రి ప్రశంసిస్తూ రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు పోటీ పరీక్షలకు అవసరమైన కొశ్చన్ బ్యాంక్ రూప కల్పనకు వదాన్య సహకారం తీసుకుంటామని తెలిపారు. అలానే ఇటువంటి టాలెంట్ టెస్ట్ రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించి ప్రతిభా వంతులను ప్రోత్సహించే అంశాన్ని పరిశీలిస్తామని చెప్పారు.

చైతన్యరథం

# గిరిజన సంఘాలతో త్వరలో ప్రభుత్వం చర్చలు

- గిరిజన హక్కులకు ప్రథమ ప్రాధాన్యమిస్తాం
- జీవో 3 ప్రయోజనాలు దక్కేలా ప్రత్యామ్నాయాలు
- గత ప్రభుత్వం దానిని పరిరక్షించలేకపోయింది
- చట్టపరమైన అడ్డంకులు అధిగమించేలా చూస్తాం
- 1/70 అమలులో ఎటువంటి అనుమానాలు వద్దు
- జోన్-1లోకి అల్లూరి సీతారామరాజు జిల్లా, జోన్-2లోకి పోలవరం జిల్లాను చేర్చాలి
- బాక్సైట్ విషయంలో ఆందోళన వద్దు.. అవినీతితో అంతర్జాతీయ సమస్యగా మార్చారు
- ఎస్టీల సంక్షేమం, అభివృద్ధిపై సమీక్షలో సీఎం చంద్రబాబు



అమరావతి(చైతన్యరథం): రాష్ట్ర ప్రభుత్వం గిరిజన హక్కులకు ప్రథమ ప్రాధాన్యం ఇస్తుందని, ఈ విషయంలో గిరిజన ప్రజలు ఎటువంటి ఆందోళనలు.. అనుమానాలకు గురి కావాల్సిన అవసరం లేదని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. రాష్ట్రంలోని గిరిజన ప్రాంతాల ప్రజల సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలపై ఆ శాఖ అధికారులతో సచివాలయంలో సోమవారం సమీక్షించా రు. జీవో 3పై గత ప్రభుత్వంలో సుప్రీంకోర్టు తీర్పు, తదనంతర పరిణామాలపై చర్చించారు. స్థానికులకే ఉద్యోగాలు దక్కడం సహా పలు అంశాలపై గిరిజన ప్రజల ఆకాంక్షలపైనా చర్చించారు. ఉమ్మడి రాష్ట్రంలో 2000 సంవత్సరంలో జీవో నెంబర్ 3 తీసుకు వచ్చాం. దీని ద్వారా షెడ్యూల్ ప్రాంతాల్లో స్థానిక గిరిజనులకే 100 శాతం రిజర్వేషన్లు దక్కేలా చూశాం. దాదాపు 20 ఏళ్లు అమల్లో ఉన్న ఈ ఉత్తర్వును గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసింది. నాటి ప్రభుత్వం ఈ అంశంపై బలమైన వాదనలు వినిపించక పోకవడం వల్ల సుప్రీంకోర్టు 2020 ఏప్రిల్ 22న కొట్టేసింది. దీంతో రెండు దశాబ్దాల పాటు గిరిజనులు పొందిన ప్రయోజనా లు కొనసాగించే వీలు లేకుండా పోయింది. నాటి ప్రభుత్వం ఈ సమస్యపై కనీసం స్పందించలేదు. జీవో నెంబర్ 3కి ఉన్న అన్ని ప్రత్యామ్నాయ అవకాశాలను కూటమి ప్రభుత్వం పరిశీలిస్తోంది. సుప్రీంకోర్టు ఐదుగురు సభ్యుల ధర్మాసనం స్పష్టమైన తీర్పు నేప థ్యంలో ఏ విధంగా న్యాయం చేయాలనే దానిపై కసరత్తు చేస్తున్నామని తెలిపారు.

## త్వరలో గిరిజన సంఘాలతో చర్చలు

స్థానికులకే ఉద్యోగాలు అంశంతో పాటు గిరిజనులకు సంబంధించి పలు సమస్యలపై గిరిజన సంఘాలతో వెంటనే చర్చించాలని అధికారులను ఆదేశించారు. ఆయా అంశాలపై గిరిజన సంఘాలను ఆహ్వానించి ఉన్నతాధికారులు, గిరిజన ప్రజా ప్రతినిధులు చర్చించాలని సూచించారు. జీవో నెంబర్ 3 ప్రయో జనాలు దక్కేలా చేస్తున్న ప్రయత్నాలను వివరించడంతో పాటు ఈ ప్రక్రియలో వారిని కూడా భాగస్వాములు చేయాలని సూచిం చారు. చట్టపరమైన అడ్డంకులు అధిగమించడానికి గిరిజన సంఘాల సూచనలు కూడా తీసుకోవాలన్నారు. అదేవిధంగా అల్లూరి సీతారామరాజు జిల్లాను జోన్ 1లోకి మార్చాలని, పోలవరం జిల్లాను జోన్ 2లో చేర్చాలని సీఎం ఆదేశించారు. ఈ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. బాక్సైట్ మైనింగ్ విషయంలో గిరిజనులు ఎటువంటి ఆందోళన చెందవ ద్దని చెప్పారు. గత పాలకుల అవినీతి కారణంగా బాక్సైట్ లీజుల అంశం ఇప్పుడు అంతర్జాతీయ కోర్టులకు వెళ్లిందని గుర్తు చేశారు. గిరిజనుల హక్కులకు, మనోభావాలకు వ్యతిరేకంగా ఎటువంటి చర్యలు ఉండవని.. ఈ విషయంలో ఎవరి ట్రాప్‌లోనూ పడవద్దని సూచించారు. అలాగే 1/70 అమలు విషయంలో ఎటువంటి అనుమానాలు అవసరం లేదని.. ఇదే విషయాన్ని గిరిజన సంఘా లకు చెప్పాలని సూచించారు. అరకు కాఫీని ప్రమోట్ చేసినా.. గిరిజన ప్రాంతాల్లో ఆరోగ్యం, విద్య, రవాణా సదుపాయాల కల్పనకు పెద్దపీట వేసినా అది కూటమి ప్రభుత్వం గిరిజనులపై చూపిన బాధ్యత అని పేర్కొన్నారు. గిరిజన ప్రాంతాల్లో కూడా పూర్తిస్థాయి అభివృద్ధి జరిగినప్పుడే..వారి జీవన ప్రమాణాలు మారినప్పుడే నిజమైన అభివృద్ధి అని ప్రభుత్వం నమ్ముతుందన్నారు.

గిరిజన సంఘాలతో చర్చలకు, వారి సమస్యల పరిష్కా రానికి ప్రభుత్వం ఎప్పుడూ సిద్ధంగా ఉంటుందని స్పష్టం చేశారు. ఈ విషయంలో చొరవ తీసుకోవాలని గిరిజన ప్రజాప్రతినిధులకు, గిరిజన సంక్షేమ శాఖ అధికారులకు సూచించారు. సీఎం సూచన మేరకు త్వరలోనే గిరిజన సంఘాలను ఆహ్వానించి చర్చించను న్నారు. ఈ సమీక్షలో మంత్రి సంధ్యారాణి, సీఎస్ సాయిప్రసాద్, గిరిజన సంక్షేమ శాఖ సెక్రటరీ నాయక్, జీఏడీ ప్రిన్సిపల్ సెక్రట రీ రావత్, న్యాయశాఖ అధికారులు పాల్గొన్నారు.

# రెండో విడత 'మన ఇల్లు-మన లోకేష్'

- దశాబ్దాల మొండి సమస్యకు మంత్రి లోకేష్ శాశ్వత పరిష్కారం
- 3 వేల మందికి పట్టాల పంపిణీకి ఏర్పాట్లు
- మంగళగిరి నియోజకవర్గ ప్రజలకు ప్రయోజనం
- నేటి నుంచి రెండురోజుల పాటు కార్యక్రమం




మంగళగిరి(చైతన్యరథం): ఎన్నికల సమయంలో ఓట్ల కోసం అలవికాని వాగ్దానాలు చేసి అవసరం తీరాక మొఖం చాటేసే సాం ప్రదాయ రాజకీయాలకు భిన్నంగా మంగళగిరి ప్రజలకు ఇచ్చిన ప్రతి మాటా నిలబెట్టుకునేందుకు మంత్రి నారా లోకేష్ చిత్తశుద్ధితో కృషిచేస్తున్నారు. దశాబ్దాలుగా మంగళగిరి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యకు శాశ్వత పరిష్కారం చూపారు. మంగళగిరి నియోజక వర్గ పరిధిలో దశాబ్దాలుగా ప్రభుత్వ భూముల్లో నివసిస్తున్న సుమారు 3 వేల మందికి ఈనెల 21,22 తేదీల్లో మన ఇల్లు – మన లోకేష్ పేరిట రెండో విడత శాశ్వత పట్టాలు పంపిణీ చేసేం దుకు రంగం సిద్ధం చేశారు. మంగళగిరి డీజీపీ ఆఫీసు సమీపం లోని సీకే కన్వెన్షన్ హాలులో రెండో విడత పట్టాలు పంపిణీ చేయనున్నారు. మంగళగిరి నియోజకవర్గ పరిధిలోని కొండవాలు ప్రాంతాలు, అటవీ, దేవాలయ భూముల్లో వేలాది మంది ప్రజలు ఇళ్లు నిర్మించుకుని దశాబ్దాలుగా నివాసం ఉంటూ వస్తున్నారు. అయితే వారికి సంబంధిత భూములపై ఎటువంటి అధికారిక హక్కులు ఇప్పటివరకు లేవు. దీంతో సంబంధిత స్థలాలను తమ వారసులకు ఇవ్వాలన్నా, అత్యవసర సమయాల్లో రుణాలు తీసుకో వాలన్నా సాధ్యంకాని పరిస్థితులు నెలకొన్నాయి. మంగళగిరి ప్రజ లు ఎదుర్కొంటున్న ఈ జటిలమైన సమస్యను ఎన్నికలకు ముందు ప్రత్యక్షంగా చూసిన యువనేత లోకేష్ తాము అధికారంలోకి వస్తే ఈ మొండి సమస్యకు పరిష్కారం చూపుతానని భరోసా ఇచ్చారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాది లోపే 2025 ఏప్రిల్ నెలలో మంగళగిరి రత్నాల చెరువు, యర్రబాలెం, నీరుకొండ తదితర ప్రాంతాల్లో ప్రభుత్వ భూముల్లో నివసిస్తున్న 3002 మందికి నూతన వస్త్రాలు పెట్టి మరీ పట్టాలు పంపిణీ చేశారు. సుమారు రూ.1,000 కోట్ల విలువైన భూములను ఒక్కరూపాయి ఖర్చులేకుండా అర్హులైన పేదలకు శాశ్వత హక్కులు కల్పిస్తూ పట్టాలు అందజేశారు.

## మలివిడత అందించే శాశ్వత పట్టాల వివరాలు

మలివిడత పట్టాల పంపిణీ కార్యక్రమంలో మంగళగిరి, తాడేపల్లి మండలాల్లో సుమారు మూడువేల మందికి శాశ్వత పట్టాలు, ఎంజాయ్‌మెంట్ సర్టిఫికెట్స్‌ను మంత్రి లోకేష్ చేతులమీదుగా పంపిణీ చేయనున్నారు. రెండోవిడతలో పంపిణీ చేయబోతున్న పట్టాల విలువ ప్రస్తుత ఓపెన్ మార్కెట్ ప్రకారం సుమారు వెయ్యి కోట్లుగా ఉంది. మంగళగిరి గ్రామంలోని సర్వే నంబర్లు 232/1బీ1ఏ, 232/1బీ1బీ, 232/1బీ1సీలలో 92.12 ఎకరాలు, నవులూరు గ్రామంలోని సర్వే నంబర్ 115లో 8.46 ఎకరాల భూములు సెక్షన్ 22ఏ(1)(ఏ) కింద నిషేధిత ఆస్తుల జాబితాలో ఉన్నాయి. దీనివల్ల 1,622 నివాస గృహాలు ప్రభావితమై దీర్ఘకా లంగా ఆస్తి రిజిస్ట్రేషన్‌పై ఆంక్షలు విధించబడ్డాయి. ఫలితంగా బదిలీ, వారసత్వం, సంక్రమణ వంటి చట్టబద్ధమైన లావాదేవీలకు ఇప్పటివరకు అవకాశం లేకుండా పోయింది. ఈ స్థలాలపై నిషేధా న్ని తొలగిస్తూ ఆర్డీవో ద్వారా ధృవీకరించిన ప్రాపర్టీ ఎంజాయ్ మెంట్ సర్టిఫికెట్లను మంత్రి లోకేష్ అందజేయనున్నారు.

## స్టీల్ బ్రిడ్జ్ పట్టాలు

అమరావతి రాజధాని నగర ప్రాజెక్టులో భాగంగా బకింగ్‌హామ్ కాలువపై స్టీల్ బ్రిడ్జ్ నిర్మాణానికి సంబంధించి మంగళగిరిలోని కె.ఎల్.రావు కాలనీలో ఆక్రమణదారులుగా ఉన్న మొత్తం 81 మందిని గుర్తించారు. ప్రభావితమైన ఈ ఆక్రమణదారులకు పునరావాసం కల్పించేందుకు ఆత్మకూరు లేఅవుట్‌లో 34 ప్లాట్లను లాటరీ పద్ధతిలో కేటాయించారు. పంపిణీకి ప్రతిపాదించిన మొత్తం 81 స్టీల్ బ్రిడ్జ్ పట్టాలలో తాడేపల్లి మండలంలో 47, మంగళగిరి మండలంలో 34 కేసులు ఉన్నాయి.

## జీవో 30 క్రమబద్ధీకరణ పట్టాలు

జీవో 30 నిబంధనల ప్రకారం మొత్తం 906 క్రమబద్ధీకరణ పట్టాలను (150 చదరపు గజాల కంటే తక్కువ విస్తీర్ణం కలిగినవి) పంపిణీ చేయడానికి ప్రతిపాదించారు. వీటిలో 630 పట్టాలు తాడేపల్లి మండలానికి చెందినవి కాగా, 276 పట్టాలు మంగళగిరి మండలానికి సంబంధించినవి ఉన్నాయి.



# ప్రభుత్వ పాఠశాలలు చూసి అసూయపడాలి

# ఇందుకు అందరి ఆశీస్సులు ఉండాలి

- సమాజంలో మార్పునకు విద్యే ప్రధానం
- యువగళం పాదయాత్రలో సమస్యలు చూశా
- ఎంతమంది పిల్లలున్నా తల్లికి వందనం
- వర్తింపజేయాలని నాడే సంకల్పించాం
- మంగళగిరిని నెం.1గా తీర్చిదిద్దుతాం
- రెండో విడతలో మూడు వేల పట్టాలు
- నియోజకవర్గంలో 10 వేల ఇళ్లు నిర్మిస్తాం
- తల్లికి వందనం లబ్ధిదారులతో ముఖాముఖిలో మంత్రి లోకేష్



మంగళగిరి(చైతన్యరథం): ప్రభుత్వ పాఠశాలలను చూసి అసూయపడేలా వాటిని తీర్చిదిద్దుతామని మంత్రి నారా లోకేష్ తెలిపారు. మంగళగిరి నియోజకవర్గంలోని తల్లికి వందనం పథ కం లబ్ధిదారులతో మంగళగిరి బైపాస్ కొండపనేని టౌన్‌షిప్ పార్క్‌లో సోమవారం ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. తల్లికి వందనం పథకం అందుతున్న తీరు, తల్లికి వందనం కింద ప్రభుత్వం అందిస్తున్న ఆర్థికసాయం ఏ విధంగా ఉపయోగ పడు తుందన్న విషయాలపై ఆరా తీశారు. విద్యార్థుల తల్లుల నుంచి పలు సలహాలు, సూచనలు స్వీకరించారు.

ప్రభుత్వ పాఠశాలల బలోపేతమే లక్ష్యంగా ప్రజాప్రభుత్వం పనిచేస్తోంది. విద్యార్థుల అభ్యసన సామర్థ్యాల పెంపునకు కృషి చేస్తున్నాం. గతంలో ప్రైవే టు పాఠశాలలను చూసి అసూయపడే వాళ్లం. ఇప్పుడు ప్రభుత్వ పాఠశాలలను చూసి ప్రైవేటు పాఠశాలలు అసూయపడేలా చేస్తాం. నిడమర్రు పాఠశాలలో ప్రవేశాల కోసం విపరీతమైన పోటీ ఉంది. రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల్లో లీప్ పాఠశా లలను తీర్చిదిద్దుతాం. ఈ రోజు నేను ఈ స్థాయికి వచ్చానంటే కారణం విద్య. సమాజంలో మార్పునకు, రాష్ట్ర అభివృద్ధికి విద్యే ప్రధానం. ప్రజాప్రభుత్వంలో 16 వేల ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేశాం. ఈ ఏడాది మరో 3 వేల పోస్టులు భర్తీ చేస్తాం. 10 వేలకు పైగా పాఠశాలల్లో వన్ క్లాస్-వన్ టీచర్ విధానం తీసుకువచ్చాం. ఈ ఏడాది ప్రైవేటు పాఠశాలల నుంచి 1,06,000 మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలకు తరలివచ్చారని పేర్కొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల పనితీరు ఎలా ఉంది?

ప్రభుత్వ పాఠశాలల పనితీరు, బోధన ఎలా ఉందని లోకేష్ వారిని ప్రశ్నించారు. తల్లికి వందనం పథకం అందరికీ అందు తుందా అని ఆరా తీశారు. అందరికీ తల్లికి వందనం పథకం కింద ఆర్థికసాయం అందిందని మహిళలు వివరించారు. ఒకటో తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థులకు కూడా అంద రితో పాటు లబ్ధి చేకూర్చేలా తల్లికి వందనం పథకం జూలైలో అమలుకు నిర్ణయించినట్లు తెలిపారు. ఈ నెల 22 నుంచి 24వ తేదీలోగా ఆర్థికసాయం నిధులు తల్లుల ఖాతాల్లో జమ అవుతా యని వివరించారు. యువగళం పాదయాత్ర సమయంలో విద్యలో కర్నూలు వెనుకబడి ఉండటాన్ని గమనించానని, ఎంతమంది పిల్లలు ఉన్నా అందరికీ తల్లికి వందనం పథకం వర్తింపజేసి అమలుచేయాలని అప్పుడే సంకల్పించినట్లు చెప్పారు. ఈ సందర్భంగా మహిళలు మగ పిల్లలకు కూడా బ్యాడ్ టచ్ గురించి తరగతి గదిలో బోధించాలని, విద్యాసంవత్సరం పూర్తయిన తర్వా త పిల్లలకు స్పోకెన్ ఇంగ్లీష్ క్లాస్‌లు నిర్వహించాలని కోరారు. ఇందుకు చర్యలు తీసుకుంటామని, స్పోకెన్ ఇంగ్లీష్ క్లాస్‌లకు లైబ్రరీలను వినియో గించుకునేలా చర్యలు తీసుకుంటామని లోకేష్ తెలిపారు. తల్లికి వందనం పథకం కింద అందే ఆర్థిక సాయాన్ని పిల్లల భవిష్యత్ అవసరాల కోసం ఆదా చేస్తున్నట్లు మహిళలు వివరించారు.

## మార్పు మన ఇంటి నుంచే మొదలవ్వాలి

విద్యార్థులకు నైతిక విలువలతో కూడిన విద్యను అందిస్తున్నామని లోకేష్ చెప్పారు. ప్రముఖ ప్రవచన కర్త చాగంటి కోటేశ్వరరావుతో నైతిక విలువలపై పుస్తకాలు రూపొందించి విద్యార్థులకు అందజే శాం. మార్పు మన ఇంటి నుంచే మొదలవ్వాలి. మహిళలను అందరూ గౌరవించాలి. టెక్నాలజీ వల్ల మంచి, చెడూ రెండూ ఉంటాయి. మనం ఏది ఎంచుకున్నామనేది ముఖ్యం. ప్రతి కుటుంబం ఏఐ వినియోగించి నేర్చుకోవాలనేది సీఎం చంద్రబాబు గారి ఆలోచన అని పేర్కొన్నారు.

## నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతాం

మంగళగిరిలో 53 వేల ఓట్ల మెజార్టీతో గెలిపించాలని ప్రజలను కోరాను. ప్రజలు 91 వేల భారీ మెజార్టీతో నన్ను గెలిపించారు. మంగళగిరి నియోజకవర్గాన్ని ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దు తాం. మంగళగిరికి పరిశ్రమలు తీసుకువచ్చి స్థానిక యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తాం. ఇప్పటికే మొదటి విడత లో 3 వేల ఇళ్ల పట్టాలు అందజేశాం. రెండో విడతలో మరో 3 వేల పట్టాలు అందిస్తున్నాం. నియోజకవర్గంలో 10 వేల ఇళ్లు నిర్మిస్తామని తెలిపారు.







# ‘రామాయపట్నం’పై మాట్లాడే హక్కు లేదు

- తీవ్రస్థాయిలో ధ్వజమెత్తిన మంత్రి జనార్ధన్‌రెడ్డి
- సాక్షి కథనం అబద్ధాల పుట్ట అంటూ ఎద్దేవా
- గంగవరం వాటా విక్రయంపై సమాధానం చెప్పాలి
- జేఎస్‌డబ్ల్యు చీకటి ఒప్పందంపై జగన్‌కు సవాల్
- పీపీపీ లెక్కలతో బదులిచ్చిన మంత్రి జనార్ధన్‌రెడ్డి

అమరావతి (చైతన్య రథం): “రామాయపట్నం పోర్టుపై ఏవిధమైన వ్యాఖ్యలు చేసే నైతిక హక్కు వైసీపీకి లేదు. ప్రభుత్వ ఆస్తులను ప్రైవేటు సంస్థలకు ఇష్టారీతిన తెగనమ్మిన చరిత్ర వైసీపీదే” అని పెట్టుబడులు, మౌలిక సదుపాయాల మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి తీవ్రంగా ధ్వజమెత్తారు. రామాయపట్నం పోర్టుపై వైఎస్ జగన్‌రెడ్డి వ్యాఖ్యలతో సాక్షి పత్రికలో ప్రచురించిన కథనం పూర్తిగా అసత్యాలతో, వక్రీకరణలతో నిండి ఉందన్నారు.. ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు జగన్‌రెడ్డి తన సొంత మీడియాను మరోసారి వేదికగా ఉపయోగించుకోవడం అత్యంత దురదృష్టకరమని మంత్రి ఒక ప్రకటనలో ధ్వజమెత్తారు. రాష్ట్రంలో ఐదేళ్ల పాలనను కుంభకోణాలమయం చేసిన జగన్‌రెడ్డి.. కూటమి ప్రభుత్వంపై అవే విమర్శలు చేస్తుంటే ప్రజలు నవ్వుకుంటున్నారన్నారు. “రామాయపట్నం పోర్టుపై ప్రతిపక్షం ఆరోపణలు వాస్తవాలకు పూర్తిగా విరుద్ధం. గత వైసీపీ ప్రభుత్వం పోర్టుల పేరుతో ఏవిధంగా వ్యవహరించిందో ప్రజలందరికీ తెలుసు. గంగవరం పోర్టులో ప్రభుత్వానికి ఉన్న 10.40శాతం వాటాను అదానీ సంస్థకు విక్రయించినది ఎవరో జగన్‌రెడ్డి సమాధానం చెప్పాలి” అని మంత్రి జనార్ధన్ రెడ్డి డిమాండ్ చేశారు.

2023లో ఎలాంటి పారదర్శక టెండర్ విధానం లేకుండా, ప్రభుత్వ ప్రయోజనాలు పట్టకుండా 2 బెర్తులను ప్రైవేట్ సంస్థ జెఎస్‌డబ్ల్యుకు అప్పగించింది ఎవరని మంత్రి ప్రశ్నించారు.? ప్రభుత్వానికి కనీస ఆదాయం, రెవెన్యూ షేర్, ఈక్విటీ వాటా లేకుండా ఒప్పందాలు చేసిన ప్రభుత్వం మీదీ కాదా? అంటూ నిలదీశారు. ఇవన్నీ మరిచిపోయి ఇప్పుడు ప్రజలకు నీతులు చెప్పడం రాజకీయ అవకాశవాదం తప్ప మరొకటి కాదని ప్రతిపక్ష నేతకు మంత్రి చురకలు అంటించారు.

రామాయపట్నం పోర్టు విషయంలో తమ ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలు పూర్తిగా పారదర్శకంగా, ప్రభుత్వానికి దీర్ఘకాలిక ఆదాయం వచ్చేలా రూపొందించబడ్డాయని తెలిపారు. రూ.1,500 కోట్ల ముందస్తు ప్రీమియం, రాబడి భాగస్వామ్యం, కనీస గ్యారెంటీ ఆదాయం, 12 శాతం తగ్గని ఈక్విటీ వాటావంటి నిబంధనలను ఒప్పందంలో స్పష్టంగా పొందుపరుస్తున్నామనే విషయం గుర్తెరగాలన్నారు. అలాగే వివిధ దశల్లో కాంట్రాక్టర్ పెట్టే పెట్టుబడి సుమారు రూ.20 వేల కోట్లలో కూడా 12శాతం ఈక్విటీ వాటా ప్రభుత్వానికే దక్కుతుందనే ఆలోచన లేకుండా, అవగాహన రాహిత్యంతో మాట్లాడటం దురదృష్టకరమన్నారు.

రామాయపట్నం పోర్టు అభివృద్ధి పనులు వైసీపీ హయాంలో 95శాతం పూర్తయ్యాయనే వైసీపీ ప్రచారం పూర్తిగా అవాస్తవం. గత ఐదేళ్లలో రామాయపట్నం పోర్టు భౌతిక ప్రగతి కేవలం 50 శాతం. కూటమి ప్రభుత్వం బాధ్యతలు స్వీకరించిన తర్వాత వేగవంతంగా పనులు చేపట్టి 20 నెలల్లో 80.5శాతం పూర్తి చేశాం. భూసేకరణను కూడా గత ప్రభుత్వం అసంపూర్తిగా వదిలేయగా, తామే పూర్తి చేశామన్నారు. మొత్తంగా గత రెండేళ్లలోనే సుమారు 30శాతం అదనపు ప్రగతి సాధించామని వెల్లడించారు. పోర్టు విస్తరణకు భూములను ఎకరా రూ.1కే ఇచ్చేస్తున్నారనడం కూడా ప్రజలను భయాందోళనలకు గురిచేసే రాజకీయ దుష్ప్రచారం మాత్రమేనన్నారు. ఇది సాధారణ భూమి విక్రయం ఎంతమాత్రం కాదని, దీర్ఘకాలిక కన్సెషన్ ఒప్పందంలో భాగంగా పెట్టుబడులు, ఉపాధి, పారిశ్రామిక అభివృద్ధి, ప్రభుత్వానికి నిరంతర



ఆదాయంవంటి అంశాలను దృష్టిలో పెట్టుకుని రూపొందించిన విధానమని తెలిపారు. 12శాతం నాన్-డైల్యూటబుల్ ఈక్విటీ ద్వారా ప్రతి దశలోనూ ప్రభుత్వానికి వాటా ఉంటుందన్నారు. యాజమాన్య హక్కులు మాత్రం పూర్తిగా ప్రభుత్వ అధీనంలోనే ఉంటాయనే విషయం గుర్తించుకోవాలన్నారు.

పీపీపీ అంటే “అమ్మకం” ఎంత మాత్రం కాదు. రాష్ట్రానికి లాభం తీసుకొచ్చే అభివృద్ధి భాగస్వామ్యం మాత్రమే.. నేడు గ్లోబల్‌గా ఇదే విధానం విజయవంతంగా అమలవుతోంది. పీపీపీ విధానంలోనే నేడు దేశంలోని అధిక శాతం పోర్టులు పనిచేస్తున్నాయి. దేశవ్యాప్తంగా విజయవంతంగా అమలవుతున్న పీపీపీ విధానాన్ని ఆంధ్రప్రదేశ్‌లో అమలు చేస్తే అది తప్పు ఎలా అవుతుందని మంత్రి ప్రశ్నించారు? దేశం మొత్తంలో నేడు 119 పోర్టులు పనిచేస్తుండగా, వీటిలో 108పోర్టులు, అంటే దాదాపు 91శాతం పీపీపీ విధానంలోనే నిర్వహించబడుతున్నాయి. ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, ఒడిశా, పుదుచ్చేరి రాష్ట్రాల్లో ప్రస్తుతం పనిచేస్తున్న అన్ని నాన్-మేజర్ పోర్టులు పీపీపీ నమూనాలోనే ఆపరేషన్లు సాగుతున్నాయి. గుజరాత్‌లో కూడా దాదాపు 90 శాతం పోర్టులు పీపీపీ విధానంలోనే విజయవంతంగా నడుస్తున్నాయి. దేశమంతా అనుసరిస్తున్న విధానం ఏపీలో తప్పని ప్రతిపక్షం విమర్శలు చేయడం ప్రజలను మోసం చేయడమేనని మంత్రి ప్రకటనలో పేర్కొన్నారు.

ఏపీలో పీపీపీ విధానం ఈరోజు కొత్తగా ప్రారంభమైనది కాదు. 29ఏళ్లుగా ఇదే నమూనాలో కృష్ణపట్నం, కాకినాడ, గంగవరం వంటి పోర్టులు విజయవంతంగా పనిచేస్తున్నాయి. ఈ పోర్టుల ద్వారా రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు, పరిశ్రమలకు, ఉపాధికి ఎంతో మేలు జరిగిన మాట వాస్తవం. గత ఐదేళ్లు మీరు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఈ పీపీపీ విధానాన్ని ఎందుకు వ్యతిరేకించలేదు? అప్పట్లో మంచిగా కనిపించిన విధానం, ఇప్పుడు ప్రతిపక్షంలో ఉండగా చెడ్డదిగా ఎలా మారిందని ప్రశ్నించారు. అధికారంలో ఉన్నప్పుడు పీపీపీ విధానాన్ని అనుసరించి,ప్రతిపక్షంలో ఉన్నప్పుడు అదేదో ద్రోహమన్నట్టు ప్రవర్తిస్తున్న మీ రెండు నాల్కల ధోరణిని ప్రజలు గమనిస్తున్నారనే విషయం మర్చిపోవద్దని జగన్‌కు మంత్రి జనార్ధన్ రెడ్డి చురకలంటించారు.

ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ మారిటైమ్ బోర్డు అభివృద్ధి చేస్తున్న మూడు గ్రీన్‌ఫీల్డ్ పోర్టులను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయాలంటే దాదాపు రూ.50వేల కోట్లకు పైగా పెట్టుబడులు అవసరం. ఈ నేపథ్యంలో ప్రభుత్వంపై మొత్తం ఆర్థిక భారం వేయకుండా, ప్రైవేట్ పెట్టుబడులను ఆకర్షిస్తూ, ప్రభుత్వ ప్రయోజనాలను కాపాడుతూ, ప్రపంచస్థాయి పోర్టులను నిర్మించడమే పీపీపీ విధానం లక్ష్యమన్నారు. ఈ విధానం ద్వారా ప్రభుత్వానికి ఆదాయం వస్తుంది. రాష్ట్రానికి భారీ పెట్టుబడులు వస్తాయి. వేలాది యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయి. పోర్టు ఆధారిత పరిశ్రమలుఏర్పడతాయి. ఎగుమతులు పెరుగుతాయి. ఆంధ్రప్రదేశ్ దేశంలో అగ్రగామి మారిటైమ్ హబ్‌గా ఎదుగుతుందని మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు.

మీరు అధికారంలో ఉన్నప్పుడు ప్రభుత్వ ఆస్తులను ఇష్టారీతిన ప్రైవేటు సంస్థలకు తెగనమ్మితే.. తాము మాత్రం పారదర్శక టెండర్లతో, ప్రభుత్వానికి ఆదాయం వచ్చేలా, ప్రజలకు ఉద్యోగాలు వచ్చేలా, రాష్ట్ర భవిష్యత్తు బలపడేలా ఒప్పందాలు చేస్తున్నామని స్పష్టం చేశారు. అదే మీ పాలనకు... మా పాలనకు ఉన్న ప్రధాన వ్యత్యాసమంటూ మంత్రి జనార్ధన్‌రెడ్డి వైసీపీ వైఖరిపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు.

---

## విద్యాశాఖలో విప్లవాత్మక మార్పులకు

# ‘షైనింగ్ స్టార్స్’ నిదర్శనం

- తిరుపతి జిల్లాను ఆధ్యాత్మిక, క్రీడా, ఆతిథ్య, పారిశ్రామికరంగాల్లో మేటిగా తీర్చిదిద్దుతాం
- విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందచేసిన జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి అనగాని



తిరుపతి (చైతన్య రథం): విద్యాశాఖలో విప్లవాత్మక మార్పులకు షైనింగ్ స్టార్స్ నిదర్శనమని జిల్లా ఇన్‌చార్జి మరియు రిజిస్ట్రేషన్, రెవెన్యూశాఖల మంత్రి అనగాని సత్యప్రసాద్ పేర్కొన్నారు. సోమవారం ఉదయం శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం ఇందిరా ప్రియదర్శిని ఆడిటోరియంలో నిర్వహించిన “షైనింగ్ స్టార్స్-2026” ప్రతిభా పురస్కారాల ప్రదానోత్సవంలో మంత్రి అనగాని, జిల్లా కలెక్టర్ ఎస్ వెంకటేశ్వర్, తిరుపతి, రైల్వే కోడూరు, సూళ్లూరుపేట ఎమ్మెల్యేలు ఆరణి శ్రీనివాసులు,అరవ శ్రీధర్, నెలవల విజయశ్రీ, జిల్లా విద్యాశాఖ అధికారి కె.వి.ఎన్. కుమార్, ఆర్.ఐ.ఓ గోపాల్‌రెడ్డి, వివిధ కార్పొరేషన్ చైర్మన్లు నరసింహయాదవ్, సి.ఆర్.రాజన్, సదాశివం, ప్రజాప్రతినిధులు, విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... విద్యావంతుడు, దూరదృష్టి కలిగిన నాయకుడు విద్యా మంత్రిగా ఉంటే ఎంతటి ఉత్కృష్ట మార్పులు సాధ్యమో “షైనింగ్ స్టార్స్” కార్యక్రమమే నిదర్శనమన్నారు. ఒకప్పుడు దేశంలో అగ్రస్థానంలో ఉన్న రాష్ట్ర విద్యా వ్యవస్థ గత ప్రభుత్వ హయాంలో వెనుకబడిందని,అయితే ప్రస్తుతం విద్యా మంత్రి నారా లోకేష్ విద్యారంగాన్ని సవాల్‌గా స్వీకరించి సంస్కరణలను వేగవంతంగా అమలు చేస్తున్నారన్నారు. విద్యార్థుల ప్రతిభను వెలికితీయడం, ప్రభుత్వ పాఠశాలలను మరింత బలోపేతం చేయడం, నాణ్యమైన విద్య అందించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర కిట్లు, నాణ్యమైన మధ్యాహ్న భోజన పథకం, ఇంటర్మీడియట్ విద్యార్థులకు భోజన పథకం పునరుద్ధరణ, 16,347 పోస్టులతో మెగా డీఎస్సీవంటి కార్యక్రమాలు విద్యా రంగాన్ని మరింత బలోపేతం చేస్తున్నాయని వివరించారు.

విద్యార్థుల బంగారు భవిష్యత్తు కోసం పేరెంట్-టీచర్ సమావేశాలకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని, ఈనెల 24న నిర్వహించే సమావేశాలకు తల్లిదండ్రులు తప్పనిసరిగా హాజరుకావాలని పిలుపునిచ్చారు. ప్రపంచస్థాయి అవకాశాలను అందిపుచ్చుకునేలా విద్యార్థులను తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన విద్యను అందించేందుకు కట్టుబడి ఉందన్నారు. తిరుపతి జిల్లాను ఆధ్యాత్మిక,క్రీడా,ఆతిథ్య, పారిశ్రామిక రంగాల్లో అభివృద్ధి చేసి, అంతర్జాతీయస్థాయి అవకాశాలు కల్పించే దిశగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని పేర్కొన్నారు. తిరుపతిలో అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంను కూడా నిర్మించబోతున్నామని చెప్పారు. గతంలో ప్రతిభా పురస్కారాలు కొద్దిమంది విద్యార్థులకే పరిమితమయ్యేవని, ప్రస్తుతం ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు చెందిన అన్ని విభాగాల ప్రతిభావంతులైన 258 మంది విద్యార్థులను ఒకే వేదికపై సత్కరించడం విద్యారంగంలో సరికొత్త అధ్యాయానికి నాంది పలికిందని మంత్రి అభినందించారు.

జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థుల ప్రతిభను గుర్తించి,ప్రోత్సహించడమే సమాజ అభివృద్ధికి అసలైన పునాది అని పేర్కొన్నారు. పిల్లల విజయానికి తల్లిదండ్రులు,ఉపాధ్యాయులు రెండు చక్రాల్లాంటి వారని, ఈ ఇద్దరి సమిష్టి కృషితోనే విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించగలరని తెలిపారు. ప్రతి విద్యార్థికి తనకంటూ ప్రత్యేకమైన ప్రతిభ,వ్యక్తిత్వం ఉంటుందని, పక్కింటి పిల్లలతోగానీ, ఇతరులతోగానీ పోల్చడం ద్వారా వారి ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీయవద్దని తల్లిదండ్రులకు సూచించారు. మార్కులే జీవిత విజయానికి కొలమానం కాదని,మంచి వ్యక్తిత్వం, నైపుణ్యాలు, క్రమశిక్షణ కూడా అంతే ముఖ్యమని అన్నారు.

కార్యక్రమంలో ప్రతిభ కనబరిచిన 258 మంది విద్యార్థులకు “షైనింగ్ స్టార్స్-2026” పురస్కారాలు, చెక్కులు, జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలు అందజేసి ఘనంగా సత్కరించారు.రాష్ట్ర ప్రభుత్వం ఈకార్యక్రమం నిర్వహించడం ద్వారావిద్యార్థుల్లో ప్రతిభను వెలికితీసి, వారిని మరింత ఉన్నత శిఖరాలకు తీసుకెళ్లే దిశగా కృషి చేస్తోందని రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న విద్యా సంస్కరణలకు ప్రతీకగా నిలిచిందని విద్యార్థులు, తల్లిదండ్రులువారి యొక్క అభిప్రాయాలను వ్యక్తపరిచారు.

చైతన్యరథం

# చంద్రబాబువల్లే రాయలసీమలో జలకళ

- సీమకు కృష్ణా జలాల ఘనత టీడీపీ ప్రభుత్వాలవే...
- అటు కుప్పానికి, ఇటు మడకశిరకు కృష్ణా జలాలు ఇచ్చింది చంద్రబాబే
- సీమ సాగునీటి ప్రాజెక్టులకు వేల కోట్లు వెచ్చిస్తున్నాం
- పోలవరం పూర్తయితే సీమలో ప్రతి ఎకరాకూ నీరందిస్తాం
- రాయలసీమలో పారిశ్రామికీకరణ చంద్రబాబు చలవే..
- ఐదేళ్లలో రాయలసీమకు జగన్ చేసిందేమీ లేదు
- కూటమి, వైసీపీ పాలనపై చర్చకు సిద్ధమా..?
- బీసీ సంక్షేమ మంత్రి సవిత సవాల్



పుట్టపర్తి (చైతన్య రథం): రాయలసీమను పారిశ్రామిక హబ్‌గా, హార్టీకల్చర్ హబ్‌గా సీఎం చంద్రబాబునాయుడు తీర్చిదిద్దుతున్నారని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి మంత్రి ఎస్.సవిత కొనియాడారు. కృష్ణా జలాలను రాయలసీమకు తీసుకొచ్చి రతనాల సీమగా అభివృద్ధి చేస్తున్న ఘనత సీఎం చంద్రబాబుదేనన్నారు. అయిదేళ్ల వైసీపీ పాలనలో గాల్లో వచ్చి సినిమా సెట్టింగ్‌లు వేసి, కొబ్బరికాయలు కొట్టిన హడావుడి తప్ప జగన్ చేసిందేమీ లేదని విమర్శించారు. దోపిడీకి కేరాఫ్ అడ్రాస్ వైసీపీ అని మండిపడ్డారు. రెండేళ్ల కూటమి పాలన, ఐదేళ్ల వైసీపీ పాలనపై చర్చకు సిద్ధమా..? అని ఆ పార్టీ నేతలకు మంత్రి సవిత సవాల్ విసిరారు. పుట్టపర్తిలో బుక్కపట్నం చెరువును ఎమ్మెల్యేలు ఎంఎస్ రాజు, పల్లె సింధూరెడ్డి, ఇతర కూటమి నేతలు, కార్యకర్తలతో కలిసి మంత్రి సవిత సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రపంచమంతా ఎల్ నినో ప్రభావంతో విలవిలలాడుతుంటే రాయలసీమలో చెరువులు, ఇతర నదులు జలకళతో కళకళలాడుతున్నాయని, దానికి కారణంగా సీఎం చంద్రబాబేనని అన్నారు. అటు కుప్పం, ఇటు మడకశిర వరకూ కృష్ణా జలాలను తీసుకొచ్చిన ఘనత సీఎం చంద్రబాబుదేనన్నారు. రూ.లక్ష కోట్లతో రాయలసీమను హార్టీ కల్చర్ హబ్‌గా తీర్చిదిద్దుతున్నారన్నారు. రాయలసీమలోని అన్ని జిల్లాల్లోనూ పరిశ్రమలు ఏర్పాటు చేస్తున్నారు. ఒక్కో జిల్లాను ఒక్కో రంగంలో అభివృద్ధి చేస్తున్నారన్నారు. తిరుపతిలో రాయల్ ఇన్ ఫీల్డ్ పరిశ్రమను తీసుకొచ్చారన్నారు. కర్నూలును డ్రోన్ హబ్ అభివృద్ధి చేస్తూనే, జొన్నగిరి స్వర్ణగిరిగా మార్చుతున్నారన్నారు. కడపలో స్టీల్ ప్లాంట్ తో దాల్మియా సిమ్మెంట్ పరిశ్రమను విస్తరిస్తున్నారన్నారు. శ్రీసత్యసాయి జిల్లాలో ఇప్పటికే కియా కార్ల పరిశ్రమను తీసుకొచ్చిన సీఎం చంద్రబాబు పుట్టపర్తిలో యుద్ధ విమానాల తయారీ పరిశ్రమను నెలకొల్పారన్నారు.

**పోలవరంతో సీమలో ప్రతి ఎకరాకూ నీరు...**

రాయలసీమ ప్రాంతానికి మొట్టమొదటిసారిగా అన్న ఎన్టీఆర్ తెలుగు గంగ ప్రాజెక్టు ద్వారా కృష్ణా జలాలు తీసుకొచ్చారని మంత్రి సవిత గుర్తు చేశారు. ఎన్టీఆర్ స్ఫూర్తితో పాలనసాగిస్తున్న సీఎం చంద్రబాబు రాయలసీమలో సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణానికి అధిక ప్రాధాన్యమిస్తున్నారన్నారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణం పూర్తయితే, రాయలసీమలోని చివరి ఎకరాకు కూడా సాగునీరందుతుందని మంత్రి సవిత తెలిపారు. పులివెందులకు కూడా సాగు, తాగు నీరందించిన ఘనత సీఎం చంద్రబాబుదేనన్నారు. రాయలసీమ ప్రాంత ముద్దు బిడ్డగా ఈ ప్రాంత అభివృద్ధి సీఎం చంద్రబాబునాయుడు రేయింబవళ్లు కృషి చేస్తున్నారని కొనియాడారు.

**జగన్ చేసిందేమీ లేదు...**

ఐదేళ్ల జగన్ పాలనలో రాయలసీమకు చేసిందేమీ లేదని మంత్రి సవిత మండిపడ్డారు. రాయలసీమ సాగునీటి ప్రాజెక్టులను గాలికొదిలేశారన్నారు. సినిమా సెట్టింగ్ లతో కొబ్బరికాయలు కొట్టి హడావుడి చేస్తూ కాలం వెళ్లదీశారన్నారు. ఆనాడు జగన్ అసమర్థతను వైసీపీ నాయకులు, ఎమ్మెల్యేలు ఎందుకు ప్రశ్నించలేక పోయారని నిలదీశారు. దోపిడీకి కేరాఫ్ అడ్రాస్ వైసీపీ అని తీవ్రంగా మండిపడ్డారు. రెండేళ్ల కూటమి పాలన, అయిదేళ్ల వైసీపీ పాలనపై చర్చకు సిద్ధమా..? అని ఆ పార్టీ నేతలకు మంత్రి సవిత సవాల్ విసిరారు. అంతకుముందు బుక్కపట్నం చెరువులో బోటులో మంత్రి సవిత ప్రయాణించారు. ఈ కార్యక్రమంలో మంత్రి సవిత వెంట ఎమ్మెల్యేలు ఎంఎస్ రాజు, పల్లె సింధూరెడ్డి, కూటమి నాయకులు పల్లె రఘునాథ్ రెడ్డి, పరిటాల శ్రీరామ్ ఇతర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## టూరిజం గైడ్స్‌గా యువతకు ఉపాధి



- జైపూర్‌లో టూరిజం గైడ్స్ ఫెడరేషన్ ప్రెసిడెంట్‌తో మంత్రి కందుల భేటీ
- ఏపీ యువతకు గైడ్స్‌గా శిక్షణ ఇవ్వాలంటూ అధికారిక ఆహ్వానం
- పర్యాటక ప్రాంతాల్లో ప్రొఫెషనల్ టూర్ గైడ్స్ వస్తారన్న మంత్రి దుర్గేష్

జైపూర్ (చైతన్యరథం): రాష్ట్రంలో నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు మెరుగుపరచడమే ప్రభుత్వప్రథమ ప్రాధాన్యత అని పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ స్పష్టం చేశారు. జైపూర్‌లో రెండో రోజు పర్యటిస్తున్న మంత్రి దుర్గేష్.. టూరిస్ట్ గైడ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ప్రెసిడెంట్ నరేంద్రసింగ్ రాథోర్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఏపీలో పర్యాటకరంగ అభివృద్ధి, యువతకు ఉపాధికల్పనపై సుదీర్ఘంగా చర్చించారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం పార్లమెంటులో ప్రవేశపెట్టిన 2026 వార్షిక బడ్జెట్‌లో పర్యాటక, ఆతిథ్య రంగాలకు విశేషప్రాధాన్యం కల్పించిందని.. అందులో భాగంగా పర్యాటక రంగంలోని 20 కీలక విభాగాలలో 10,000 మంది యువతకు టూరిజంఅండ్ హాస్పిటాలిటీ స్కిల్ కౌన్సిల్‌వంటి సంస్థల ఆధ్వర్యంలో నైపుణ్య శిక్షణ అందించాలని నిర్ణయించిన అంశాన్ని గుర్తుచేశారు. ఈ అంశాన్ని దృష్టిలో ఉంచుకొని ఆల్ ఇండియా టూరిజం గైడ్స్ ఫెడరేషన్ సహకారంతో ఎక్కువ మంది ఆంధ్రప్రదేశ్ యువతకు అంతర్జాతీయ స్థాయి శిక్షణ అందించి వారిని ప్రొఫెషనల్ టూర్ గైడ్స్‌గా తీర్చిదిద్దాలని మంత్రి దుర్గేష్‌కోరారు. తద్వారా స్థానిక యువతకు స్వయం ఉపాధి అవకాశాలు లభిస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఏపీలో పర్యాటకసేవలను మెరుగుపరచడంతోపాటు, స్థానికంగా పర్యాటక రంగంలో వస్తున్నడిమాండ్‌కు అనుగుణంగా యువతను తీర్చిదిద్దడం, వారికి శిక్షణను అందించేందుకు త్వరలోనే ఏపీలో పర్యటించాలని ఫెడరేషన్ ప్రతినిధులను మంత్రి కందుల దుర్గేష్ అధికారికంగా ఆహ్వానించారు. పర్యాటక ప్రాంతాలలో సందర్శకులకు మెరుగైన సేవలందించేందుకు ఇటీవల ప్రవేశపెట్టిన 'ఏఐ డిజిటల్ గైడ్స్'తోపాటు, శిక్షణపొందిన గైడ్స్ కూడా అందు బాటులో ఉంటారని మంత్రి దుర్గేష్ తెలిపారు. పర్యాటకులు తమపర్యటనల్లో వ్యక్తిగత గైడ్స్‌కావాలని కోరుకుంటే ఈశిక్షణ పొందిన యువత ఎంతగానో దోహదపడతారని పేర్కొన్నారు. సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్‌ల ఆధ్వర్యంలో పర్యాటక రంగం ద్వారా రాష్ట్రంలో యువతకు భారీగా ఉపాధి అవకాశాల కల్పనకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి కందుల దుర్గేష్ పునరుద్ఘాటించారు. పర్యటనలో మంత్రి దుర్గేష్‌తోపాటు ఏపీ పర్యాటక స్పెషల్ చీఫ్ సెక్రటరీ అజయ్ జైన్ ఉన్నారు.

## ఆక్వా, పొగాకు రంగాలకు కేంద్రం చేయూతనివ్వాలి

- కేంద్ర మంత్రులను వినతిపత్రాలు సమర్పించిన మంత్రుల బృందం
- ఢిల్లీలో మంత్రులు కింజరాపు, గొట్టిపాటి, డోలా



న్యూఢిల్లీ (చైతన్య రథం): రాష్ట్రంలోని ఆక్వా, పొగాకు రంగాల అభివృద్ధి, రైతులు, మత్స్యకారుల సంక్షేమం కోసం వ్యవసాయ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, విద్యుత్ మంత్రి గొట్టిపాటి రవికుమార్, సాంఘిక సంక్షేమ మంత్రి డోలా శ్రీ బాలవీరాంజనేయస్వామితో కలసి కేంద్ర వాణిజ్యశాఖ మంత్రి, మత్స్య శాఖ మంత్రులను కలిసి కీలక అంశాలపై వినతిపత్రాలు సమర్పించారు. ఆంధ్ర ప్రదేశ్ దేశంలోనే రొయ్యల ఉత్పత్తిలో అగ్రస్థానంలో ఉందని, ఈ రంగంపై లక్షలాది మంది రైతులు, కార్మికులు, హేచరీలు, ఫీడ్ తయారీదారులు, ప్రాసెసింగ్ యూనిట్లు, ఎగుమతిదారులు ఆధారపడి జీవిస్తున్నారని, అంతర్జాతీయ మార్కెట్లో రొయ్యల ధరలు తగ్గడం, ఫీడ్ ధరలు పెరగడంతో రైతులు తీవ్ర ఆర్థిక ఒత్తిడిని ఎదుర్కొంటున్నారని వివరించారు. ఫిష్ మీల్ ఎగుమతులను నియంత్రించి దేశీయ అవసరాలకు ప్రాధాన్యత ఇవ్వడంతోపాటు నమోదిత రొయ్యల ఫీడ్ తయారీ సంస్థలకు మాత్రమే 2021 విధానాన్ని అనుసరించి పరిమిత స్థాయిలో జీఎం సోయాబీన్ మీల్ దిగుమతికి అనుమతి ఇవ్వాలని కోరారు. అమరావతిలో ఎన్ఎఫ్‌డీబీ ప్రాంతీయ కార్యాలయం, శిక్షణ కేంద్రం ఏర్పాటుకు కేంద్రం ఇచ్చిన హామీని అమలుచేయాలని, రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే నెక్కల్లు గ్రామంలో జీవో146 ద్వారా 7.89ఎకరాల భూమిని కేటాయించిందని, డీపీఆర్, పరిపాలనా, ఆర్థిక అనుమతులు, నిధుల విడుదల, టెండర్ల ప్రక్రియ పూర్తిచేసి 2028 జూన్‌నాటికి ప్రాజెక్టును పూర్తిచేయాలని విజ్ఞప్తి చేశారు. భారత రొయ్యల ఎగుమతుల్లో ఆంధ్ర ప్రదేశ్ వాటా 80శాతం, దేశ సముద్ర ఉత్పత్తుల ఎగుమతుల్లో 34శాతం (సుమారు రూ.21,246 కోట్లు) ఉందని, రాష్ట్రంలో 2.5లక్షల ఆక్వా రైతు కుటుంబాలు ప్రత్యక్షంగాను, 30లక్షల మందికి పైగా పరోక్షంగాను ఆధారపడి జీవిస్తున్నారని తెలిపారు.

2025లో అమెరికా విధించిన అధిక టారిఫ్‌లతో భారత రొయ్యలపై మొత్తం సుంకం 58శాతానికి చేరడంతో సుమారు రూ.25,000కోట్ల నష్టం వాటిల్లిందని, ఎగుమతి ఆర్డర్లలో దాదాపు 50 శాతం రద్దు కావడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారని పేర్కొన్నారు. భారత్, అమెరికా తాత్కాలిక వాణిజ్య ఒప్పందం, అమెరికా సుప్రీంకోర్టు తీర్పుతో టారిఫ్ 10 శాతానికి తగ్గడం స్వాగతించదగ్గ పరిణామమే అయినప్పటికీ రొయ్యల రంగానికి మరింత ఆర్థిక తోడ్పాటు అవసరమని, రిజిస్టర్డ్ రొయ్యల ఫీడ్ తయారీ సంస్థలకు పరిమిత పరిమాణంలో జన్యు మార్పిడి సోయాబీన్ మీల్ దిగుమతులకు అనుమతి ఇవ్వాలని కోరారు. అలాగే ఎఫ్‌సీవీ పొగాకు ఎగుమతులకు ప్రోత్సాహకాలు కల్పించాలని కోరారు. భారత ఎఫ్‌సీవీ పొగాకు ఎగుమతులు 2021-22లో 105.21 మిలియన్ కిలోలనుంచి 2025-26లో 155.05మిలియన్ కిలోలకు ఎగుమతుల విలువ రూ.2,909.99 కోట్ల నుంచి రూ.7,782.98కోట్లకు పెరగడం భారత పొగాకు నాణ్యతకు నిదర్శనమని పేర్కొంటూ రైతులు, ఎగుమతిదారుల ప్రయోజనాలను దృష్టిలోఉంచుకుని కేంద్ర ప్రభుత్వం ఈ వినతులపై సానుకూల నిర్ణయం తీసుకోవాలని మంత్రులు కింజరాపు, గొట్టిపాటి, డోలా కోరారు.

# అభివృద్ధిలో అనకాపల్లి ఆదర్శం

- ప్రతి సమస్యకూ వీలైనంత త్వరగా పరిష్కారం చూపుతాం
- పీఆర్, రోడ్లు, నీటి సరఫరా, ఇరిగేషన్ విషయంలో ప్రత్యేక శ్రద్ధ
- అనకాపల్లి జిల్లా డీఎస్సీ సమావేశంలో మంత్రి కొల్లు రవీంద్ర




అనకాపల్లి (చైతన్య రథం): అనకాపల్లి జిల్లాలో ప్రతి సమస్యకు పరిష్కారం చూపించి ప్రజలకు కూటమి ప్రభుత్వ చిత్తశుద్ధి చాటి చెబుతామని మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. అనకాపల్లి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన డీఎస్సీ సమావేశంలో హోమ్ మంత్రి వంగలపూడి అనిత, ఎమ్మెల్యేలు బండారు సత్యనారాయణమూర్తి, కొణతాల రామకృష్ణ, కె.ఎస్.ఎన్.ఎస్.రాజు, పంచకర్ల రమేష్, సుందరపు విజయ్‌కుమార్, కార్పొరేషన్ చైర్మన్లు బత్తుల తాతయ్య బాబు, పి.వి.జి.కుమార్, మళ్ళ సురేంద్ర,జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ పాల్గొన్నారు. జిల్లా అభివృద్ధిపై అధికారులతో సమీక్షించి సమస్యల పరిష్కారానికి ఆదేశాలు జారీ చేశారు. టెండర్లు దక్కించుకుని పనులు చేయని కాంట్రాక్టర్లపై చర్యలుతీసుకోవాలని డిఎస్సీ సూచించింది.కాంట్రాక్టర్లు ఏమైనాసమస్యలు ఎదుర్కొంటే వాటిని పరిష్కరించేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. పంచాయతీరాజ్, ఆర్ అండ్ బి, రూరల్ వాటర్ సప్లై, ఇరిగేషన్ పనుల విషయంలో ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని అధికారులకు సూచించారు.

అనంతరం మీడియాతో మాట్లాడుతూ..అనకాపల్లిజిల్లాలో పెండింగ్ అభివృద్ధి కార్యక్రమాలపై సుదీర్ఘంగా చర్చించాం.యలమంచిలి, అనకాపల్లి నియోజకవర్గాల్లో రోడ్ల అభివృద్ధి సమస్యలు అధికంగా ఉన్నట్లు ప్రజాప్రతినిధులు పేర్కొన్నారు. ఎలమంచిలి నియోజకవర్గంలోని పూడిమడక ఫిషింగ్ హార్బర్‌పై నెలకొన్న సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కరిస్తాం. వర్షాభావ పరిస్థితులు నెలకొనకుండా ఎగువనుండి సాగు నీటికీ ఎలాంటి ఇబ్బంది లేకుండా చూస్తాం. కేంద్రం నుండి, రాష్ట్ర ప్రభుత్వం నుండి అవసరమైన నిధులు సమీకరిస్తాం. ఆగస్టు 14న పోలవరం లెఫ్ట్ కెనాల్ ద్వారా సాగునీరు విడుదల చేయనున్నాం. ఉత్తరాంధ్ర వాసుల కలగా నిలిచిన లెఫ్ట్ కాలువ ప్రారంభోత్సవ వేడుకను అత్యంత ఘనంగా నిర్వహిస్తాం. అర్సెలార్ మిట్టల్‌లాంటి సంస్థలకు భూకేటాయింపులు, నీటి సరఫరావంటి అంశాలను పరిష్కరిస్తాం.అనకాపల్లిజిల్లాను పారిశ్రామికంగా అభివృద్ధి బాటలో నడిపిస్తాం. అనకాపల్లి జిల్లాలో పంచదార కొండ ప్రాధాన్యత కాపాడుకునేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోంది" అని మంత్రి కొల్లు పేర్కొన్నారు.

### మత్స్యకారుల మరణంపై రాజకీయం సిగ్గు చేటు

"విశాఖకు చెందిన మత్స్యకారులు సముద్రంలో వేటకు వెళ్ళి గల్లంతైనఘటనపై కూడా జగన్‌రెడ్డి రాజకీయం చేయాలని ప్రయత్నించడం సిగ్గుచేటు అని ఎద్దేవా చేశారు.

కూటమి ప్రభుత్వం ఘటన గురించి తెలిసిన వేంటనే గాలింపు చర్యలు చేపట్టాం. త్రీ మెన్ కమిటీ ఏర్పాటుచేసి 72గంటల్లో బాధిత కుటుంబ సభ్యులకు సాయం అందించాం. రూ.కోటి పరిహారం ఇవ్వాలని నినదించిన జగన్‌రెడ్డి గత ఐదేళ్లు మత్స్యకారులకు ఏం ఉద్ధరించారో సమాధానం చెప్పాలి. గత ఐదేళ్లలో చనిపోయినవారికి కనీసం డెత్ సెరిఫికెట్ కూడా ఇవ్వలేదు. జగన్‌రెడ్డి ఎంతసేపు..కులం, మతం, ప్రాంతం పేరుతో రాజకీయంచేయడంతప్ప ప్రజల గురించి ఏరోజూ పట్టించుకోలేదు. జగన్‌రెడ్డి అరాచకాలు, దుర్మార్గపు విధానాలపట్ల ప్రజలుఅప్రమత్తంగా ఉండాలని మంత్రి కొల్లు రవీంద్ర పిలుపునిచ్చారు.

# మునికూడలికి మోడల్ పుష్కర్ పంచాయతీ హంగులు

- శరవేగంగా సప్త ఋషి ఘాట్ అభివృద్ధి
- గ్రామం మధ్యనుంచి గోదావరి తీరం వరకూ సీసీ రోడ్డు
- పురోగతిలో మ్యాజిక్ డ్రెయిన్లు, ఇంకుడు గుంతలు, పబ్లిక్ టాయిలెట్లు
- యాత్రికుల సౌకర్యార్థం సమాచార కేంద్రానికి ఆధునిక హంగులు
- పనుల పురోగతిపై పంచాయతీరాజ్ అధికారులతో డిప్యూటీ సీఎం సమీక్ష



అమరావతి (చైతన్య రథం): 'స్వచ్ఛ గోదావరి – పవిత్ర పుష్కరాలు'థీమ్‌తో గోదావరి పుష్కరాలకు వచ్చే లక్షలాది భక్తులకు అత్యుత్తమ సౌకర్యాలు కల్పించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందులో భాగంగా తూర్పు గోదావరిజిల్లా సీతానగరంమండలం పరిధిలోని మునికూడలిని మోడల్ పుష్కర్ పంచాయతీగా తీర్చిదిద్దేందుకు సుమారు రూ. 7కోట్ల వ్యయంతో అభివృద్ధి పనులు చేపట్టారు.డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ నిరంతర పర్యవేక్షణలో పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. మునికూడలి గ్రామం మరియు సప్త ఋషి ఘాట్‌ను పర్యావరణహితంగా, జీరో లిక్విడ్ డిశ్చార్జ్ ప్రమాణాలకు అనుగుణంగా అభివృద్ధి చేయడానికి అవసరమైన మౌలిక సదుపాయాల కల్పన జరుగుతోంది. మునికూడలి మోడల్‌పుష్కర్ పంచాయతీ పనుల పురోగతిపై సోమవారం పవన్‌కళ్యాణ్ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ ముఖ్యకార్యదర్శి కాంతిలాల్ దండే, కమిషనర్ కృష్ణతేజలతో సమీక్షించారు. ఈ సందర్భంగా మునికూడలి గ్రామ పంచాయతీ పరిధిలో సాగుతున్న అభివృద్ధి పనుల స్థితిని వివరించారు. గోదావరి పుష్కరాలకు వచ్చే యాత్రికులు ఎలాంటి అసౌకర్యం లేకుండా సప్తఋషి ఘాట్‌కు చేరుకునేందుకు గ్రామం మధ్య నుంచి ఘాట్ వరకు ఉన్న మార్గాన్ని అభివృద్ధి చేసి సీసీ రోడ్డు నిర్మిస్తున్నారు. ఈ పనులు దాదాపు పూర్తయ్యాయి. అలాగే ఘాట్ ప్రాంతంలో నీటి ప్రవాహాలు, తడి కారణంగా భక్తులకు ఇబ్బందులు కలగకుండా 3.5మీటర్ల వెడల్పుతో కాంక్రీట్ ప్లాట్‌ఫారమ్ నిర్మాణం చేపట్టగా, ఈ పనులు కూడా చివరి దశకు చేరుకున్నాయి. సప్త ఋషి ఘాట్ పరిసరాలను రాత్రి వేళల్లో సైతం సురక్షితంగా,ఆకర్షణీయంగా తీర్చిదిద్దేందుకు హై మాస్ట్ విద్యుత్ దీప స్తంభాలను ఏర్పాటు చేస్తున్నారు. ఇందుకు అవసరమైన సిమెంట్ పునాది నిర్మాణం ఇప్పటికే పూర్తయింది. విద్యుత్‌శాఖకు సంబంధించి రూ. 1.50కోట్లు పనులు పూర్తయ్యాయి. అందులో మెరుగైన విద్యుత్ సరఫరా కోసం ఆరు ట్రాన్స్‌ఫార్మర్లు, నూతన విద్యుత్ లైన్లు, స్తంభాలు తదితర పనులు దాదాపు పూర్తయ్యాయి. మునికూడలి గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు,మురుగునీటి పారుదలను సమర్థవంతంగా నిర్వహించేందుకు మ్యాజిక్ డ్రెయిన్ల నిర్మాణం కొనసాగుతోంది. అలాగే వ్యర్థజలాల శాస్త్రీయ నిర్వహణ కోసం సామూహిక ఇంకుడు గుంతలు నిర్మిస్తున్నారు. పనులు పురోగతిలో ఉన్నాయి. భక్తుల సౌకర్యార్థం ఘాట్‌సమీపంలో ఆధునిక సమాచార కేంద్రం, అలాగే అత్యాధునిక సదుపాయాలతో కూడిన పబ్లిక్‌టాయిలెట్ల నిర్మాణంచేపట్టారు. మరుగుదొడ్ల నిర్మాణం ఇప్పటికే మూడు వంతులు పూర్తయి, మిగిలిన పనులు వేగంగా కొనసాగుతున్నాయి.ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ సూచించిన ఇతర అభివృద్ధికార్యక్రమాలకు సంబంధించిన టెండర్ల ప్రక్రియ పూర్తయి,పనుల ప్రారంభానికి సిద్ధంగా ఉన్నట్టు అధికారులు తెలిపారు. మునికూడలి మోడల్ నమూనాతో మిగిలిన పుష్కర పంచాయతీలు తీర్చిదిద్దాల్సి ఉన్నందున పనులు త్వరితగతిన పూర్తిచేయాలని ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ ఆదేశించారు.







చైతన్యరథం

# భూకబ్జాలు.. హత్యలు... దాడులు..

## టీడీపీ కేంద్ర కార్యాలయంలో గ్రీవెన్స్‌లో వెల్లువెత్తిన అర్జీలు

- కొడాలి నాని అనుచరుల దౌర్జన్యంపై ఫిర్యాదు
- వైసీపీ నేతల ఒత్తిళ్లతో హత్య కేసు పక్కదారి.. చర్యలకు వినతి
- నకిలీ పత్రాలతో రూ.57 లక్షల భూమోసం.. న్యాయంకోసం విజ్ఞప్తి
- రూ.29 వేల అప్పుకు 4 సెంట్ల స్థలం కబ్జా..
- ప్రశ్నిస్తే చంపేస్తామంటూ బెదిరింపులంటూ బాధితుల గోడు
- అర్జీలు స్వీకరించిన మంత్రి భరత్, ఏపీఐడీసీ చైర్మన్ ప్రభాకర్



మంగళగిరి (చైతన్య రథం): తెలుగుదేశం పార్టీ మంగళగిరి కేంద్ర కార్యాలయంలో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్‌లో మంత్రి టి.జి. భరత్, ఏపీ ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ చైర్మన్ దేగల ప్రభాకర్‌లు బాధితులనుంచి అర్జీలు స్వీకరించారు. వివిధ జిల్లాలనుంచి వచ్చిన బాధితులు తమ సమస్యలను నేతల దృష్టికి తీసుకెళ్లగా, వాటి పరిష్కారానికి కృషి చేస్తామని నేతలు హామీ ఇచ్చారు. భూ కబ్జాలు, హత్యలు, దాడులు, రికార్డుల తారుమారువంటి పలు తీవ్రమైన అంశాలపై బాధితులు ఆందోళన వ్యక్తం చేశారు.

### గుడివాడలో ఇంటిపై దౌర్జన్యం, భూకబ్జా ఆరోపణలు

కృష్ణాజిల్లా గుడివాడకుచెందిన గుర్రాల సుబ్బారావు అర్జీనిస్తూ.. తమ ఇంటి ఎదురుగా ఉన్న 15సెంట్ల మున్సిపల్ రిజర్వ్ స్థలాన్ని స్థానిక మున్సిపల్ కాంట్రాక్టర్ ఆడబాల అప్పారావు, అతని అనుచరులు కబ్జాకు యత్నించారని, కలెక్టర్‌కు ఫిర్యాదు చేయగా.. స్థలం మున్సిపాలిటీదేనని నాటి ఆర్డీఓ తేల్చారన్నారు. ఈ వ్యవహారంపై హైకోర్టును ఆశ్రయించడంతో కక్ష పెంచుకున్న అప్పారావు, అతని కుమారుడు హేమ కుమార్, వెన్నపురెడ్డి కమల తదితరులు నకిలీ పత్రాలు సృష్టించారని పేర్కొన్నారు.ఆస్తిపై కోర్టులో వివాదం నడుస్తుండగానే, అప్పటి అధికార పార్టీ వైసీపీ నాయకుడు కొడాలి నాని, దుక్కిపాటి శశిభూషణ్‌ల రాజకీయ రికమండేషన్‌తో అధికారులకు లంచాలు ఇచ్చి అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపించారు. 2022 జనవరి 19న ఉదయం 6గంటల సమయంలో అప్పారావు, అతని అనుచరులు సుమారు 40మంది రౌడీ మూకలతో, రెండు క్రేన్లు, ట్రాక్టర్లతో వచ్చి దౌర్జన్యానికి దిగారని, తన భార్యాపిల్లలను రోడ్డుపైకి ఈడ్చికొట్టి ఇంటి సామాన్లను ధ్వంసం చేశారని సుబ్బారావు వాపోయారు. ఇంట్లోని చెట్లు, నాపరాళ్లను బలవంతంగా తరలించడంతోపాటు కుమార్తె మెడలోని 5 సవర్ల బంగారు గొలుసును దొంగిలించారని తెలిపారు. నాటి వన్‌టౌన్ సీఐ గోవిందరాజులు, డీఎస్పీ సత్యానంద్‌లు కొడాలి నాని ఒత్తిళ్లకు తలొగ్గి రూ.3 లక్షల లంచం తీసుకుని నిందితులపై చర్యలు తీసుకోకుండా కేసును తొక్కిపెట్టారని ఆరోపించారు. అప్పారావు రెండో కోడలు గుడివాడ మున్సిపాలిటీలో ఇంజనీరుగా, కుమారుడు కాంట్రాక్టరుగా ఉంటూ కొడాలి నాని అండతో అక్రమ బిల్లులు పాస్ చేయించుకుంటూ కోట్లాది రూపాయల ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశారని, 2010కి ముందు ఏమీ లేని ఆ కుటుంబం నేడు అక్రమ సంపాదనతో బిల్డింగులు, కార్లు, క్రేన్లు సమకూర్చుకుందని ఆవేదన వ్యక్తం చేశారు. పలుమార్లు ఫిర్యాదు చేసినా న్యాయం జరగలేదని, నిందితులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

### తల్లి హత్య కేసులో విచారణ నత్తనడకపై ఆగ్రహం

మార్కాపురం జిల్లా బేస్తవారిపేట మండలం వెంకటాపురం గ్రామానికి చెందిన మినిగ పుల్లయ్య తన తల్లి మనిగ సుబ్బమ్మను కందుల లక్ష్మిరెడ్డి హత్య చేశాడని ఆరోపించారు. ఈ ఘటనపై బేస్తవారిపేట పోలీస్ స్టేషన్‌లో 2024 డిసెంబర్ 31న క్రైమ్ నెంబర్ 205/2024 కింద కేసు నమోదైనట్టు తెలిపారు. నిందితుడితో పాటు నేరంలో భాగస్వాములైన మరికొందరి పేర్లను పోలీసులకు స్పష్టంగా అందించినా ఇంతవరకు న్యాయం జరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు జోక్యం చేసుకుని రాజకీయ ఒత్తిళ్లు తీసుకువస్తూ దర్యాప్తును అడ్డుకుంటున్నారని, కేసును పక్కదారి పట్టించే యత్నం చేస్తున్నారని ఆరోపిస్తూ చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

### భూ రికార్డుల ఫోర్జరీ, గ్రీన్‌కో కంపెనీకి బదిలీ ఆరోపణలు

నంద్యాల జిల్లా పాణ్యం మండలం పిన్నాపురం గ్రామానికి చెందిన చట్టా శ్రీనివాసులు తన అర్జీలో, సర్వే నెంబర్ 56లో 2.14 ఎకరాలు, సర్వే నెంబర్ 58లో 3.52 ఎకరాల భూమి తనకు ఉందని, అసలు పత్రాలు తన వద్దే భద్రంగా ఉన్నాయని తెలిపారు. అయినప్పటికీ స్థానికులైన పలుకూరు వెంకట సుబ్బమ్మ, సి.హెచ్. నాగేంద్ర, పిన్నాపురం సర్పంచ్ సత్యాలు కుమ్మక్కై, తనకు తెలియకుండానే దొంగ పట్టాలు, నకిలీ అగ్రిమెంట్లు సృష్టించి తప్పుడు సంతకాలతో ఆన్‌లైన్ రికార్డులను తారుమారు చేశారని ఆరోపించారు. ఈ నకిలీ పత్రాల ఆధారంగా భూమిని గ్రీన్‌కో కంపెనీకి అప్పగించి, సుమారు రూ. 57 లక్షలను ఆ ముఠా కాజేసిందని పేర్కొన్నారు. 2019 నుంచి స్థానిక రెవెన్యూ అధికారుల చుట్టూ, నంద్యాల కలెక్టరేట్ చుట్టూ తిరిగినా ఫలితం లేకుండా పోయిందని,ఆన్‌లైన్ పాస్‌బుక్ కోసం కోరినా వీఆర్వో గానీ కలెక్టర్ గానీ పట్టించుకోలేదని వాపోయారు. పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా పాణ్యం సీఐ, ఎస్సైలు బెదిరించి వెనుకడుగు వేయించారే తప్ప న్యాయం చేయలేదని ఆరోపిస్తూ చర్యలు కోరారు.

### ప్రామిసరీ నోటు మోసం, బెదిరింపులు

కృష్ణా జిల్లా గన్నవరం మండలం సవారిగూడెం గ్రామానికి చెందిన తోట చంద్రశేఖర్ రావు తనకున్న 4 సెంట్ల స్థలంపై గతంలో అత్యవసరాల నిమిత్తం రూ.29,000 అప్పుగా తీసుకున్నానని, ఆ తర్వాత పూర్తిగా చెల్లించినప్పటికీ అవతలి వ్యక్తులు ఒరిజినల్ ప్రామిసరీ నోటును వెనక్కి ఇవ్వకుండా తమ వద్దే ఉంచుకున్నారని ఆరోపించారు. దానితో ఆగకుండా ఒరిజినల్ నోటు ఆధారంగా దొంగ నోట్లు సృష్టించి లాయర్ ద్వారా నోటీసులు పంపించారని, ప్రస్తుతం తన స్థలాన్ని అక్రమంగా కబ్జా చేయడమే కాకుండా స్థలం ఖాళీ చేయకపోతే తనను, తన ఇద్దరు కుమారులను చంపేస్తామని బహిరంగంగా ప్రాణ బెదిరింపులకు దిగుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. లాయర్లు, పోలీసులు తమకు తెలుసునంటూ బెదిరిస్తున్నారని, ఫోర్జరీ పత్రాల ఆధారంగా ఆస్తిని లాక్కోవడంతో పాటు కుటుంబానికి ప్రాణహాని కలిగిస్తున్నారని పేర్కొంటూ చర్యలు తీసుకోవాలని కోరారు.

### వ్యవసాయ భూమి రికార్డుల మార్పుపై ఫిర్యాదు

వైఎస్సార్ కడప జిల్లా వల్లూరు మండలం తక్కగంగనపల్లెకు చెందిన అన్నలూరి ఏసోబు తనఅర్జీలో, చింతకొమ్మదిన్నె మండలం తాడిగోట్ల గ్రామంలోని సర్వే నెంబర్ 234లో 1.59ఎకరాల భూమిని గతంలో ప్రభుత్వం తన తండ్రికి సాగునిమిత్తం కేటాయించిందని తెలిపారు. తాను వల్లూరు మండలంలోని అత్తగారి గ్రామంలో గత పదేళ్లుగా నివసిస్తున్నానని, తాను గ్రామంలో లేనిసమయాన్ని ఆసరాగా చేసుకుని కొందరు అక్రమార్కులు రెవెన్యూ అధికారుల అండదండలతో భూమి రికార్డులను మార్చేశారని ఆరోపించారు. ప్రస్తుతం ఆభూమిని గజ్జల రామకృష్ణారెడ్డి పేరిట దొంగచాటుగా ఆన్‌లైన్ చేసి ఆక్రమించుకున్నారని, పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా న్యాయం జరగలేదని పేర్కొంటూ చర్యలు కోరారు.

### భర్త రాసిచ్చిన అగ్రిమెంటుకు పాస్ పుస్తకం కోసం విజ్ఞప్తి

పల్నాడు జిల్లా మాచవరం మండలం కొత్త గణేశునిపాడు గ్రామానికి చెందిన ముప్పూరి పద్మావతి తన అర్జీలో,మల్లవోలు గ్రామ పంచాయతీ పరిధిలోని సర్వే నెంబర్ 493/3లోఉన్న మొత్తం 1.86ఎకరాల భూమిలో 0.98సెంట్లమెరక భూమి తన భర్త శ్రీనివాసరావు స్వాధీనంలో ఉండేదని తెలిపారు. ఆయన జీవించి ఉన్న కాలంలోనే 2016 మే 11న ఆ భూమిపై పూర్తి హక్కులను తన పేరిట రాస్తూ దాఖలు స్వాధీన అగ్రిమెంటు రాసిచ్చారని,అగ్రిమెంటురాసిన కొద్ది రోజులకే 2016జూన్ 16న భర్త అనారోగ్యంతో మరణించారని పేర్కొన్నారు.అప్పటి నుంచి ఆ భూమిని తానే స్వాధీనంలో ఉంచుకుని సొంతంగా వ్యవసాయం చేసుకుంటున్నానని, ఆ భూమికి పాస్ పుస్తకాలు పంపిణీ చేయాలని కోరారు.

### గిరిజన భూమి కబ్జాపై ఫిర్యాదు, ఉద్యోగుల ప్రమేయంపై ఆరోపణలు

అనంతపురం జిల్లా లక్ష్మిపురం గ్రామానికి చెందిన బనావత్ వాలే నాయక్ తన అర్జీలో, కంబదూరు మండలం పాలూరు గ్రామ పరిధిలోని సర్వే నెంబర్ 80-1లోతన తల్లి లేట్ లక్ష్మిబాయి పేరిట 3.50ఎకరాల భూమి ఉందని, దానిపై వ్యవసాయం చేసుకుంటూ కుటుంబం జీవనం సాగించేదని తెలిపారు. అనివార్య కారణాల వల్ల తాత్కాలికంగా గ్రామం విడిచి పక్క గ్రామంలో నివసిస్తుండగా,ఆ సమయాన్ని ఆసరాగా చేసుకుని సరిహద్దుల్లోని సిద్దు నాయక్, అనితా బాయి భూమి సరిహద్దులను చెరిపివేసి గిరిజన భూమిని అక్రమంగా దున్నుకుంటూ కబ్జా చేశారని ఆరోపించారు. భూమి సర్వే కోసం రెవెన్యూ అధికారులతో కలిసి క్షేత్రస్థాయికి వెళ్లగా నిందితులు అధికారులను అడ్డుకుని సర్వే జరగకుండా దౌర్జన్యం చేశారని పేర్కొన్నారు. ప్రధాన నిందితుడు సిద్దు నాయక్ బ్రహ్మసముద్రం మండల తహశీల్దార్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా, అనితా బాయి బ్రహ్మసముద్రం మండలం సంతేకొండాపురం పంచాయతీ సెక్రటరీగా పని చేస్తున్నారని,ప్రభుత్వ ఉద్యోగులుగా ఉంటూ అధికారబలంతో భూమిని ఆక్రమించుకున్నారని ఆరోపిస్తూ చర్యలుతీసుకోవాలని కోరారు. వీటితోపాటు పలువురు పింఛన్లు, రేషన్, ఇళ్ల నిర్మాణాలకు సంబంధించిన సమస్యలపై అర్జీలు అందజేసి పరిష్కరించాలని కోరగా, మరికొందరు ఉద్యోగాలకోసం రెస్యూమ్‌లు అందజేశారు. అనారోగ్య సమస్యలతో ఇబ్బంది పడుతున్నామని,ఆర్థిక తోడ్పాటు కల్పించాలని మరికొందరు అభ్యర్థించారు. మొత్తం మీద గ్రీవెన్స్ కార్యక్రమానికి వివిధ జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో బాధితులు హాజరై తమ గోడు వెళ్లబోసుకోగా, అర్జీలను స్వీకరించిన నేతలు సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

# పట్టణ ప్రజలకు నాణ్యమైన ఇంధనాన్ని అందించాలి

**- జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి కొలుసుపార్థసారథి**

బాపట్ల (చైతన్య రథం): నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా పట్టణ ప్రజలకు ఇంధనాన్ని అందించాలని జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి, సమాచార మంత్రి కొలుసు పార్థసారథి పిలుపునిచ్చారు. బాపట్ల మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన బీపీసీఎల్ పెట్రోల్ బంక్‌ను సోమవారం ఉదయం జిల్లా కలెక్టర్ వినోద్ కుమార్, స్థానిక ఎమ్మెల్యే వేగేశ్న నరేంద్రవర్మ రాజు, బాపుడా చైర్మన్ రాజశేఖర్‌బాబుతో కలసి ప్రారంభించారు.ముందుగా మంత్రి పెట్రోల్‌బంక్‌ను పరిశీలించి, నిర్వహణకు సంబంధించిన వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి మీడియాతోమాట్లాడుతూ బాపట్ల పట్టణ పరిధిలో మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బీపీసీఎల్ పెట్రోల్ బంక్ ద్వారా నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా ఇంధనాన్ని అందించాలని సంబంధిత అధికారులకు సూచించారు. ప్రజలకు నాణ్యమైన ఇంధన సేవలను అందుబాటులోకి తీసుకురావడంతో పాటు మున్సిపాలిటీకి ఆదాయ వనరులను పెంపొందించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు. మున్సిపాలిటీలను ఆర్థికంగా మరింత బలోపేతం చేసేందుకు ఆదాయాన్ని పెంచే వివిధ కార్యక్రమాలను ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని తెలిపారు. ఈ బీపీసీఎల్ పెట్రోల్ బంక్ ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందడంతోపాటు మున్సిపాలిటీకి అదనపు ఆదాయం సమకూరుతుందని మంత్రి పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సంక్షేమం, మౌలిక సదుపాయాల అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యతనిస్తూ ముందుకు సాగుతోందని మంత్రి కొలుసు స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఆర్డీఓ హరికుమార్, మున్సిపల్ కమిషనర్ యం హాసిని, డిఈ కృష్ణరెడ్డి, బీపీసీఎల్ ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.



# ‘పాపి’ నోట.. పారదర్శకత పారమా!?

- గంగవరం వాటాను తెగనమ్మిన చేతులెవరివి?
- ఇప్పుడు రామాయపట్నంపైనా కళ్లుపడ్డాయా..
- అమ్మేస్తున్నారంటూ మొసలి కన్నీళ్లు దారుణం కాదూ?
- 1,500 కోట్ల అంకె చూసిన కళ్లు.. మిగతా లెక్క చదవలేదా?
- అధికారంలో పీపీపీ ‘అమృతం’.. ప్రతిపక్షంలో అదే పీపీపీ ‘విషమా’
- ఇదెక్కడి నంగనాచి రాజకీయ చోద్యం జగనాసురా..!?



**రామాయపట్నం పోర్టును కూటమి ప్రభుత్వం “తెగనమ్మేస్తోంద”ని నీలి పత్రిక కంటతడి పెట్టిన కథనం చదివితే, పోర్టు కాదు కదా.. ఏకంగా రాష్ట్రాన్నే అమ్మేస్తున్నారేమో అనిపిస్తుంది! కానీ లెక్కలు తీస్తే కనిపించే అసలు కథ వేరు. రూ.1,500 కోట్లు ప్రీమియం మాత్రమేనని, దానికి తోడు రెవెన్యూ షేర్, ఈక్విటీ, గ్యారెంటీ ఆదాయమని స్పష్టంగా కనిపిస్తోన్న దృశ్యం. గంగవరం వాటాను నిమిషాల్లో రాసిచ్చేసిన చరిత్ర భుజాన మోస్తున్న వైసీపీ, ఇప్పుడు పారదర్శకత పాఠాలు వల్లించడం పొలిటికల్ కామెడీకి పరాకాష్ఠ! దేశంలో 91 శాతం పోర్టులు నడిచే పీపీపీ విధానమే -గద్దెమీదున్నపుడు గొప్పగా కనిపించిన జగన్‌కు.. ప్రతిపక్షంలో కూర్చోవాల్సిన సమయంలో “కుంభకోణం”గా కనిపించడం విడ్డూరాలకే విడ్డూరం!**

రామాయపట్నం పోర్టు విషయంలో జగనాసురుడి వైఖరి.. దెయ్యాలు వేదాలు వల్లించిన చందానే ఉంది. స్వార్థపూరిత రాజకీంతో ఐదేళ్ల పాలనలో ఆంధ్రకు అడ్రెస్ లేకుండా చేసిన పాపి.. పారదర్శక పాటలు పాడుతుంటే గురివిందలే సిగ్గుపడుతున్నాయి. “రామాయపట్నం పోర్టును ప్రైవేటుకు అమ్మేస్తున్నారు” అంటూ గుండెలు బాదుకున్న నీలి పత్రిక కథనం.. నవ్విపోదురుగాక నాకేటి సిగ్గు అన్న చందమే. పారదర్శక విధానాలతో పోర్టుకు లాభదాయక మార్గాలను ప్రభుత్వం అనుసరిస్తుంటే.. ఏకంగా పోర్టునే అమ్మేస్తున్నారంటూ బురద జల్లుడుకు ఉపక్రమించడం.. జగన్‌కే సాధ్యమైన గొప్ప రాజకీయం. నిజం చెప్పాలంటే, ప్రభుత్వం పోర్టును అమ్మడం లేదు -30 ఏళ్ల డీబీఎఫ్‌వోటీ కన్సెషన్ ఇస్తోంది. గడువు ముగిశాక పోర్టు తిరిగి ప్రభుత్వానికే వస్తుంది. ఇది వైసీపీ మహా మేధావులకు తెలియని విషయమేమీ కాదు, తెలిసీ వక్రీకరణ కథనానికి పురుడు పోశారన్నది నిఖార్సయిన నిజం. రూ.1,500 కోట్లు అనే అంకెను భూతద్దంలో చూపించి, దానికి అదనంగా వచ్చే రెవెన్యూ షేర్ (ఏటా పెరుగుతూ గరిష్టంగా 25 శాతం వరకు), కనీస గ్యారెంటీ రాబడి (రూ.10 కోట్ల నుంచి రూ.150 కోట్ల దాకా), 12 శాతం శాశ్వత ఈక్విటీ వాటా వంటి “అసలు సిసలు” వివరాలను ఉద్దేశపూర్వకంగా విస్మరించడం -వైసీపీ కుట్ర కథనాలను నిలువెత్తు నిదర్శనం. గమ్మత్తేమిటంటే, లెక్కలన్నీ లెక్కేసుకుంటే, కాంట్రాక్టర్ పెట్టే రూ.20 వేల కోట్ల పెట్టుబడిలో కూడా ప్రభుత్వానికి శాశ్వత వాటా దక్కుతుంది. అంటే, “అమ్మకం” అని ఏడ్చిన చోటే, నిజానికి ప్రభుత్వానికి కొత్త ఆదాయ మార్గం పుడుతోంది. దీన్ని స్కామ్ అని ఎవరైనా అంటే, వాళ్లను లెక్కల బడిలో మళ్లీ చేరమని చెప్పక తప్పదు!

అసలు గమ్మత్తు ఏమిటంటే, ఈ “అమ్మకం అమ్మకం” అని అరిచే గొంతుకే, గంగవరం పోర్టులో ప్రభుత్వానికి ఉన్న 10.40 శాతం వాటాను నిమిషాల్లో ప్రయివేట్‌కు రాసిచ్చిన చరిత్ర ఉండటం. 2023లో ఎలాంటి పారదర్శక టెండర్ ప్రక్రియ లేకుండా, ప్రభుత్వ ప్రయోజనం ఒక్క రూపాయి కూడా చూడకుండా రెండు బెర్తులను జేఎస్‌డబ్ల్యుకు అప్పగించింది మాజీ ప్రభుత్వాధినేత జగన్ చేతులే. అప్పుడు అది “అభివృద్ధి”, ఇప్పుడు కూటమి ప్రభుత్వం చేస్తే “కుంభకోణం” -ఈ లెక్క వైసీపీకే సాధ్యం! అసలు -“రామాయపట్నంపై మాట్లాడే నైతిక హక్కు మనకెక్కడిదని.. వైసీపీ శ్రేణులే ప్రశ్నించుకోవాల్సిన ప్రశ్న. వైసీపీ పాలనలో పోర్టుల పేరుతో ఏం జరిగిందో ప్రపంచం మొత్తానికి తెలుసు. ఇక పీపీపీ విధానం విషయానికొస్తే, దేశంలో 119 నాన్-మేజర్ పోర్టుల్లో 108 (91 శాతం) ఇదే విధానంలో నడుస్తున్నాయనీ వాళ్లకు తెలుసు. ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, ఒడిశా, పుదుచ్చేరిల్లో నూరుశాతం పోర్టులు, గుజరాత్‌లో 90 శాతం పోర్టులు ఇదే విధానంలో నడుస్తుండటం లోకమెరిగిన విషయమే. ఏపీలో స్వయంగా కృష్ణపట్నం, కాకినాడ, గంగవరం పోర్టులు 29 ఏళ్లుగా ఇదే నమూనాలో విజయవంతంగా నడుస్తున్నాయి. వీటిలో గంగవరం కూడా ఒకటే సుమా! తాను ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు పీపీపీ విధానాన్ని ఏనాడూ వ్యతిరేకించని జగన్‌రెడ్డి, ఇప్పుడు ప్రతిపక్షంలో కూర్చుని అదే విధానాన్ని “ద్రోహం”గా చిత్రీకరించడం -సైద్ధాంతిక అస్థిరతా? లేక అధికారం పోయిందన్న అక్కసా? ప్రజలు ఈ రెండు నాల్కల ధోరణిని లోతుగా గమనించకపోరు.

ఇక వాస్తవాల విషయానికొస్తే.. -వైసీపీ ఐదేళ్ల పాలనలో రామాయపట్నం పోర్టు భౌతిక ప్రగతి కేవలం 50 శాతమే. కూటమి ప్రభుత్వం వచ్చాక 20 నెలల్లోనే 80.5 శాతానికి పనులు చేరాయన్నది అధికారిక లెక్కలు చూపిస్తోన్న వాస్తవిక దృశ్యం. అసంపూర్తిగా వదిలేసిన భూసేకరణనూ కూటమి ప్రభుత్వమే భుజాన మోసింది. 2,538 ఎకరాల్లో 19 బెర్తులతో, ఏటా 138.54 మిలియన్ మెట్రిక్ టన్నుల కార్గో సామర్థ్యంతో రూపుదిద్దుకుంటున్న ప్రాజెక్టు పూర్తయితే సుమారు 25 వేల ఉద్యోగాలు రానున్నాయని అంచనా. పనుల వేగవంతానికి మంత్రివర్గ ఉపసంఘం ఏర్పాటు చేసి, రైలు-రోడ్డు కనెక్టివిటీపై ప్రత్యేక దృష్టి పెట్టింది కూటమి ప్రభుత్వమే. మూలపేట, మచిలీపట్నం, రామాయపట్నం పోర్టులను ఈ ఏడాది చివరినాటికి ప్రారంభించే లక్ష్యంతో ముఖ్యమంత్రి చంద్రబాబు.. ప్రతి 50 కిలోమీటర్లకు ఒక పోర్టు లేదా ఫిషింగ్ హార్బర్ నిర్మించాలన్న బృహత్తర ప్రణాళికతో ముందుకు సాగుతున్నారు. రూ.50 వేల కోట్లకు పైగా అవసరమయ్యే ఈ మూడు గ్రీన్‌ఫీల్డ్ పోర్టుల నిర్మాణానికి ప్రభుత్వంపై పూర్తిభారం మోపకుండా, ప్రైవేట్ పెట్టుబడులను ఆకర్షిస్తూ, ప్రభుత్వ ప్రయోజనాలను కాపాడుతూ ముందుకెళ్లడమే అసలైన వ్యూహం. ఈ నేపథ్యంలో, పనిచేసి చూపిస్తున్న ప్రభుత్వంపై అభూతకల్పనలు అల్లి, పని చేయకుండా ఐదేళ్లు వృథా చేసిన పార్టీ నీతులు వల్లె వేయడం -నిఖార్సయిన రాజకీయంలో కామెడీ ట్రాక్‌లాంటిదే. ఆంధ్రప్రదేశ్ మారిటైమ్ హబ్‌గా ఎదిగే చారిత్రక అవకాశాన్ని అడ్డుకోవాలని చూసే వారి ఆరాటమే -నీలి పత్రిక వండివార్చిన వక్రీకరణ కథనంలో అసలు ట్విస్ట్!

**- మహాదేవ**

## తెలుగు భాష, సంస్కృతి వైభవానికి

# రెండు ప్రతిష్టాత్మక ఉత్సవాలు

- జూలై 25, 26న ‘ఆంధ్రప్రదేశ్ తెలుగు మహోత్సవం’
- ఆగస్టు 8, 9న ‘అమరావతి చిత్రకళా వీధి’
- కళాకారులు, రచయితలు, ప్రజలందరూ భాగస్వాములు కావాలి
- రాష్ట్ర సృజనాత్మకత, సాంస్కృతిక సమితి చైర్‌పర్సన్ తేజస్వి పొడపాటి




విజయవాడ (చైతన్య రథం): రాష్ట్రంలో తెలుగు భాష, సాహిత్యం, కళలు, సంస్కృతికి పూర్వవైభవం తీసుకురావడమే లక్ష్యంగా రాష్ట్ర సృజనాత్మకత మరియు సాంస్కృతిక సమితి ఆధ్వర్యంలో రెండు ప్రతిష్టాత్మక కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్టు సమితి చైర్‌పర్సన్ తేజస్వి పొడపాటి తెలిపారు. విజయవాడ ఘంటసాల వెంకటేశ్వరరావు ప్రభుత్వ, నృత్య సంగీత కళాశాలలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో తేజస్వి మాట్లాడుతూ... ఏపీని దేశంలోనే సాంస్కృతిక రాజధానిగా తీర్చిదిద్దాలనే సంకల్పంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. ఈ దిశగా జూలై 25, 26 తేదీలలో ఉండవల్లి గుహల ప్రాంగణంలో ‘ఆంధ్రప్రదేశ్ తెలుగు మహోత్సవం’ అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. తెలుగు భాషను కేవలం మాట్లాడే భాషగా కాకుండా, భావితరాలకు వారసత్వంగా అందించే లక్ష్యంతో ఈ మహోత్సవాన్ని రూపొందించినట్టు తెలిపారు. రెండు రోజులపాటు జరిగే ఉత్సవంలో ‘సూర్యోదయ సుప్రభాతం’ సంగీత కార్యక్రమం, ‘ఆమె మాట -అక్షర బాట’, కవి సమ్మేళనాలు, ‘అమ్మమ్మ కథల ముచ్చట్లు’, ‘నెక్స్ట్ జెన్ తెలుగు’ యువతతో చర్చలు, ‘నవస్వరం’ ప్యానెల్ డిస్కషన్లు, తపాలా శాఖ సహకారంతో పూర్తిగా తెలుగులో పోస్టుకార్డులు రాసే వినూత్న కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు తెలిపారు.

ఆగస్టు 8, 9 తేదీలలో గుంటూరు విద్యానగర్ రింగ్ రోడ్డులో ‘అమరావతి చిత్రకళా వీధి’ పేరుతో ఓపెన్ ఎయిర్ ఆర్ట్ ఫెస్టివల్ నిర్వహించనున్నట్టు వెల్లడించారు. గత ఏడాది రాజమండ్రిలో 550 మంది కళాకారులతో విజయవంతంగా నిర్వహించిన కార్యక్రమాన్ని ఈసారి 800 స్టాల్స్‌తో మరింత విస్తృతంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. రాష్ట్ర చిత్రకారులు తమ ప్రతిభను ప్రదర్శించేందుకు స్వరాష్ట్రంలోనే విశాల వేదిక కల్పించడం కార్యక్రమం ప్రధాన ఉద్దేశమన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, ఐటీ మంత్రి నారా లోకేష్, పర్యాటక, సాంస్కృతిక మంత్రి కందుల దుర్గేష్ ప్రోత్సాహంతో కార్యక్రమాలను రూపొందించినట్టు తేజస్వి పొడపాటి పేర్కొన్నారు. జూలై 26 సాయంత్రం జరిగే తెలుగు మహోత్సవం ముగింపు సభకు మాజీ ఉపరాష్ట్రపతి ఎం వెంకయ్య నాయుడు, కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర మంత్రి కందుల దుర్గేష్ తదితర ప్రముఖులు హాజరుకానున్నట్టు తెలిపారు. కార్యక్రమాలు కేవలం ప్రభుత్వ నిర్వహణలో జరిగేవి మాత్రమే కాకుండా, కళాకారులు, రచయితలు, సాహితీవేత్తలు, సాంస్కృతిక సంస్థలు, యువత, ప్రజలందరూ భాగస్వాములై తెలుగు సంస్కృతి పరిరక్షణకు తోడ్పడాలని తేజస్వి పొడపాటి పిలుపునిచ్చారు.

చైతన్యరథం

## దొంగపత్రాలతో భూకబ్జా చేసిన

# తమ్మినేనిని అరెస్ట్ చేయాలి

- చెప్పేవి శ్రీరంగనీతులు చేసేవి అవినీతి అక్రమాలు
- భూకబ్జాలు అనే సూక్తి వైసీపీ నాయకుడు తమ్మినేనిది
- నకిలీ మరణ ధృవీకరణతో శ్రీకాకుళంలో రూ.4 కోట్ల భూ కబ్జా
- వైసీపీని రాజకీయ పార్టీకంటే అసాంఘిక శక్తుల అడ్డా అంటే బాగుంటుంది
- టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు వర్ల రామయ్య

మంగళగిరి (చైతన్య రథం): "వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అనేది ఒక పద్ధతిగల రాజకీయ పార్టీ కాదు. అది కేవలం అసాంఘిక శక్తులకు కేరాఫ్ అడ్రస్‌గా మారింది" అని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు వర్ల రామయ్య తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన అరాచకాలు, అవినీతిపై ఘాటుగా స్పందించారు. వైసీపీ నాయకుల్లో అవినీతి ఏస్థాయిలో తాండవిస్తోందో ప్రజలందరూ చూస్తూనే ఉన్నారని మండిపడ్డారు. నేడు టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. అధికారాన్ని అడ్డం పెట్టుకుని అరాచకాలు సృష్టించడం, ఆశ్రిత పక్షపాతం, బంధుప్రీతితో దోచుకోవడమే ఆ పార్టీ ఏకైక ఎజెండా అని విమర్శించారు. జగన్మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న ఐదేళ్ల కాలంలో స్పీకర్ పదవిలో ఉన్న తమ్మినేని సీతారాం ప్రవర్తనను తీవ్రంగా తప్పుబట్టారు. "పెద్ద మనిషి తరహాలో ఆహార్యం ప్రదర్శిస్తూ, నుదుటన పెద్ద బొట్టు పెట్టుకుని అసెంబ్లీలోనూ, బయట ఎన్ని నీతులు పలికారో అందరికీ తెలుసు. తీరా చూస్తే ఆచరణలో అవన్నీ బూటకపు మాటలని తేలిపోయింది" అని ఎద్దేవా చేశారు. అధికారం చేతిలో ఉంటే చట్టాన్ని, వ్యవస్థలను సొంత లాభాలకు ఎలా వాడుకోవచ్చో వైసీపీ నాయకులు నిరూపించారు. భూ యజమాని బతికుండగానే చనిపోయినట్టు నకిలీ డెత్ సర్టిఫికెట్ సృష్టించి, దొంగ పత్రాలతో కోట్ల విలువైన భూమిని స్వాహా చేసిన వ్యవహారంలో మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం కుటుంబంతోపాటు మొత్తం 13మందిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ భారీ భూకుంభకోణానికి సంబంధించిన వివరాలను శ్రీకాకుళం జిల్లా ఎస్పీ మీడియాకు వెల్లడించారు. ఈ భూకబ్జా కోసం ఎలాంటి బినామీలను రంగంలోకి దించకుండా, సాక్షాత్తూ తమ్మినేని సీతారాం కుమారుడి పేరిట 2023లోనే అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. అసలు యజమాని బతికే ఉన్నప్పటికీ, ఆయన చనిపోయినట్టు ఫేక్ డెత్ సర్టిఫికెట్, తప్పుడు వారసత్వ పత్రాలను సృష్టించి ఈ దందాకు తెరలేపారు. బాధితుడు ఇచ్చిన అధికారిక ఫిర్యాదుతో కదిలిన పోలీసులు లోతుగా విచారణ జరిపారు. ఈ అక్రమ రిజిస్ట్రేషన్‌కు పూర్తిగా సహకరించిన స్థానిక సబ్ రిజిస్ట్రార్‌తోపాటు మొత్తం 13మందిని నిందితులుగా తేల్చారు. ఈ కేసు దర్యాప్తులో భాగంగా ఇప్పటికే ఎనిమిది మంది నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. ప్రస్తుతం తమ్మినేని సీతారాం, ఆయన భార్య, కుమారుడు పరారీలో ఉన్నారని... వారి కోసం గాలింపు చర్యలు ముమ్మరం చేశామని ఎస్పీ తెలిపారని వర్ల వెల్లడించారు.

### తమ్మినేని గారూ... చట్టానికి దొరక్కుండా అండర్ గ్రౌండ్ బతుకేంటి?

వైఎస్సార్ కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం పరారీపై టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు వర్ల రామయ్య తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. తమ్మినేని సీతారాం చేసిన అక్రమాలు, భూకబ్జాలు, ఫోర్జరీ వ్యవహారాలు ఒక్కొక్కటిగా బయటపడుతుండటంతోనే ఆయన కుటుంబంతో సహా పారిపోయారని ఆరోపించారు. "ఏమిటి తమ్మినేని గారూ ఈ బతుకు? సమాజంలో పెద్ద మనుషులుగా చలామణీ అవుతూ మీరు మాట్లాడే మాటలేంటి? మీరు చేసే ఈ ఫోర్జరీ వ్యవహారాలు, దొంగ పనులు, భూకబ్జాలేమిటి? ఒకప్పుడు అంతటి ఉన్నతమైన పదవిలో ఉండి... ఈ రోజున చట్టానికి దొరక్కుండా భార్యాపిల్లలను వేసుకుని అండర్ గ్రౌండ్‌కు పారిపోవాల్సిన కర్మ మీకెందుకు పట్టింది? ఆమదాలవలస ఇంట్లో చూస్తే లేరు. శ్రీకాకుళం ఇంట్లో చూస్తే లేరు. అసలు ఎక్కడ దాక్కున్నారు మీరు?. గౌరవ జగన్మోహన్ రెడ్డీ.. మీ తండ్రిలాంటి తమ్మినేని సీతారాం ఇప్పుడు ఏ ఊళ్ళో, ఏ ఇంట్లో దాక్కున్నారో పోలీసులకు ఏమైనా హింట్ ఇవ్వగలరా? 'మా నాన్నలాంటి సీతారాం ఫలానా చోట దాక్కున్నాడు, వెళ్లి అరెస్ట్ చేయండి' అని పోలీసులకు సమాచారం ఇచ్చే ధైర్యం, నైతికత మీకుందా అని ప్రశ్నిస్తున్నాను. పదవులను అడ్డం పెట్టుకుని బోలెడు సంపాదించుకున్నారు కదా తమ్మినేనీ, ఇంకెందుకు మీకు ఈ నికృష్టపు పనులు? ఈ దొంగచాటు బతుకులు? తప్పు చేసిన వారు ఎవరైనా సరే చట్టం ముందు మోకరిల్లాల్సిందే. చట్టానికి ఎవరూ చుట్టాలు కారు. త్వరలోనే తమ్మినేని కుటుంబాన్ని అరెస్ట్ చేస్తామని శ్రీకాకుళం ఎస్పీ కూడా స్పష్టం చేశారు. వైఎస్సార్సీపీ నాయకుల అసలు రంగు, వారి నకిలీ బతుకులు, అధికార బలంతో చేసిన అరాచకాలు ఇప్పుడు ప్రజల ముందు పూర్తిగా బట్టబయలయ్యాయి. తమ్మినేని సీతారాం తక్షణమే పోలీసులకు లొంగిపోవాలి" అని వర్ల డిమాండ్ చేశారు.

### బతికున్న మనిషిని చంపేసి రూ.4 కోట్ల భూ కబ్జానా?

వైఎస్సార్ కాంగ్రెస్ అనేది రాజకీయ పార్టీ కాదని, అది కేవలం అసాంఘిక శక్తుల అడ్డా అనడానికి మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం ఉదంతమే సజీవ సాక్ష్యమని వర్ల రామయ్య తీవ్రస్థాయిలో మండిపడ్డారు. నుదుటన పెద్ద బొట్టు పెట్టుకుని, పెద్ద వేదాంతిలా, నీతిమంతుడిలా నాడు చట్టసభలో మన నేత చంద్రబాబు నాయుడికే శ్రీరంగ నీతులు చెప్పిన తమ్మినేని సీతారాం అసలు స్వరూపం చూసి ప్రజలంతా ముక్కున వేలేసుకుంటున్నారని ధ్వజమెత్తారు. "పైకి అంత సాధువులా కనిపిస్తూ, వెనక ఇంత పెద్ద కిలాడీ పనులకు తెరలేపారా తమ్మినేని? డబ్బు కోసం ఎంత నీచానికైనా దిగజారుతారా? ఎంత దుర్మార్గానికైనా ఒడిగడతారా? తమ్మినేని సీతారాం రాసిన ఈ అక్రమ స్క్రీన్ ప్లే చూస్తే సినీ రచయితలు పరుచూరి బ్రదర్స్ కూడా వెనకబడిపోతారు. అంతలా నేరపూరిత కుట్రకు పాల్పడ్డారు. అందవరపు గోవిందరాజులు అనే భూయజమాని ఇప్పటికీ హాయిగా, ఆరోగ్యంగా బతికే ఉన్నారు. కానీ ఆయన చనిపోయాడంటూ శ్రీకాకుళం కార్పొరేషన్‌లో నకిలీ మరణ ధ్రువీకరణ పత్రం (డెత్ సర్టిఫికెట్) సృష్టించారు. ఒడిస్సాలో ఉండే 'అడబాల రజని' అనే అమ్మాయిని తెచ్చి, ఈమె గోవిందరాజుల కూతురేనంటూ ఒక నకిలీ ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ పుట్టించారు. ఈ నకిలీ పత్రాలన్నింటినీ ఉపయోగించి, 2023లో స్పీకర్ పదవిలో ఉన్న తమ్మినేని సీతారాం తన అధికార బలంతో తన కొడుకు పేరిట ఏకంగా నాలుగు కోట్ల రూపాయల విలువైన భూమిని కబ్జా చేసి రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. ఇదంతా తమ్మినేని సీతారాం,



ఆయన కొడుకు, శ్రీకాకుళం కార్పొరేషన్ కమిషనర్, స్థానిక తహశీల్దార్ కలిసి చేసిన ఒక భారీ నేరపూరిత కుట్ర. బతికున్న మనిషిని చంపేసి డెత్ సర్టిఫికెట్ ఇచ్చిన శ్రీకాకుళం మున్సిపల్ కమిషనర్‌ను ఈ కేసులో వెంటనే ఏ-10 ముద్దాయిగా చేర్చాలి. అలాగే ఒడిస్సా అమ్మాయిని కూతురిగా చూపిస్తూ ఫ్యామిలీ సర్టిఫికెట్ ఇచ్చిన తహశీల్దార్‌ను కేవలం సస్పెండ్ చేయడం కాదు, వెంటనే కేసులో నిందితుడిగా చేర్చి అరెస్ట్ చేయాలి. ఈ అక్రమార్కులకు సహకరించిన అధికారుల మీద ఎలాంటి దయాదాక్షిణ్యాలు చూపించాల్సిన అవసరం లేదు. జగన్మోహన్ రెడ్డీ.. 'ఈయన నా తండ్రి లాంటివాడు, సచ్ఛీలుడు' అని నాడు సభలో డబ్బా కొట్టారు కదా... ఇటువంటి 420 పనులు చేసిన వ్యక్తిని చూసి ఇప్పుడు మీకేమనిపిస్తోంది? 'ఛీఛీ.. వీడా నా తండ్రి లాంటివాడు' అని చెప్పే ధైర్యం మీకు ఉందా? లేక ఇప్పటికీ అతడు మీ తండ్రిలాంటివాడేనని సమర్థించుకుంటారా? వైఎస్సార్సీపీ అధినేత దగ్గరి నుంచి ఆ పార్టీలో ఉన్న మెజారిటీ నాయకుల పెద్ద చిట్టా, జాతకాలు నా దగ్గర ఉన్నాయి. అవన్నీ బయటపెడితే ప్రజలు ఆశ్చర్యపోవడం ఖాయం. ప్రస్తుతం అండర్ గ్రౌండ్‌లో దాక్కున్న తమ్మినేని సీతారాంను, ఆయన కొడుకును వెంటనే అరెస్ట్ చేసి జ్యుడీషియల్ కస్టడీకి పంపాలి. ఒకవేళ తమ్మినేని భార్య మహిళ గనుక ఆమెను స్టేషన్‌కు పిలిపించి చట్టప్రకారం బెయిల్ ఇవ్వండి. కానీ, ప్రజలకు ఇన్ని నీతులు చెప్పిన ఈ మాజీ సభాపతి నకిలీ బండారం లోకానికి తెలియాలంటే... తమ్మినేని సీతారాం చేతులకు పోలీసులు బేడీలు వేసి నడిపించుకుంటూ తీసుకురావాలి. వీరు ఫోర్జరీ డాక్యుమెంట్ల కోసం వాడిన నకిలీ రబ్బరు స్టాంపులను వెంటనే స్వాధీనం చేసుకోవాలి. చట్టం ముందు ఎవరైనా ఒకటే... ఈ దొంగ పత్రాల ముఠాను, వారికి సహకరించిన అధికారులను వదిలిపెట్టే ప్రసక్తే లేదని వర్ల రామయ్య హెచ్చరించారు.

### నకిలీ సర్టిఫికెట్ల కుంభకోణంలో తమ్మినేని కుటుంబాన్ని అరెస్ట్ చేయాలి


శ్రీకాకుళం మాజీ సభాపతి తమ్మినేని సీతారాం నడిపిన నకిలీ సర్టిఫికెట్ల భూకుంభకోణం ఉదంతం రోజుకో కొత్త మలుపు తిరుగుతోందన్నారు. బతికున్న భూయజమానిని కాగితాల్లో చంపేసి, లేని కూతురిని సృష్టించి చేసిన ఈ కబ్జా వ్యవహారంలో తమ్మినేని కుటుంబమే ప్రధాన ముద్దాయిలుగా తేలిందని వర్ల రామయ్య మండిపడ్డారు. బతికున్న భూయజమాని అందవరపు గోవిందరాజులు అనే వ్యక్తిని కాగితాల్లో చంపేసి, ఒడిస్సా నుంచి అడబాల రజని అనే నకిలీ కూతురిని సృష్టించి, తప్పుడు పత్రాలతో చేసిన ఈ భూకబ్జా వ్యవహారంలో మొత్తం 13మంది ముద్దాయిలు ఇన్వాల్వ్ అయినట్లు స్పష్టంగా తెలుస్తోంది. ఈ దొంగ సర్టిఫికెట్ల కుంభకోణంలో ఎవరి పాత్ర ఎంత అనేది ఇప్పటికే ఐడెంటిఫై అయింది. పోలీసులు నమోదు చేసిన ఎఫ్ఐఆర్ వివరాల ప్రకారం ఈ కేసులో తమ్మినేని కుటుంబ సభ్యులను ప్రధాన ముద్దాయిలుగా చేర్చారు. ఏ-5 తమ్మినేని శ్రీరామ చిరంజీవి నాగ్ (తమ్మినేని సీతారాం కుమారుడు), ఏ-6 సాక్షాత్తు మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం, ఏ-7 తమ్మినేని వాణి (సీతారాం భార్య). శ్రీకాకుళం రూరల్ పరిధిలోని చాపూరం గ్రామ పంచాయతీ బలిగ పరిధిలో ఉన్న సర్వే నంబర్ 35/13, 84, 85, 86 ప్లాట్లలో... మొత్తం 920 గజాల భూమిని దొంగ సర్టిఫికెట్లు పెట్టి ఈ తమ్మినేని కుటుంబం నొక్కేసింది. అడ్డగోలుగా పత్రాలు సృష్టించి నాలుగు కోట్ల రూపాయల విలువైన భూమిని ఇలా అన్యాక్రాంతం చేయడం సబబేనా? అని అడుగుతున్నాను. అధికారం చేతిలో ఉందన్న అహంకారంతో దొంగ పనులకు పాల్పడిన ఈ తమ్మినేని ముగ్గురితోపాటు... వీరికి అక్రమాల్లో సహకరించిన మున్సిపల్ కమిషనర్, తహశీల్దార్లను అందరినీ వెంటనే అరెస్ట్ చేయాలి. చట్టం ముందు ఎవరైనా సమానులే అని నిరూపిస్తూ, ఈ 13మంది ముద్దాయిలను చట్టం ముందు నిలబెట్టాలని వర్ల రామయ్య డిమాండ్ చేస్తున్నాం.

### జగన్‌కు తమ్మినేని అచ్చుగుద్దినట్టు సరిపోయారు...

ఈ మొత్తం వ్యవహారం చూస్తుంటే వైఎస్సార్సీపీలో అవినీతి ఏ స్థాయిలో వ్యవస్థీకృతమైందో అర్థమవుతోందని వర్ల రామయ్య మండిపడ్డారు. ఈ మొత్తం వ్యవహారం చూస్తుంటే నాకు ఒక సామెత గుర్తొస్తోంది... 'నీవు నేర్పిన విద్యయే నీరజాక్షా' అని. ఇక్కడ ఆ నీరజాక్షుడు ఎవరో కాదు, సాక్షాత్తు వైఎస్సార్సీపీ అధినేత జగన్మోహన్ రెడ్డే! ఆ జగన్మోహన్‌రెడ్డి నేర్పిన అవినీతి, అరాచక విద్యలనే ఆయనకు 'తండ్రి లాంటివాడు' అయిన తమ్మినేని సీతారాం అచ్చుగుద్దినట్టు వంటబట్టించుకున్నారు. కొడుకుని చూసి తండ్రి లాంటివాడు నేర్చుకుంటున్నాడో, లేక తండ్రిలాంటివాడిని చూసి కొడుకు నేర్చుకుంటున్నాడో అర్థం కావడం లేదు కానీ.. అక్రమాలు చేయడం మాత్రం వీరికి వెన్నతో పెట్టిన విద్యగా మారింది. ఎవరైనా ప్రశ్నిస్తే 'ఇది మాకు అలవాటే, మా పార్టీకి కొత్తేమీ కాదు' అన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. జగన్మోహన్ రెడ్డీ.. ఇప్పుడు మీ 'తండ్రిలాంటి' తమ్మినేని సీతారాం చేసిన ఘనకార్యంపై మీ పార్టీ తరఫున ఏం యాక్షన్ తీసుకుంటారో సమాధానం చెప్పాలి. దొంగ డాక్యుమెంట్లు సృష్టించి, బతికున్నవాడిని కాగితాల్లో చంపేసి, లేని కూతురిని ఒడిస్సానుంచి తెచ్చిన ఈ తమ్మినేని సీతారాం రేపు ఎంతకైనా తెగిస్తాడు. జాగ్రత్త జగన్మోహన్ రెడ్డీ, రేపు మీ స్థానంలో ఇంకొకరిని తెచ్చి 'ఆయన కాదు జగన్మోహన్‌రెడ్డి, ఇతనే జగన్మోహన్ రెడ్డి' అని చెప్పి మీకే టోపీ పెట్టినా ఆశ్చర్యపోవాల్సిన అవసరం లేదు. అంతటి ఘనాపాటి, సినిమా స్టోరీ రైటర్ మీ తండ్రిలాంటి సీతారాం. పెద్ద మనిషిగా చట్టసభల్లో చలామణి అవుతూ, సమాజానికి శ్రీరంగ నీతులు చెప్పే మీకు ఇంత దిగజారుడు అవసరమా మిస్టర్ తమ్మినేని? మీకు పబ్లిక్ లైఫ్‌లో ఉండే అర్హత ఏమైనా ఉందా అని అడుగుతున్నాను. పైకి పెద్ద బొట్టు పెట్టుకుని వేదాంతిలా నటిస్తూ, వెనక ఇంతటి నికృష్టపు పనులకు పాల్పడతారా? ఇటువంటి నీచ, దిగజారుడు మనస్తత్వం గలవాళ్ళని, దొడ్డిదారిన అవినీతి, అక్రమాలు, భూకబ్జాలకు పాల్పడే తమ్మినేని సీతారాం లాంటి వాళ్ళని, వారికి అండగా నిలిచే జగన్మోహన్‌రెడ్డి లాంటి నాయకులను ప్రజా జీవితం నుంచి, రాజకీయాల నుంచి తరిమికొట్టాలని నేను రాష్ట్ర ప్రజలందరికీ పిలుపునిస్తున్నాను. బతికున్న మనిషిని చంపేసి కోట్ల విలువైన భూమిని నొక్కేసిన ఈ దొంగల ముఠాపై, తప్పు చేసిన ప్రతి ఒక్కరి మీదా తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని పొలిట్ బ్యూరో సభ్యులు వర్ల రామయ్య డిమాండ్ చేశారు.

# 'స్వచ్ఛరక్షణ' సక్సెస్ కావాలి

- చాంబర్ ఆఫ్ కామర్స్, హోటల్స్ అసోసియేషన్లను చైతన్యపర్చండి
- ఏజెన్సీలకు స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి ఆదేశాలు



అమరావతి (చైతన్య రథం): స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఏఐఐఎల్ఎస్‌జీ, సాహస్, వాష్ ఏజెన్సీలు నిర్వహించే సీబీ (కెపాసిటీ బిల్డింగ్), ఐఈసీ (ఇన్ఫర్మేషన్, ఎడ్యుకేషన్ అండ్ కమ్యూనికేషన్) కార్యక్రమాలకు చాంబర్ ఆఫ్ కామర్స్, హోటల్స్ అసోసియేషన్స్, స్వచ్ఛంద సంస్థలు, లయన్స్, రోటరీ... వంటి పెద్ద అసోసియేషన్లు పాల్గొనేలా కార్యక్రమాలు చేపట్టాలని ఏజెన్సీలను స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ ఆదేశించారు. అమరావతిలోని కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం జరిగిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఐఈసీ, సీబీ ప్రాజెక్ట్ పనులను సమీక్షించారు. ఈ సందర్భంగా చైర్మన్ పట్టాభిరామ్ మాట్లాడుతూ స్వచ్ఛత కార్యక్రమాలలో చాంబర్ ఆఫ్ కామర్స్, హోటల్స్ అసోసియేషన్స్, స్వచ్ఛంద సంస్థలు తప్పనిసరిగా పాల్గొనేలా వారితో మాట్లాడి కార్యక్రమాలు రూపొందించాలన్నారు. నివాస కాలనీలు, వెల్ఫేర్ అసోసియేషన్లు సైతం పాల్గొనేలా కార్యక్రమాలు రూపొందించాలన్నారు. వెల్ఫేర్ అసోసియేషన్స్‌కి సంబంధించి జాతీయ, రాష్ట్రస్థాయి అసోసియేషన్లు ఉన్నట్లు తెలిపారు. ఉపాధ్యాయులకు నిర్వహించే రెండు మూడు ఐఈసీ కార్యక్రమాలలో తాను కూడా పాల్గొంటానని చైర్మన్ చెప్పారు. 'స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర'పై ప్రజలలో సంపూర్ణ అవగాహన కల్పించేందుకు అత్యధిక కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఆగస్టు నెలాఖరుకు అందరికీ శిక్షణ, అవగాహనా కార్యక్రమాలు పూర్తి చేయాలని ఆదేశించారు. పూర్తి ప్లాన్ ఆఫ్ యాక్షన్, ఇతర వివరాలను వారంలోనే తమకు సమర్పించాలని చైర్మన్ పట్టాభిరామ్ కోరారు. రాష్ట్రంలోని 26 జిల్లాల్లో అర్బన్, గ్రామీణ ప్రాంతాల్లో చేపట్టిన సీబీ, ఐఈసీ కార్యక్రమాల వివరాలను ఏఐఐఎల్ఎస్‌జీ, సాహస్, వాష్ సంస్థలకు చెందిన ప్రతినిధులు చైర్మన్ పట్టాభిరామ్‌కు వివరించారు. స్వచ్ఛ ఆంధ్ర లక్ష్య సాధనలో విస్తృత ప్రజావగాహన, సామర్థ్యాభివృద్ధికి వాష్ ఇన్‌స్టిట్యూట్ కీలక భాగస్వామ్యం వహిస్తున్నట్లు ఆ సంస్థ ప్రతినిధులు తెలిపారు. గత పది నెలలుగా స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్‌కు స్వచ్ఛత నాలెడ్జ్ పార్ట్‌నర్‌గా సేవలందిస్తున్న తాము రాష్ట్రవ్యాప్తంగా సమాచార, విద్య, ప్రచార(ఐఈసీ) వ్యూహాల రూపకల్పన, ప్రవర్తనలో మార్పువంటి కార్యక్రమాలు, కమ్యూనికేషన్ మెటీరియల్ తయారీ, డిజిటల్ ప్రచారం, క్షేత్రస్థాయిలో వ్యవస్థల మధ్య సమన్వయం విషయంలో కీలక పాత్ర పోషిస్తున్నట్లు వివరించారు.రాష్ట్రంలోని 53 పట్టణ స్థానిక సంస్థల్లో (యూఎల్‌బీలు) ఇప్పటి వరకు 923 ఐఈసీ కార్యక్రమాలు విజయవంతంగా నిర్వహించినట్లు చెప్పారు. వాటిద్వారా 3.38 లక్షలకుపైగా పౌరులకు స్వచ్ఛత, వ్యర్థాలు వేరుచేయడం, పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించినట్లు తెలిపారు. అదేవిధంగా, వాష్ ఇన్‌స్టిట్యూట్, సాహస్ సంస్థలు సంయుక్తంగా గత పది నెలల్లో పట్టణ స్థానిక సంస్థల్లో 432 సామర్థ్యాభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించి, 29,339 మందికి పైగా భాగస్వాములకు శిక్షణ అందించినట్లు వివరించారు. శిక్షణల్లో ప్రజాప్రతినిధులు, పారిశుద్ధ్య కార్మికులు, మెప్మా రిసోర్స్ పర్సన్లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, శానిటరీ సూపర్‌వైజర్లు, ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు పాల్గొని పారిశుద్ధ్య కార్యక్రమాలు సమర్థవంతంగా నిర్వహించడంలో తమ సామర్థ్యాలను మరింత బలోపేతం చేసుకున్నట్లు తెలిపారు.

### 20కి చేరిన ప్లాస్టిక్ ఫ్రీ మున్సిపల్ కార్యాలయాలు

తమ పరిధిలో ప్లాస్టిక్ ఫ్రీ మున్సిపల్ కార్యాలయాలు 20కి చేరినట్లు ఏఐఐఎల్ఎస్ జీ ప్రాజెక్ట్ ఆఫీసర్ తెలిపారు. మార్కెట్, ఇతర వాణిజ్య సముదాయాలున్న ప్రాంతాల్లో, రైల్వే స్టేషన్లలో స్వచ్ఛ రక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 70 యూఎల్బీలలో 28,229 మందికి శిక్షణ ఇచ్చినట్లు చెప్పారు.సమావేశంలో ఏఐఐఎల్ఎస్‌జీ,సాహస్, వాష్ సంస్థలకు చెందిన ప్రతినిధులు వి.చలపతిరాజ్, వి.హైమావతి,హేతల్ జలాద్, వి.శశాంక్, ఎం.అర్జున్ ప్రసాద్, శివ కురెళ్ల, కిషోర్, ప్రవీణ్, రాజేష్, ఏ.శివన్నారాయణ, ఎన్.సన్నీ తదితరులు పాల్గొన్నారు.

# అంగన్వాడీలకు కూటమి అండ

## - టీడీపీ నాయకురాలు ఆచంట సునీత

మంగళగిరి (చైతన్య రథం): అంగన్వాడీలకు అండగా నిలిచింది కూటమి ప్రభుత్వమేనని టీడీపీ నాయకురాలు ఆచంట సునీత స్పష్టం చేశారు. నేడు టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సునీత మాట్లాడుతూ... కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండేళ్ల కాలంలో అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగుతోందన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీల్లో భాగంగా 'సూపర్ సిక్స్' పథకాలను దిగ్విజయంగా అమలు చేసి కూటమి ప్రభుత్వం ప్రజాదరణ పొందిందన్నారు. ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న అంగన్వాడీల చిరకాల వాంఛలను నెరవేరుస్తూ, వారి సంక్షేమానికి పెద్దపీట వేసిన ఘనత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడికి దక్కుతుందన్నారు. 'తల్లికి వందనం' కార్యక్రమం ద్వారా 17 వేలమంది అంగన్‌వాడీ కార్యకర్తల పిల్లలకు నేరుగా లబ్ధి చేకూరుస్తున్నామని స్పష్టం చేశారు. గత వైసీపీ ప్రభుత్వంలో అంగన్వాడీలను కేవలం వెట్టిచాకిరీకే పరిమితం చేశారని ఆచంట సునీత మండిపడ్డారు. మనోవికాస కేంద్రాలుగా ఉండాల్సిన అంగన్వాడీ సెంటర్లను సమస్యల వలయంలోకి నెట్టేశారని విమర్శించారు. చంద్రబాబు నాయుడు అంగన్వాడీ కార్యకర్తలను తన మానసిక పుత్రికలుగా భావించి వారి అభ్యున్నతికి నిరంతరం కృషి చేస్తున్నారని గుర్తుచేశారు. అంగన్వాడీ కేంద్రాల్లో తాగునీరు, మౌలిక సదుపాయాల కల్పనకు భారీగా నిధులు కేటాయించిన విషయాన్ని గుర్తు చేశారు. కూర్చోడానికి సరైన స్థలం, ఫ్యాన్లు, చాపలు కూడా లేని గత పరిస్థితిని మార్చి, కార్పొరేట్




పాఠశాలలకు దీటుగా నాణ్యమైన విద్య, పోషకాహారం అందించేలా సీఎం చంద్రబాబు, మంత్రి సంధ్యారాణి, నారా లోకేష్ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారన్నారు.

వైసీపీ హయాంలో పనిచేయని పాత ఫోన్లు ఇచ్చి యాప్‌ల పేరుతో తీవ్ర పనిభారం మోపారని, ఈరోజు కూటమి ప్రభుత్వం ప్రత్యేక బడ్జెట్ కేటాయించి రూ.76 కోట్లతో 58 వేలమందికిపైగా అంగన్వాడీలకు 5జీ స్మార్ట్ ఫోన్లు అందజేసిందని తెలిపారు. అంగన్వాడీల ప్రధాన డిమాండ్ అయిన గ్రాట్యుటీని అమలు చేసిన ఘనత కూటమి ప్రభుత్వానిదేనన్నారు. దేశంలో కేవలం గుజరాత్, కర్ణాటక రాష్ట్రాల్లో మాత్రమే ఉన్న గ్రాట్యుటీ విధానాన్ని, ఏటా రూ.20 కోట్ల అదనపు భారం పడుతున్నా భరించి ఏపీలో అమలు చేశామన్నారు. 5 వేలకుపైగా మినీ అంగన్వాడీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా ప్రమోట్ చేసి వేతనాలు పెంచామని, గతంలో నిలిచిపోయిన టీఏ, సంక్షేమ పథకాల లబ్ధిని ఇప్పుడు పునరుద్ధరించామని చెప్పారు.

గర్భిణులు, బాలింతలు, బడి ఈడు పిల్లల ఆరోగ్యం కోసం 'బాలసంజీవని' పథకం ద్వారా 7 లక్షలమందికి మేలు చేకూరుస్తున్నామని సునీత వెల్లడించారు. నాణ్యమైన విద్య కోసం ప్లే స్కూల్ బొమ్మలు, బోధనా చార్టులు సమకూర్చామన్నారు. గతంలో పాదయాత్రలో తెలంగాణకంటే రూ.1000 ఎక్కువ ఇస్తామని చెప్పి వైసీపీ ప్రభుత్వం మోసం చేసిందని దుయ్యబట్టారు. న్యాయమైన కోరికల కోసం 42 రోజులు రోడ్డెక్కి ధర్నా చేస్తే ఎస్మా చట్టం ప్రయోగించి, తాళాలు పగలగొట్టి, ముళ్లకంచెలు వేసి తీవ్ర ఇబ్బందులకు గురిచేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రూ.200గా ఉన్న అంగన్వాడీల జీతాన్ని దశలవారీగా రూ.11,500 వరకు పెంచిన చరిత్ర ఒక్క తెలుగుదేశం ప్రభుత్వానికే ఉందన్నారు. వైసీపీ నేతలు సచివాలయాల రంగులకు రూ.3,000 కోట్లు, బియ్యం సంచులపై ఫోటోలకు రూ.700 కోట్లు తగలేశారు తప్ప అంగన్వాడీలకు పైసా ఇవ్వలేదన్నారు.

అంగన్వాడీల ప్రయోజనాల కోసం కూటమి ప్రభుత్వం ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని ఆచంట సునీత స్పష్టం చేశారు. స్వార్థ రాజకీయాల కోసం రోడ్లపైకి రమ్మని పిలుపునిచ్చే వైసిపి నాయకుల మాయమాటలను అంగన్వాడీ అక్కచెల్లెమ్మలు ఎవ్వరూ నమ్మవద్దని కోరారు. ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తున్నామని, వేతన పెంపుతోపాటు పెండింగ్ బిల్లులన్నీ క్రమంగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. పిల్లల భవిష్యత్తు, తల్లీబిడ్డల ఆరోగ్యమే ధ్యేయంగా పనిచేస్తున్న చంద్రబాబు ప్రభుత్వానికి అంగన్వాడీలు పూర్తి అండగా నిలవాలని పిలుపునిచ్చారు.

# నేటి నుంచి ఈఏపీ సెట్ కౌన్సెలింగ్



- 31 వరకూ వెబ్ ఆప్షన్ల నమోదు
- కళాశాల ఎంపికలో అప్రత్తంగా ఉండాలి
- ప్రత్యేక కేటగిరి అభ్యర్థులకు విజయవాడలో కౌన్సెలింగ్

విజయనగరం(చైతన్యరథం): ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాలకు (ఈఏపీసెట్) సోమవారం నుంచి కౌన్సెలింగ్ ప్రారంభం కానుంది. 20 నుంచి 29వ తేదీలోగా ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకుని ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. 31 వరకు దరఖాస్తుల వెరిఫికేషన్ జరగనుంది. 25 నుంచి 31వ తేదీ వరకు ఆప్షన్లను ఎంపిక చేసుకుని నమోదు చేయాలి. ఆగస్టు 6న విద్యార్థులకు కళాశాలల్లో సీట్లు కేటాయిస్తారు. 7నుంచి 13 వరకు విద్యార్థులు తమకు సీటు వచ్చిన కళాశాలల్లో చేరాల్సి ఉంటుంది. కాగా ప్రత్యేక కేటగిరి విద్యార్థులకు విజయవాడ ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో మాన్యువల్ కౌన్సెలింగ్ జరుగుతుంది. పీడబ్ల్యూడీ, సీఏపీ, ఎన్‌సీసీ, స్కౌట్ అండ్ గైడ్స్, స్పోర్ట్స్ అండ్ గేమ్స్, ఆంగ్లో ఇండియన్ కేటగిరీలకు చెందిన విద్యార్థులు తమ ఒరిజినల్ విద్యార్హతలు, ఇతర అర్హతల సర్టిఫికెట్లతో ప్రత్యేక పరి శీలనకు హాజరుకావాలి. ఏ రోజు ఏ ర్యాంకు వరకు రావాలనేది తెలుసుకుని సర్టిఫికెట్ల పరిశీలనకు హాజరుకావాలని కన్వీనర్ ప్రకటించారు.

### ఈ జాగ్రత్తలు అవసరం

వెబ్ ఆప్షన్ల నమోదులో జాగ్రత్తగా వ్యవహరించాలి. నచ్చిన కోర్సులు, కళాశాలలను ముందుగానే ప్రాధాన్యతా క్రమంలో జాబితాను సిద్ధం చేసుకోవాలి. దాని ఆధారంగా ఆప్షన్లు నమోదు చేయాలి. విద్యార్థుల సౌకర్యార్థం విజయనగరం ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో హెల్ప్‌లైన్ సెంటర్‌ను ఏర్పాటు చేశారు. అనుమానాల నివృత్తికి జిల్లా హెల్ప్‌లైన్ సెంటర్‌లో నేరుగా సంప్రదించవచ్చు.

### కళాశాల ఎంపిక, కోడ్ అంశాల్లో జాగ్రత్త

పలు ఇంజనీరింగ్ కళాశాలల షార్ట్ ఫాంలు వేరే ఇతర కళాశాలల పేర్లవలే ఉన్నాయి. కోరుకున్న కళాశాలలకు కాకుండా మరోకళాశాలకు ఆప్షన్‌నమోదయ్యే ప్రమాదముంది.. ఇలాంటి వాటి విషయాల్లో జాగ్రత్తగా ఉండాలి. కోడ్‌ల ప్రకారం ఆప్షన్లు ఇచ్చుకోవాల్సి ఉంది.

### అప్‌లోడ్ చేయాల్సిన సర్టిఫికెట్లు

ఈఏపీసెట్ ర్యాంకు కార్డు, హాల్ టికెట్, టెన్త్, ఇంటర్ మార్కుల లిస్టు, ఆరో తరగతి నుంచి ఇంటర్ వరకు స్టడీ సర్టిఫికెట్లు, టీసీ, ఆదాయ ధ్రువీకరణ పత్రం, రిజర్వేషన్ ఆధారిత సర్టిఫికెట్, ఏడు సంవత్సరాల రెసిడెన్స్ సర్టిఫికెట్ ఉండాలి. జిల్లాలో 7 ఇంజనీరింగ్ కళాశాలల్లో సుమారు ఐదు వేలకు పైగా సీట్లు ఉన్నాయి. ఏపీఈఏపీ సెట్‌ను జిల్లాలో 24028 మంది విద్యార్థులు రాశారు.

## ప్రత్యేక అవసరాలున్న పిల్లలకు

# మరింత మెరుగైన సేవలందించాలి

### జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి కొలుసు పార్థసారథి

బాపట్ల (చైతన్య రథం): ప్రత్యేక అవసరాలున్న పిల్లలకు మరింతమెరుగైన జీవితాన్ని అందించడానికి అధికారులు సమన్వయంతో పని చేయాలని జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి,సమాచార పౌరసంబంధాల మంత్రి కొలుసు పార్థసారథి సూచించారు. సోమవారం మున్సిపల్ హైస్కూల్ ఆవరణలో ఉన్న భవిత కేంద్రాన్ని కలెక్టర్ వినోద్ కుమార్, ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మరాజు, అగ్నికుల క్షత్రియ సంక్షేమ చైర్మన్ సి.పాపారావు,బావుడా చైర్మన్ రాజశేఖర్‌బాబుతో కలసి పరిశీలించారు. మంత్రి మాట్లాడుతూ భవిత కేంద్రాల బలోపేతానికి చర్యలు, సమగ్ర విద్యతో ప్రతి చిన్నారికి విద్య బుద్ధులు అభివృద్ధే లక్ష్యంగా అధికారులు పని చేయాలన్నారు. ప్రతి చిన్నారికి సమాన విద్య అవకాశాలు కల్పించేయాలన్నదే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ముఖ్య ఉద్దేశమన్నారు. మానసికంగా, బుద్ధిమాంద్యం పిల్లల ప్రత్యేక అవసరాలున్న విద్యార్థుల భవిష్యత్తును మెరుగు పరిచేందుకు భవిత సహాయక కేంద్రాలు ఏర్పాటు చేసి, శిక్షణ పొందిన ఉపాధ్యాయులను నియమించడం జరిగిందని తెలిపారు. ప్రస్తుతం




17మంది విద్యార్థులు శిక్షణ పొందుతున్నారని తెలిపారు. భవిత కార్యక్రమంలోని 21 విభాగాలకు అనుగుణంగా సేవలు అందించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ మంత్రికి వివరించారు. భవిత కేంద్రంలోని శిక్షణ పొందుతున్న మానసిక బుద్ధి మద్యం పిల్లల తల్లులతో మంత్రి మాట్లాడుతూ ఇక్కడ మీ పిల్లలకు అవసరమైన ఏర్పాట్లను బాగున్నాయని గతంలో మీ పిల్లలను ఎక్కడ ఉంచేవారని, ఈ భవిత కేంద్రం ద్వారా మీ పిల్లలకు అన్ని సౌకర్యాలు అందుతున్నాయని మీ పిల్లలు భవిష్యత్తు ఎలా ఉండాలని, మీరు కోరుకుం టున్నారని, తల్లులను అడిగి మంత్రి తెలుసుకున్నారు. కొందరు తమ పిల్లలు మానసిక స్థితి నుండి మామూలు చితికి వచ్చేలా ఇక్కడ విద్యాబుద్ధులు నేర్పించడానికి చర్యలు తీసుకోవాలని, పిల్లలు వారిపనులు వారే చేసుకునే విధంగా శిక్షణ ఇవ్వాలని, పిల్లల భద్రత కూడా కల్పించాలని, ఈ భవిత కేంద్రం మా పిల్లలకు చాలా ఉపయోగారంగా ఉందని వారు మంత్రికి వివరించారు.

## పరిశ్రమలను తరిమేయడంలో

# జగన్‌రెడ్డి దేశంలోనే నెంబర్ వన్

- **ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ నివేదికకు.. పెట్టుబడుల అనుకూల నివేదికకు సాక్షికి తేడా తెలియదు**
- **పెట్టుబడుల ఆకర్షణలో దేశానికి ఆదర్శంగా ఏపీ ఎదిగింది**
- **ఫాస్ట్ మూవర్స్ కేటగిరీలో ఏపీ ఉండడం స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌కు నిదర్శనం**
- **టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి అప్పసాని రాజేష్**

అమరావతి (చైతన్య రథం): 'ఏపీలో పరిశ్రమల విధ్వంసానికి జగన్‌రెడ్డి బ్రాండ్ అంబాసిడర్' అని తెలుగుదేశం రాష్ట్ర అధికార ప్రతినిధి అప్పసాని రాజేష్ ధ్వజమెత్తారు. సోమవారం మంగళగిరి టీడీపీ కేంద్ర కార్యాలయంలో మీడియాతోమాట్లాడారు. 'పెట్టుబడుల అనుకూలతపై నీతి ఆయోగ్ విడుదల చేసిన ఇన్వెస్ట్ మెంట్ ఫ్రెండ్లీనెస్ ఇండెక్స్ నివేదికను వక్రీకరిస్తూ సాక్షి పత్రిక చేస్తున్న దుష్ప్రచారం ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నమని మండిపడ్డారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ సూచీకి, ఇన్వెస్ట్‌మెంట్ ఫ్రెండ్లీనెస్ ఇండెక్స్ నివేదికకు ఉన్న తేడా కూడా తెలియకుండా సాక్షి తప్పుడుకథనాలు ప్రచురిస్తోందని మండిపడ్డారు. ప్రభుత్వంపై విషప్రచారం చేయడమేతాడేపల్లి ప్యాలెస్, సాక్షి పత్రికల ఏకైక అజెండాగా మారిందని విమర్శించారు.

"సాక్షి కథనాలను చూస్తుంటే గతంలో ప్రముఖ దర్శకుడు విఠలాచార్యసినిమాల్లో కనిపించే"మాయలు, మరాఠీలు" గుర్తుకు వస్తున్నాయి. ప్రజలకు నిజాలు చెప్పాల్సిన పత్రిక, అసత్యాలను నిజాలుగా చూపించే ప్రయత్నంచేయడం దురదృష్టకరం. జగన్‌రెడ్డి కుటుం బానికి చెందిన పత్రికగా గత పదేళ్లుగా సాక్షి ప్రజా ప్రయోజనాల కోసం కాకుండా వైసీపీ రాజకీయ ప్రయోజనాల కోసమే పనిచేస్తోంది. ఇటీవల నీతి ఆయోగ్ విడుదల చేసిన ఇన్వెస్ట్‌మెంట్ ఫ్రెండ్లీనెస్ ఇండెక్స్-2025 నివేదికను,గతంలో కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ ర్యాంకింగ్స్‌తో పోల్చి ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేశారు.ఈరెండు పూర్తిగావేర్వేరు సూచీలు, వాటి ఉద్దేశాలు, మూల్యాంకన విధానాలు కూడా భిన్నమైనవి. ఒకటి పెట్టుబడులకు అనుకూల వాతా వరణాన్ని అంచనా వేస్తే, మరొకటి పరిపాలనా సంస్కరణల ఆధారంగా రూపొందే సూచిక. ఈ కనీస అవగాహన కూడా లేకుండా కథనాలు ప్రచురించడం సాక్షి అజ్ఞానానికి.. ఉద్దేశపూర్వక దుష్ప్రచారానికి నిదర్శనం అని దుయ్యబట్టారు.

### విధ్వంస పాలనకు నిదర్శనం గొడ్డలి పాలనా కాలం

"రాష్ట్రానికి పెట్టుబడులు వచ్చాయా లేదా, పరిశ్రమలు ఏర్పడ్డాయా లేదా, యువతకు ఉద్యోగాలు లభించాయా లేదా అన్నదే ప్రజలకు ముఖ్యం. కానీ సాక్షి మాత్రం కేవలం రాజకీయ దుష్ప్రచారం కోసమే ఇలాంటి కథనాలు ప్రచురిస్తోంది. జగన్‌రెడ్డి పాలనలో రాష్ట్రానికి కొత్త పరిశ్రమలు తీసుకురావడం పక్కన పెడితే, అప్పటికే ఉన్న పరిశ్రమలను తరిమికొట్టారు. ముఖ్యంగా అధికారంలోకి వచ్చిన వెంటనే విద్యుత్ కొనుగోలు ఒప్పందాలను ఏకపక్షంగా రద్దు చేయడం ద్వారా దేశ, విదేశీ పెట్టుబడిదారులకు ఆంధ్రప్రదేశ్‌పై తీవ్ర అపనమ్మకం కలిగించారు. ఈనిర్ణయంపై కేంద్ర ప్రభుత్వం కూడా పలుమార్లు అభ్యంతరం వ్యక్తం చేసింది. అలాంటి విధ్వంసకర నిర్ణయాల కారణం గానే రాష్ట్ర బ్రాండింగ్ దెబ్బతింది. పెట్టుబడిదారులు ఏపీవైపు రావడానికి వెనుకంజ వేశారు. రాజకీయ కక్ష సాధింపు కోసం కాలుష్య నియంత్రణ బోర్డు వంటి సంస్థలను ఉపయోగించి అనేక పరిశ్రమలపై ఒత్తిడి తెచ్చారు. నడుస్తున్న పరిశ్రమలను మూసివేసే పరిస్థితి కల్పించారు. జగన్‌రెడ్డి పాలనలో రాష్ట్రం నుంచి వెళ్లిపోయిన పరిశ్రమల జాబితా చాలా పెద్దది. పరిశ్రమలను తరిమేయడంలో ఆయన దేశంలోనే నంబర్-1గా నిలిచారు. జగన్‌రెడ్డి ఐదేళ్ల పాలనలో రాష్ట్రానికి ఎంతపెట్టుబడి వచ్చింది? ఎన్ని పరిశ్రమలు స్థాపించబడ్డాయి? ఎన్ని లక్షల మందికి ఉద్యోగాలు కల్పించారు? అనే అంశాలపై ఒక్కసారి కూడా ప్రజల కు లెక్క చెప్పలేదు. వైసీపీ అధికారిక వేదికలపైగానీ, సాక్షి పత్రికలోగానీ, జగన్ నిర్వహించిన ఏ మీడియా సమావేశంలోగానీ ఈ వివరాలు వెల్లడించలేదు" అని అప్పసాని ఆగ్రహం వ్యక్తం చేశారు.

### జగన్‌రెడ్డి ఎన్ని పెట్టుబడులు, ఉద్యోగాలు తెచ్చాడో లెక్కలు చెప్పగలరా?

"టీడీపీ ప్రభుత్వ హయాంలో పారిశ్రామికాభివృద్ధి, ఉద్యోగ కల్పన విషయంలో సాధించిన విజయాలకు అధికారిక రికార్డులే నిదర్శనం. వైసీపీ సభ్యులు గోవిందరెడ్డి, గోపాల్‌రెడ్డి శాసనమండలిలో అడిగిన ప్రశ్నలకు సమాధానంగా అప్పటి పరిశ్రమల మంత్రి మేకపాటి గౌతంరెడ్డి వెల్లడించిన వివరాల ప్రకారం 2014-19 మధ్య రాష్ట్రంలో 39,213 సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు, 237 భారీ, మధ్యతరహా పరిశ్రమలు కలిపి మొత్తం 39,450 పరిశ్రమలు గ్రౌండింగ్ అయ్యాయని తెలిపారు. వాటి ద్వారా 5,13,351 మందికి ఉపాధి అవకాశాలు కల్పించామని అధికారికంగా శాసనమండలి వేదికగా ప్రకటించారు. ఈ గణాంకాలు టీడీపీ ప్రభుత్వం సృష్టించినవి కాదు. జగన్‌రెడ్డి ప్రభుత్వంలో పరిశ్రమల మంత్రిగా ఉన్న మేకపాటి గౌతంరెడ్డి స్వయంగా సభా సాక్షిగా వెల్లడించిన అధికారిక సమాచారం. అలాంటి రికార్డులను సైతం ప్రజలనుంచి దాచిపెట్టి తప్పుడు ప్రచారం చేయడం సాక్షి నైజానికి నిదర్శనం. జగన్‌రెడ్డి తన ఐదేళ్ల పాలనలో ఎన్ని పరిశ్రమలు తీసుకొచ్చారు? ఎంత పెట్టుబడి ఆకర్షించారు? ఎన్ని లక్షలమందికి ప్రైవేట్ రంగంలో ఉద్యోగాలు కల్పించారు? అనే ప్రశ్నలకు ఇప్పటికీ సమాధానం చెప్పలేకపోతున్నారు. ప్రతి మీడియా సమావేశంలో గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగాలు, వాలంటీర్ వ్యవస్థ గురించే మాట్లాడారు. ప్రైవేట్ రంగంలో సృష్టించిన ఉపాధి అవకాశాల గురించి చెప్పేందుకు ఒక్క గణాంకం కూడా లేదు" అని ఎద్దేవా చేశారు.



పెట్టుబడుల ఆకర్షణలో దేశంలోనే నెం.1

"ఎన్డీయే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పరిస్థితి పూర్తిగా మారింది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్రానికి పెట్టుబడులను ఆకర్షించేందుకు దూకుడుగా చర్యలు ప్రారంభమయ్యాయి. విశాఖలో నిర్వహించిన పెట్టుబడిదారుల సదస్సుతో ప్రారంభమైన ఈ ప్రక్రియ అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఐటీ మంత్రి నారా లోకేష్, పరిశ్రమల మంత్రి టీజీ భరత్ తదితరులు దేశ, విదేశాల్లో విస్తృతంగా పర్యటించి ప్రపంచస్థాయి కంపెనీలతో సమావేశాలు నిర్వహించారు. ఈ కృషి ఫలితంగానే దేశవ్యాప్తంగా ప్రకటించిన మొత్తం పెట్టుబడి ప్రతిపాదనల్లో 25.3 శాతం వాటాను ఏపీ దక్కించుకుంది. ఇది రాష్ట్రంపై పెట్టుబడిదారుల్లో ఏర్పడిన విశ్వాసానికి నిదర్శనం. రాష్ట్రంలో పెట్టుబడులు కేవలం ఒప్పందాలకే పరిమితం కాకుండా వేగంగా గ్రౌండింగ్ అయ్యేలా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. ఇప్పటివరకు నిర్వహించిన 19 రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక మండలి సమావేశాల్లో సుమారు రూ.12 లక్షల కోట్ల పెట్టుబడి ప్రతిపాదనలకు ఆమోదం తెలిపింది. ఈ ప్రతిపాదన లను ఆమోదించిన వెంటనే అవసరమైన మంత్రివర్గ అనుమతులు, భూకేటాయింపులు, విద్యుత్, నీరు, రోడ్డు అనుసంధానం, ఇతర మౌలిక సదుపాయాలను యుద్ధ ప్రాతిపదికన కల్పిస్తూ పరిశ్రమలు వేగంగా గ్రౌండింగ్ అయ్యేలా ప్రభుత్వం పనిచేస్తోంది. గత ప్రభుత్వాల మాదిరిగా ఫైళ్లను నెలల తరబడి పెండింగ్‌లో పెట్టే పరిస్థితి ఇప్పుడు లేదు. పెట్టుబడిదారులకు ఒకే వేదికపై అన్ని అనుమతులు, అవసరమైన ప్రభుత్వ సహకారం అందిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌ను దాటి 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌కు కొత్త నిర్వచనం ఇస్తోంది. ఇదే కారణంగా ఇతర రాష్ట్రాలు కూడా ఆంధ్రప్రదేశ్ అమలు చేస్తున్న విధానాలను అధ్యయనం చేస్తున్నాయి" అని అప్పసాని పేర్కొన్నారు.

### ఫాస్ట్ మూవర్స్ క్యాటగిరీలో ఏపీ ఉండడం స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌కు నిదర్శనం

"నీతి ఆయోగ్ విడుదల చేసిన ఐఎఫ్ఐలో రాష్ట్రాలను అచీవర్స్, ఫాస్ట్‌మూవర్స్, ఆస్పిరర్స్ అనే మూడు విభాగాలుగా వర్గీకరించారు. ఇప్పటికే పరిశ్రమల పరంగా ముందంజలో ఉన్న రాష్ట్రాలు అచీవర్స్ విభాగంలో ఉండగా, వేగంగా పెట్టుబడులను ఆకర్షిస్తూ సంస్కరణలను అమలు చేస్తున్న రాష్ట్రాలను ఫాస్ట్ మూవర్స్‌గా గుర్తించారు. ఆంధ్రప్రదేశ్ ఈ ఫాస్ట్ మూవర్స్ విభాగంలో చోటు దక్కించుకోవడం రాష్ట్రం వేగంగా పారిశ్రామిక అభివృద్ధి దిశగా పయనిస్తోందనడానికి నిదర్శనం. ఈ నివేదికను ఉద్దేశపూర్వకంగా వక్రీకరిస్తూ, గతంలో విడుదలైన ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ ర్యాంకింగ్‌తో పోల్చి ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం సాక్షి పత్రిక చేసింది. రెండు వేర్వేరు నివేదికలను కలిపి ప్రభుత్వంపై బురదజల్లడమే లక్ష్యంగా పెట్టుకోవడం అత్యంత దురదృష్టకరం. రాష్ట్ర యువతకు ఎన్నికల సమయంలో ఇచ్చిన 20 లక్షల ఉద్యోగాల కల్పన హామీని దశలవారీగా అమలు చేస్తున్నాం. ఇప్పటికే ప్రభుత్వ నియామక ప్రక్రియలు వేగవంతం అయ్యాయి. ఉపాధ్యాయ నియామకాలు పూర్తి చేశాం. వర్శిటీల్లో ఖాళీల భర్తీ ప్రక్రియ కొనసాగుతోంది. మరోవైపు ప్రైవేట్ రంగంలో లక్షలాది ఉద్యోగావకాశాలు కల్పించే దిశగా పెట్టుబడుల గ్రౌండింగ్ ప్రక్రియ వేగంగా కొనసాగుతోంది" అని అప్పసాని వివరించారు.

### దుష్ప్రచారాలు చేసినా అభివృద్ధిని అడ్డుకోలేవు జగన్

"జగన్‌రెడ్డి ప్రభుత్వం ఐదేళ్లపాటు రాష్ట్ర పారిశ్రామిక రంగాన్ని పూర్తిగా నిర్వీర్యం చేసింది. ఎన్డీయే ప్రభుత్వం కేవలం 25 నెలల్లోనే రాష్ట్రంపై పెట్టుబడిదారుల్లో తిరిగి విశ్వాసాన్ని నెలకొల్పగలిగింది. ప్రస్తుతం వివిధ సంస్థలతో పెట్టుబడి ఒప్పందాలు, భూ కేటాయింపులు, నిర్మాణ పనులు, ఉత్పత్తి ప్రారంభం వరకు ప్రతి దశను ప్రభుత్వం నిరంతరం పర్యవేక్షిస్తూ వేగవంతం చేస్తోంది. రాష్ట్రానికి వచ్చిన పెట్టుబడి ప్రతిపాదనల్లో ఇప్పటికే గణనీయమైన శాతం గ్రౌండింగ్ దశలోకి ప్రవేశించాయి. మిగిలిన ప్రతిపాదనలను కూడా త్వరితగతిన కార్యరూపంలోకి తీసుకురావడానికి అధికారులు, మంత్రులు, ప్రభుత్వం సమన్వయంతో పనిచేస్తున్నారు. పెట్టుబడిదారులు ఎదుర్కొనే ప్రతి సమస్యను తక్షణమే పరిష్కరిస్తూ పరిశ్రమల స్థాపనకు ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తోంది. వైసీపీ పాలనలో యువతకు ఉపాధి అవకాశాలు కల్పించకుండా కేవలం ప్రచారానికే పరిమితమైన జగన్‌రెడ్డి, ఇప్పుడు రాష్ట్రంలో జరుగుతున్న పారిశ్రామిక పురోగతిని చూసి జీర్ణించుకోలేక సాక్షి పత్రిక ద్వారా అసత్య ప్రచారానికి పాల్పడుతున్నారు. వాస్తవాలను వక్రీకరించి ప్రజల్లో గందరగోళం సృష్టించడం ద్వారా రాజకీయ లబ్ధి పొందాలని చూస్తున్నారు. ప్రజలను మోసం చేయడానికి రెండు వేర్వేరు నివేదికలను కలిపి ఒకే నివేదికగా చూపించడం బాధ్యతాయుతమైన మీడియా చేసే పని కాదు. జగన్ రెడ్డికి నిజంగా ధైర్యం ఉంటే తన పాలనలో రాష్ట్రానికి వచ్చిన పెట్టుబడులు, గ్రౌండింగ్ అయిన పరిశ్రమలు, ప్రైవేట్ రంగంలో కల్పించిన ఉద్యోగాలపై శ్వేతపత్రం విడుదల చేయాలి. వైసీపీ ప్రభుత్వం కారణంగా రాష్ట్రాన్ని వీడిన పరిశ్రమలపై కూడా ప్రజలకు సమాధానం చెప్పాలి. అసత్య ప్రచారాలతో అభివృద్ధిని అడ్డుకునే ప్రయత్నాలు ఎంత చేసినా, ప్రజలు వాస్తవాలను గమనిస్తున్నారు. రాష్ట్ర అభివృద్ధి ప్రయాణాన్ని ఎవరూ అడ్డుకోలేరు" అని అప్పసాని రాజేష్ స్పష్టం చేశారు.

# సంక్షోభం నుంచి సంపద వైపు

- ముఖ్యమంత్రి చంద్రబాబు దూరదృష్టితో ఆక్వా రంగానికి పూర్వవైభవం
- సాంకేతిక పరిజ్ఞానం, వినూత్న పద్ధతుల్లో రాష్ట్రంలో నాలుగు లక్షల ఎకరాల్లో ఆక్వా సాగు
- చారిత్రాత్మక సబ్సిడీలతో రైతులకు అండగా కూటమి ప్రభుత్వం




**కరెంట్ అనాలిసిస్** — తెలుసుకుందాం | విశ్లేషిద్దాం | సిద్ధమవుదాం

**బి. నిర్మలాజ్యోతి, అనలిస్ట్, టీడీపీ నాలెడ్జ్ సెంటర్**

ఆంధ్రప్రదేశ్ ఆర్థిక ప్రగతికి, గ్రామీణ ఉపాధికి పట్టుకొమ్మ లాంటి ఆక్వా రంగానికి పూర్వవైభవం తీసుకువచ్చేలా ప్రస్తుత కూటమి ప్రభుత్వం రికార్డు స్థాయి అభివృద్ధి, సంస్కరణలతో దూసుకుపోతోంది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు దూరదృష్టి, పటిష్టమైన చర్యలతో రాష్ట్రంలో ఆక్వా సాగు సరికొత్త ఊపందుకుంది. గత ఐదేళ్ల వైసీపీ అరాచక పాలనలో కుదేలైన ఈ రంగాన్ని గట్టెక్కించి రైతుల్లో భరోసా నింపడమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం విప్లవాత్మక నిర్ణయాలతో ప్రగతి బాటలు వేస్తోంది.

### మాట నిలబెట్టుకున్న చంద్రబాబు- వివక్ష లేని విద్యుత్ సబ్సిడీ

ఎన్నికల ముందు ఆక్వా రైతులకు ఇచ్చిన ప్రతి హామీనీ నిలబెట్టుకుంటూ కూటమి ప్రభుత్వం చారిత్రాత్మక నిర్ణయాలతో ఆక్వా రంగాన్ని లాభాల బాట పట్టిస్తోంది. గత ప్రభుత్వ హయాంలో ఉన్న ఆక్వా, నాన్ ఆక్వా జోన్ల వివక్షను పూర్తిగా తొలగిస్తూ రాష్ట్రంలో ఆక్వా రంగాన్ని ఒకే పరిధిలోకి తెచ్చింది. ఎలాంటి అడ్డగోలు నిబంధనలు లేకుండా రిజిస్ట్రేషన్ చేసుకున్న ఆక్వా రైతులందరికీ యూనిట్ విద్యుత్‌ను రూ.1.50కే అందించేలా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంది. దీంతో దాదాపు 2లక్షల మంది రైతులకు పెట్టుబడి ఖర్చు భారీగా తగ్గుతుంది. ప్రభుత్వంపై ఏడాదికి రూ.1,100కోట్ల ఆర్థిక భారం పడుతున్న ప్పటికీ రైతుల సంక్షేమమే ధ్యేయంగా అడుగులు వేసింది. అదనంగా ఉన్న 12వేల కనెక్షన్లకు కూడా ఈ రూ.1.50 రాయితీ వర్తింపజేస్తున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన ఈకొద్ది కాలంలోనే ఆక్వా రంగానికి ఏకంగా రూ.1,543 కోట్ల మేర విద్యుత్ రాయితీ ఇచ్చి అండగా నిలిచింది.




### రైతులకు కొండంత అండగా నిలిచిన దాణా ధరల తగ్గింపు నిర్ణయం

రైతులకు మరో పెద్ద ఉపశమనం కలిగిస్తూ రొయ్యల దాణా ధరల సమస్యపై సీఎం చంద్రబాబు నేరుగా రంగంలోకి దిగి ప్రస్తుత ధరపై కిలోకు రూ.4 తగ్గించేలా చారిత్రాత్మక నిర్ణయం తీసుకున్నారు. దీనివల్ల దాణా ధర కిలో రూ.112 నుంచి రూ. 108కి తగ్గింది. దాణా ధరల స్థిరీకరణ కోసం ఆక్వా రైతులు, తయారీదారులు, నిపుణులతో సీఎం ఒక ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేశారు. ఆక్వా రైతులపై ఎలాంటి మార్కెట్ సెస్ ఉండబోదని కూటమి ప్రభుత్వం స్పష్టం చేసింది. రైతులకు నాణ్యమైన నిరంతర విద్యుత్ అందించేందుకు గ్రామాల్లో కొత్త సబ్ స్టేషన్లు నిర్మిస్తున్నారు. కైకలూరు మండలం గోపవరంలో రూ.32 కోట్లతో నిర్మిస్తున్న 220/33 కేవీ సబ్ స్టేషన్ పనులు మరో నెలలో పూర్తి కానున్నాయి. ప్రస్తుతం రాష్ట్రంలో దాదాపు 4 లక్షల ఎకరాల్లో ఆక్వా సాగు జరుగుతుండగా సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించడం, వినూత్న పద్ధతులను అవలంబించడం ద్వారా ఆక్వా సాగును ఒక మిలియన్ ఎకరాలకు విస్తరించాలనేదే ప్రభుత్వ లక్ష్యంగా పెట్టుకుని శరవేగంగా అభివృద్ధి సాధిస్తోంది.

### బూటకపు మాటలతో ఆక్వా రంగాన్ని ముంచేసిన జగన్ రెడ్డి

గత ఐదేళ్ల వైసీపీ పాలన ఆక్వా రైతుల పాలిట శాపంగా మారింది. ఎన్నికల ముందు రొయ్యల చెరువుల దగ్గరకు వెళ్లి ఆక్వా రంగాన్ని ఆదుకుంటామని గొప్పలు చెప్పిన జగన్ రెడ్డి.. అధికారంలోకి వచ్చాక ఆక్వా రైతుల గోడును పూర్తిగా విస్మరించారు. గత ఎన్నికల ముందు ఆక్వా రైతులకు రూ.1.50 కే విద్యుత్ ఇస్తామని చెప్పిన జగన్ రెడ్డి అధికారంలోకి వచ్చాక మాట తప్పారు. అడ్డగోలు నిబంధనలు పెట్టి ఆక్వా జోన్లను ఐదు, పది ఎకరాలకే పరిమితం చేస్తామంటూ రైతులను తీవ్ర వేధింపులకు గురిచేశారు. ఆక్వా, నాన్ ఆక్వా జోన్లుగా విడదీసి 70 శాతం మంది రైతులకు సబ్సిడీ ఎగ్గొట్టారు. నాన్-ఆక్వా జోన్ పరిధిలోని రైతుల నుంచి యూనిట్‌కు రూ.3.85 వసూలు చేయడంతో రూ.30వేలు వచ్చే కరెంట్ బిల్లులు రూ.80 వేలకు పైగా పెరిగి రైతుల నడ్డివిరిచారు. చివరకు విద్యుత్ సబ్సిడీల రూపంలో డిస్కంలకు రూ.1,990 కోట్ల బాకీలు పెట్టి వాటిని దివాలా తీయించారు.

### ఆక్వా ఫీడ్, సీడ్ రంగాల్లో 'జే-ట్యాక్స్' అరాచక దోపిడీ

రొయ్యల మేత (ఫీడ్), పిల్లల (సీడ్) ధరలను అదుపు చేయడంలో జగన్ ప్రభుత్వం ఘోరంగా విఫలమైంది. వైసీపీ నేతల సిండికేట్ దోపిడీకి అడ్డుఅదుపు లేకుండా చేశారు. దాణా ధరలను కంపెనీలు ఆరుసార్లు పెంచినప్పటికీ నాటి ప్రభుత్వం ధరల నియంత్రణపై ఎలాంటి చొరవ తీసుకోలేదు. 2019లో కిలో దాణా ధర రూ.87.80ఉంటే... జగన్‌రెడ్డి దిగిపోయే నాటికి దాన్ని రూ.100 దాటించి (సెప్టెంబరు 2022 నాటికి కిలో రూ.110.60కి పెంచేసి) టన్నుకు రూ.20,200 అదనపు భారం మోపారు. రొయ్యల సాగులో 55% నుంచి 65% ఖర్చు కేవలం మేత కోసమే అవుతుందని తెలిసి కూడా పట్టించుకో లేదు. సీడ్, ఫీడ్, ప్రాసెసింగ్ పరిశ్రమల ద్వారా రూ.5వేల కోట్ల 'జే-ట్యాక్స్' వసూలు చేసి ఆక్వా పరిశ్రమను సంక్షోభంలోకి నెట్టారు. ఆక్వా రైతులను తికమక పెట్టే మూడు జీవోలను తీసుకువచ్చి 70 శాతం మేర రైతులకు మొండిచెయ్యి చూపించాడు జగన్ రెడ్డి.

### అడ్డగోలు పన్నుల బాదుడు-రైతులపై మోయలేని భారం

జగన్ రెడ్డి హయాంలో అడ్డగోలు పన్నులు వేసి ఆక్వా రైతుపై ఎకరానికి రూ.1.50లక్షల నుంచి రూ.1.80లక్షల వరకు అదనపు భారం మోపారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో ఉచితంగా ఇచ్చిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను వైసీపీ ప్రభుత్వం ఎత్తివేసింది. గతంలో రూ.64వేలు ఉన్న 25కేవీ ట్రాన్స్‌ఫార్మర్ ధరను రూ. 3.24 లక్షలకు, రూ.3.56 లక్షలు ఉన్న 100 కేవీ ట్రాన్స్‌ఫార్మర్ ధరను రూ.8.30 లక్షలకు పెంచారు. నీటి పన్నును వెయ్యి లీటర్లకు రూ.12 నుంచి ఏకంగా రూ.120కి (10రెట్లు) పెంచారు. మార్కెట్ కమిటీ సెస్ పేరుతో 0.25% ఉన్న పన్నును 1%కి పెంచి ఎకరానికి రూ.13,500 అదనపు భారం మోపారు. టీడీపీ హయాంలో 24 గంటలూ నాణ్యమైన విద్యుత్ అందించగా వైసీపీ పాలనలో ఘోరమైన విద్యుత్ కోతలు విధించారు. దీనివల్ల ఆక్వా రైతులు జనరేటర్ల కోసం ఎకరానికి రూ.70వేల వరకు డీజిల్ ఖర్చు చేయాల్సి వచ్చింది.

### రైతుల క్రాప్ హాలిడే కష్టాలు- వైసీపీ నైతిక వైఫల్యం

కొవిడ్ సంక్షోభ సమయంలో ఎగుమతులు దెబ్బతిని ఆక్వా రైతులు అల్లాడిపోతున్నా నాటి వైసీపీ ప్రభుత్వం ప్రత్యామ్నాయ మార్కెట్లు చూపించ లేదు. అమెరికా విధిస్తున్న 26% దిగుమతి సుంకాల వల్ల దేశ ఆక్వా రంగం విలవిల్లాడుతుంటే ఎగుమతులు నిలిచిపోయి గోదాములు నిండి పోతుంటే నాటి జగన్‌రెడ్డి ప్రభుత్వం కనీసం స్పందించలేదు. సరికదా కేంద్రానికి లేఖ కూడా రాయలేదు. రొయ్యల ధరలు విపరీతంగా పడి పోయినా పట్టించుకోలేదు. 100కౌంట్ రొయ్యలకు మొదట రూ.240 మద్దతు ధర ప్రకటించి ఆ తర్వాత కనీస నైతిక బాధ్యత లేకుండా దాన్ని రూ.210కి తగ్గించి దారుణంగా మోసం చేశారు. మేతల ధరలుపెరగడం,నాణ్యమైన సీడ్ దొరకక పోవడం, వైరస్ వ్యాధుల తీవ్రత పెరిగినా కనీస పరిశోధనలు లేవు. ఎలాంటి ఆర్థిక ఉపశమనం అందించకపోవడంతో విసిగిపోయిన రైతులు ఏకంగా 'క్రాప్ హాలిడే' ప్రకటించే దారుణ స్థితికి నెట్టబడ్డారు. అప్పులపాలై ఆక్వా రైతులు ఆత్మహత్య లు చేసుకుంటున్నా గత ప్రభుత్వం ఆదుకోక పోవడంతో రైతులు చెరువులను వదిలేశారు.

### ఆక్వా రంగానికి పూర్వవైభవం తథ్యం

జగన్ రెడ్డి పాలనలో ఆక్వా రంగం ఎదుర్కొన్న విధ్వంసం నుంచి బయటపడి నేడు కూటమి ప్రభుత్వ హయాంలో మళ్లీ వెలుగులు చూస్తోంది. రైతులకు ఇచ్చిన ప్రతి హామీనీ నెరవేరుస్తూ చంద్రబాబు నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్ ఆక్వా రంగం ప్రపంచ స్థాయిలో దూసుకుపోవడానికి సిద్ధమవుతోంది. ఆక్వా రంగాన్ని అప్పులపాల్జేసిన జగన్ రెడ్డికి ఈ రంగం గురించి మాట్లాడే కనీస నైతిక హక్కు లేదని రైతులు స్పష్టం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వమే ఆక్వా రైతుల నిజమైన నేస్తం.



## గిరిజనుల జీవితాలకు...

# కొండంత అండ

### కూటమి ప్రభుత్వ పథకాలతో మారిన మన్యం రూపురేఖలు




**రెండేళ్లు... ఒక ప్రభుత్వాన్ని అంచనా వేయడానికి చాలా పెద్ద కాలం కాకపోవచ్చు. కానీ ఆ రెండేళ్లలో దిశ మారితే, వ్యవస్థ మారితే, ప్రజల్లో నమ్మకం పెరిగితే... అదే నిజమైన పాలనకు గుర్తు. నేడు ఆంధ్రప్రదేశ్‌లోని గిరిజన ప్రాంతాలను చూస్తే అలాంటి మార్పే కనిపిస్తోంది. ఒకప్పుడు అభివృద్ధికి దూరంగా ఉన్న గిరిజన గ్రామాలు ఇప్పుడు విద్య, ఆరోగ్యం, ఉపాధి, మౌలిక సదుపాయాలు, హక్కుల పరిరక్షణ... ఇలా ప్రతి రంగంలోనూ ముందడుగు వేస్తున్నాయి.**

**గిరిజనుడు కేవలం సంక్షేమ పథకాల లబ్ధిదారుడిగా కాకుండా అభివృద్ధిలో భాగస్వామిగా ఎదగాలన్న ఆలోచనతో ప్రభుత్వం అడుగులు వేస్తోంది. అదే ఈ రెండేళ్లలో కనిపించిన అతి పెద్ద మార్పు.**

#### విద్యకు పెద్దపీట... భవిష్యత్తుకు బలమైన పునాది

గిరిజన పిల్లల భవిష్యత్తు చదువులోనే ఉందన్న నమ్మకంతో రాష్ట్రవ్యాప్తంగా 371 ఆశ్రమ పాఠశాలలు, 17 ప్రీ-మెట్రిక్ హాస్టళ్లు, 170 పోస్ట్-మెట్రిక్ హాస్టళ్లు, 1,958 ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల ద్వారా 1,61,082 మంది విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతోంది. మొత్తం రూ.4,671.61 కోట్ల బడ్జెట్‌లో రూ.1,368.06 కోట్లను గిరిజన విద్య కోసం కేటాయించడం విద్యపై ప్రభుత్వ చిత్తశుద్ధిని చూపుతోంది. విద్యార్థులకు స్టీల్ ప్లేట్లు, గ్లాసులు, స్టేషనరీ, పడక సామగ్రి, లక్షకు పైగా నోట్‌బుక్స్ అందించడం ద్వారా హాస్టళ్లలో మెరుగైన వసతులు కల్పించారు.

#### మాతృ భాషలోనే విద్య... కొత్త ఆత్మవిశ్వాసం

సవారా, కువి, కొండ, ఆదివాసీ ఒరియా, కోయ, సుగాలి వంటి గిరిజన భాషల్లో 1,127 పాఠశాలల్లో మల్టీ లింగ్వల్ విద్యను ప్రవేశపెట్టడం ఒక చారిత్రక నిర్ణయం. పిల్లలు తమ భాషలోనే చదువుకోవడం వల్ల చదువుపై ఆసక్తి, అవగాహన రెండూ పెరిగాయి.

#### ఉపాధ్యాయుల నియామకాలు... విద్యకు కొత్త ఊపు

1,260 మంది కాంట్రాక్ట్ రెసిడెన్షియల్ టీచర్ల సేవలను కొనసాగించారు. మెగా డీఎస్సీ ద్వారా గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో 850 ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేశారు. 63 మంది బోధనా, బోధనేతర సిబ్బందికి ఉద్యోగోన్నతి కల్పించారు. 1,789 క్లీనింగ్, శానిటేషన్, వంట సేవలను అవుట్ సోర్సింగ్ ద్వారా అందుబాటులోకి తీసుకువచ్చి విద్యార్థులకు పరిశుభ్రమైన వాతావరణాన్ని కల్పించారు.

#### బెస్ట్ అవైలబుల్ స్కూల్ పథకానికి మళ్లీ జీవం

గతంలో నిలిచిపోయిన బెస్ట్ అవైలబుల్ స్కూల్ పథకాన్ని పునరుద్ధరించి 2019-23 మధ్య బకాయిగా ఉన్న రూ.22.95 కోట్లను చెల్లించడం ద్వారా వేలాది గిరిజన విద్యార్థులకు మళ్లీ అవకాశాలు కల్పించారు.

#### ఉన్నత విద్యకు కొత్త అవకాశాలు

విశాఖపట్నం, విజయవాడ-గుంటూరు, తిరుపతిలో ఎస్టీ స్టడీ సర్కిళ్లకు రూ.4.22 కోట్లతో అనుమతులు ఇచ్చి 300 మంది విద్యార్థులకు సివిల్స్, గ్రూప్స్ వంటి పోటీ పరీక్షలకు శిక్షణ ఇస్తున్నారు. 1,15,909 మంది విద్యార్థులకు రూ.192.32 కోట్లతో పోస్ట్‌మెట్రిక్ స్కాలర్‌షిప్స్ అందించారు.

#### 'ముస్తాబు'... పరిశుభ్రతకు కొత్త సంస్కృతి

వ్యక్తిగత పరిశుభ్రత, ఆరోగ్యంపై అవగాహన పెంచేందుకు 'ముస్తాబు' కార్యక్రమాన్ని ప్రారంభించడం ద్వారా విద్యార్థుల్లో మంచి అలవాట్లను పెంపొందిస్తున్నారు.



#### ఆరోగ్య రక్షణకు పెద్ద అడుగులు

35 బర్త్ వెయిటింగ్ హోమ్స్ కోసం రూ.14.29 కోట్లు ఖర్చు చేసి గిరిజన గర్భిణులకు మెరుగైన సేవలు అందిస్తున్నారు. 2047 నాటికి సికిల్ సెల్ అనీమియాను నిర్మూలించాలనే లక్ష్యంతో ఇప్పటికే 14,95,185 మంది గిరిజనులకు స్క్రీనింగ్ నిర్వహించడం దేశంలోనే ఒక పెద్ద కార్యక్రమంగా నిలిచింది.

#### పెండింగ్ నిధుల విడుదల... కేంద్ర పథకాల వేగవంతమైన అమలు

2018-19 నుంచి పెండింగ్‌లో ఉన్న కేంద్ర నిధుల్లో రూ.206.93 కోట్లను విడుదల చేయించారు. ఆర్టికల్ 275(1) కింద రూ.71.21 కోట్లతో 53 పనులు పూర్తయ్యాయి. 98 గిరిజన ఆవాసాలకు రూ.118.71 కోట్లతో రోడ్డు సౌకర్యాల పనులు వేగంగా కొనసాగుతున్నాయి.

#### గిరిజన మహిళలకు ఆర్థిక బలం

SERPతో కలిసి 'ఉన్నతి' పథకం కింద 56 జీవనోపాధి కార్యక్రమాలు అమలు చేస్తున్నారు.



రూ.40.30 కోట్ల వ్యయంతో 4,030 మంది గిరిజన మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నారు.

#### PM JANMAN... అత్యంత వెనుకబడిన గిరిజన కుటుంబాలకు అండ

పీవీటీజీ కుటుంబాల అభివృద్ధి కోసం పక్కా ఇళ్లు, రహదారులు, తాగునీరు, విద్యుత్, మొబైల్ టవర్లు, హాస్టళ్లు, అంగన్‌వాడీలు, సోలార్ విద్యుత్, మొబైల్ మెడికల్ యూనిట్లు, మల్టీపర్పస్ సెంటర్లు, వందన వికాస కేంద్రాలు వంటి సమగ్ర అభివృద్ధి కార్యక్రమాలు అమలవుతున్నాయి. 8,250 పక్కా ఇళ్లు, 25,168 ఇళ్లకు విద్యుత్, 2,146 తాగునీటి కనెక్షన్లు, 1,353 మొబైల్ టవర్లు, 4,152 నివాస ప్రాంతాలకు మొబైల్ మెడికల్ సేవలు, 125 మల్టీపర్పస్ సెంటర్లు, 73 వందన వికాస కేంద్రాలు ఈ మిషన్‌లో భాగంగా ముందుకు సాగుతున్నాయి.

#### ధర్తి ఆబా జనజాతియా గ్రామ ఉత్కర్ష్ అభియాన్

18 జిల్లాల్లోని 878 గిరిజన గ్రామాల సమగ్ర అభివృద్ధికి ఈ పథకం అమలవుతోంది. పక్కా ఇళ్లు, రహదారులు, జలజీవన్ మిషన్, విద్యుదీకరణ, మొబైల్ వైద్యం, అంగన్‌వాడీలు, హాస్టళ్లు, స్కిల్ ఇండియా, హోమ్‌స్టేలు, మార్కెటింగ్ కేంద్రాలు, వ్యవసాయం, పశుసంవర్ధక, చేపల పెంపకం, డిజిటల్ సేవలు, గిరిజన మార్కెట్లు, ఆశ్రమ పాఠశాలల అప్‌గ్రేడేషన్, సికిల్ సెల్ సెంటర్ వంటి 25 కీలక అంశాల్లో పనులు కొనసాగుతున్నాయి. రూ.20.47 కోట్ల కేటాయింపునకు బదులుగా సమర్థవంతమైన అనుసరణతో రూ.169.48 కోట్ల నిధులను రాష్ట్రం సాధించడం విశేషం.

#### ఎస్టీ కాంపోనెంట్ నిధుల సమర్థ వినియోగం

2025-26లో రూ.8,159.68 కోట్లలో ఇప్పటికే రూ.5,318.76 కోట్లు ఖర్చు చేశారు. 2026-27కు రూ.9,189.64 కోట్ల కేటాయింపు గిరిజన అభివృద్ధికి మరింత ఊతమివ్వనుంది.

#### అడవి హక్కులకు గౌరవం

RoFR భూ రికార్డులను పూర్తిగా డిజిటలైజ్ చేశారు. 1.14 లక్షల మంది RoFR రైతులకు PM-KISAN-అన్నదాత సుఖీభవ లబ్ధి అందింది. ISB-BIPPతో భాగస్వామ్యం ద్వారా అటవీ ఉత్పత్తులకు విలువ జోడించి గిరిజన మహిళలకు ఆదాయ అవకాశాలు పెంచుతున్నారు.

#### వ్యవసాయానికి ప్రోత్సాహం

1,20,782 ఎకరాల్లో వ్యవసాయం, 2,86,155 ఎకరాల్లో కాఫీ, మిరియాలు, ఉద్యాన పంటలు సాగవుతున్నాయి. 40వేల ఎకరాల్లో తోటల అభివృద్ధి కొనసాగుతుండగా... సాగుకు అనుకూలం కాని భూముల్లో గ్రీన్ కవర్ అభివృద్ధికి చర్యలు చేపట్టారు.

#### 'పీసా' గ్రామ సభలకు పునరుజ్జీవం

2019 నుంచి పెండింగులో ఉన్న 2,038 'పీసా' గ్రామ సభల ఎన్నికల్లో ఇప్పటికే 1,954 పూర్తి చేయడం ద్వారా గ్రామ స్వయంపాలనకు బలం చేకూరింది.

**గిరిజన భూముల రక్షణ:** 108 LTR కేసుల్లో 83 కేసులను పరిష్కరించి 229 ఎకరాల భూమిని రక్షించారు. అల్లూరి సీతారామరాజు జిల్లాలో 2,623 ఎకరాల భూమికి సంబంధించిన 307 ఆదేశాలను అమలు చేశారు. 30,556 LTR కేసుల్లో 17,222 కేసుల సమాచారాన్ని వెబ్ పోర్టల్‌లో అందుబాటులోకి తెచ్చారు.

#### ట్రైబల్ అడ్వైజరీ కౌన్సిల్ పునర్వ్యవస్థీకరణ

గిరిజన సమస్యలపై సమగ్ర నిర్ణయాల కోసం ట్రైబల్ అడ్వైజరీ కౌన్సిల్‌ను పునర్వ్యవస్థీకరించి సమావేశాలు నిర్వహించారు.

**ఆది కర్మయోగి అభియాన్:** 338 మంది అధికారులు, 20వేల మందికి పైగా గ్రామస్థాయి సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. 2,314 గ్రామసభలు నిర్వహించి రూ.11,480 కోట్ల విలువైన సమగ్ర గ్రామ అభివృద్ధి ప్రణాళికలను సిద్ధం చేశారు.

### రెండేళ్లలో కనిపించిన అసలు మార్పు

గిరిజన ప్రాంతాల్లో ఇప్పుడు అభివృద్ధి అనేది కేవలం ప్రకటనల్లో కాదు గ్రామాల్లో కనిపిస్తోంది. పాఠశాలల్లో నాణ్యమైన విద్య కనిపిస్తోంది. హాస్టళ్లలో మెరుగైన సౌకర్యాలు కనిపిస్తున్నాయి. రోడ్లు, తాగునీరు, విద్యుత్, ఆరోగ్య సేవలు అందుబాటులోకి వస్తున్నాయి. గిరిజన మహిళలు స్వయం ఉపాధి వైపు అడుగులు వేస్తున్నారు. గిరిజన రైతులకు భూ హక్కులు బలపడుతున్నాయి. యువతకు ఉన్నత విద్య, పోటీ పరీక్షలు, ఉపాధి అవకాశాల దారులు తెరుచుకుంటున్నాయి.

ఈ రెండేళ్లు గిరిజనుల జీవితాల్లో నమ్మకాన్ని పెంచిన రెండేళ్లు. అభివృద్ధి అంటే ఏమిటో గిరిజన గ్రామాలకే చేరువ చేసిన రెండేళ్లు. ప్రతి గిరిజన కుటుంబం గౌరవంగా, ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలన్న లక్ష్యంతో ప్రారంభమైన ఈ ప్రయాణం... రాబోయే రోజుల్లో మరింత వేగంగా కొనసాగాలని కోరుకుంటూ, ఈ రెండేళ్లను నిజంగానే "నమ్మకం నిండిన రెండేళ్లు" అని చెప్పొచ్చు.




#### దేశవ్యాప్తంగా గుర్తింపు

గిరిజన సంక్షేమంలో ఉత్తమ పనితీరు కనబరిచిన రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్‌కు జాతీయ స్థాయిలో పురస్కారం లభించింది. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము నుంచి ఈ గౌరవం అందుకోవడం రాష్ట్రానికి గర్వకారణం.

**శశికుమార్**
**తెలుగుదేశం సైనికుడు**



# అంగన్‌వాడీ కేంద్రాలకు వంట పాత్రల పంపిణీ



ఎస్.కోట (చైతన్యరథం): శృంగవరపుకోట స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఐసీడీఎస్ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాలకు ఇండక్షన్ స్టవ్‌లు, వంట పాత్రల పంపిణీ కార్యక్రమం ఘనంగా జరిగింది. సీడీపీవో పి.అచ్యుత అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఎస్.కోట నియోజకవర్గ ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి ముఖ్య అతిథిగా పాల్గొని, అంగన్‌వాడీ కార్యకర్తలకు ఈ వస్తువులను అందజేశారు. ఐసీడీఎస్ పరిధిలోని ఎస్.కోట మండలానికి చెందిన 105, జామి మండలానికి చెందిన 74 కలిపి మొత్తం 179 అంగన్‌వాడీ కేంద్రాలకు ఒక్కో కేంద్రానికి రూ. 7 వేల విలువైన ఇండక్షన్ స్టవ్‌లు, వంట పాత్రలను ప్రభుత్వం తరఫున పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే లలితకుమారి మాట్లాడుతూ... అంగన్‌వాడీ సిబ్బంది పిల్లల కోసం ఈ వస్తువులను వాడుకలోకి తీసుకువచ్చి, వారికి నాణ్యమైన భోజనాన్ని అందించాలని కోరారు. దేశంలో నెలకొన్న గ్యాస్ కొరతను దృష్టిలో ఉంచుకుని, అంగన్‌వాడీల్లోని పిల్లలకు సమయానికి పౌష్టికాహారం, పాలు, గుడ్లు వండి పెట్టాలనే ఉద్దేశంతో కూటమి ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా ఈ ఎలక్ట్రికల్ స్టవ్‌లను పంపిణీ చేస్తోందని తెలిపారు. గత ప్రభుత్వాల నిర్లక్ష్యం వల్ల ప్లాస్టరింగ్ కూడా అవ్వని కొన్ని కేంద్రాల పనులను పూర్తి చేయడానికి జిల్లా కలెక్టర్ సానుకూలంగా ఉన్నారని చెప్పారు. అలాగే, అంగన్‌వాడీ స్టాఫ్ పిల్లలకు కూడా 'తల్లికి వందనం' పథకం వర్తించేలా విద్యాశాఖ మంత్రి లోకేశ్ జీవో పాస్ చేయడం హర్షణీయమన్నారు.

# రైతులకు ఎరువులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే అతిది గజపతిరాజు



విజయనగరం (చైతన్యరథం): ప్రజలందరూ తమ కుటుంబాలతో సంతోషంగా ఉండాలనేది కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే అదితి గజపతిరాజు అన్నారు. సోమవారం దుప్పాడ రైతు సేవా కేంద్రంలో ఎమ్మెల్యే రైతులకు ఎరువులు పంపిణీ చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ముందస్తు జాగ్రత్తతో అవసరం మేర ఎరువులు, విత్తనాలను రైతు సేవా కేంద్రాల్లో అందుబాటులో ఉంచారన్నారు. రైతన్నలు రసాయనిక ఎరువుల వినియోగం తగ్గించి, ప్రకృతి వ్యవసాయం చేయాలని కోరారు. వ్యవసాయాధికారి అద్దూరి శ్రీనివాసరావు, నాయకులు బొబ్బది చంద్రునాయుడు, గంట పోలినాయుడు, బొద్దుల నర్సింగరావు, వ్యవసాయ శాఖ ఉద్యోగులు పాల్గొన్నారు.

# షైనింగ్ స్టార్-2026 అవార్డులతో ప్రతిభావంతులైన విద్యార్థులకు సత్కారం




కురుపాం (చైతన్యరథం): మన్యం జిల్లా కేంద్రంలోని అనూ కన్వెన్షన్ హాల్‌లో జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో సోమవారం నాడు నిర్వహించిన "షైనింగ్ స్టార్-2026" కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్, కురుపాం నియోజకవర్గ శాసనసభ్యురాలు తోయక జగదీశ్వరి స్థానిక ఎమ్మెల్యే బోనెల విజయచంద్రతో మరియు జిల్లా కలెక్టర్ ఎన్ ప్రభాకర్ రెడ్డితో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా 2025-26 విద్యా సంవత్సరంలో పదోతరగతి, ఇంటర్మీడియట్ పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను "షైనింగ్ స్టార్" అవార్డులతో ఘనంగా సత్కరించారు. ప్రతిభ కనబరిచిన ప్రతి విద్యార్థికి రూ.20 వేల నగదు ప్రోత్సాహకం, మెడల్, ప్రశంసాపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... విద్యార్థుల్లో పోటీతత్వాన్ని పెంపొందించి వారిని ఉన్నత లక్ష్యాల వైపు ప్రోత్సహించాలనే ఉద్దేశంతో కూటమి ప్రభుత్వం "షైనింగ్ స్టార్" పేరిట ఈ అవార్డులను అందజేస్తోందని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల విద్యార్థులు కూడా విద్యా రంగంలో రాణించి రాష్ట్రానికి ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు. ప్రతిభను గుర్తించి ప్రోత్సహించడం ద్వారా విద్యార్థుల్లో మరింత ఆత్మవిశ్వాసం పెంపొందుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, జిల్లా విద్యాశాఖ అధికారులు, మండల విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# ఉన్నత లక్ష్యంతో విద్యార్థులు ముందుకు సాగాలి

**• షైనింగ్ స్టార్ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి హోం మంత్రి అనిత**




విజయనగరం (చైతన్యరథం): విద్యార్థులందరూ ఉన్నత లక్ష్యంతో ముందుకు సాగితే బంగారు భవిష్యత్ సాధ్యమవుతుందని హోం మంత్రి వంగలపూడి అనిత సూచించారు. సోమవారం విజయనగరం మండలం ముడిదాంలో విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన 'షైనింగ్ స్టార్' కార్యక్రమంలో ఆమె పాల్గొని, పదో తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు, మెడల్స్, నగదు బహుమతులు అందించారు. అనంతరం హోంమంత్రి అనిత మాట్లాడుతూ విద్యార్థులు తల్లిదండ్రులు, గురువులను గౌరవించాలని, క్రమశిక్షణతో జీవితంలో ముందడుగు వేయాలని కోరారు. పేదరికం చదువుకు అడ్డు కాకూడదని, మంత్రి లోకేశ్ ప్రభుత్వ పాఠశాలల్లో పూర్తిస్థాయిలో సదుపాయాలు కల్పిస్తున్నారని, ప్రతిభఉన్న విద్యార్థులను ప్రోత్సహించడానికి షైనింగ్ స్టార్ అవార్డ్స్ అందిస్తున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ ఎస్. రాంసుందర్ రెడ్డి, ఎమ్మెల్యేలు లోకం నాగ మాధవి, అదితి గజపతిరాజు, మార్కెట్ ఛైర్మన్ కర్రోతు బంగారాజు, డీఈవో మాణిక్యం నాయుడు ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ బడిలో చదివే ప్రతి విద్యార్థి షైనింగ్ స్టార్ కావాలి

**•షైనింగ్ స్టార్స్ అవార్డ్స్ ప్రదానోత్సవంలో టీడీపీ పాడేరు ఇన్‌ఛార్జ్ గిడ్డి ఈశ్వరి**

పాడేరు (చైతన్యరథం): ప్రభుత్వ బడిలో చదివే ప్రతి విద్యార్థి షైనింగ్ స్టార్ కావాలన్నది ఆంధ్రప్రదేశ్ మానవ వనరుల శాఖమంత్రి నారా లోకేష్ తపనని తెలుగుదేశంపార్టీ పాడేరు నియోజకవర్గ ఇన్‌ఛార్జ్, మాజీ శాసనసభ్యులు గిడ్డి ఈశ్వరి పేర్కొన్నారు. పాడేరులోని ప్రభుత్వ పాఠశాలలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రభుత్వం అందజేసే షైనింగ్ స్టార్స్ ప్రోత్సాహకాల పంపిణీ కార్యక్రమంలో ఆమె జాయింట్ కలెక్టర్ తిరుమల శ్రీపూజతో కలిసి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. విద్యార్థులకు ప్రోత్సాహకాలు అందజేసిన అనంతరం ఆమె మాట్లాడాలి.. పిల్లలు పుట్టగానే వారి భవిష్యత్తు గురించి ఆలోచించడం మొదలు పెడతామన్నారు. గతంలో ఐదు సంవత్సరాలు తర్వాతే పాఠశాలలో చేరేవారని ఇప్పుడు విద్యా చట్టంలోనే మార్పులు తీసుకొచ్చారని మూడు ఏళ్ల నుంచి ప్రీ స్కూల్ సెక్షన్ అంగనవాడితో ప్రారంభమవుతుందన్నారు. దీనికి మించి ఇంకా అడ్వాన్స్‌గా కేరింగ్ స్కూల్‌లోనే చేర్పిస్తున్నామన్నారు. మన పిల్లల భవిష్యత్తును చిన్నప్పుడే నిర్ణయించి ఆ మార్గం దిశగా వాళ్ళను చదివిస్తున్నామన్నారు. ఈరోజు ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులను మధ్య స్వేచ్ఛపూరిత పోటీని పెంచడం కోసం ఉత్తమ ప్రతిభను సాధించిన విద్యార్థులకు షైనింగ్ స్టార్స్ పేరిట అవార్డులు ఇవ్వాలని ప్రభుత్వం చేసిన నిర్ణయం అభినందనీయమన్నారు. షైనింగ్ స్టార్స్ అన్నది కూటమి ప్రభుత్వం నారా చంద్రబాబునాయుడు విద్యాశాఖ మార్పిలో నారా లోకేష్ తీసుకున్న ఒక వినూత్న కాన్సెప్ట్ అన్నారు. ఏదో ప్రశంస



పత్రాలతో సరిపెట్టడం కాకుండా రాష్ట్రం ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్నా సరే ప్రభుత్వ పాఠశాలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఆర్థిక సహకారం అందించి ప్రోత్సహించాలన్న ఉద్దేశంతో షైనింగ్ స్టార్స్ కాన్సెప్ట్ ప్రభుత్వం తీసుకొచ్చిందన్నారు.

# నేటి విద్యార్థులే రాష్ట్ర భవిష్యత్తుకు పునాదులు

**•సాంఘిక సంక్షేమ వసతి గృహం విద్యార్థులకు ఎమ్మెల్యే విజయ్ చంద్ర దుస్తులు, నిత్యవసర వస్తువుల పంపిణీ**



పార్వతీపురం (చైతన్యరథం): రాష్ట్రంలో విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులే రేపటి రాష్ట్ర భవిష్యత్తుకు పునాదులని పార్వతీపురం ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర అన్నారు. సోమవారం సీతానగరం మండలం మరిపివలస సాంఘిక సంక్షేమ వసతి గృహంలో విద్యార్థులకు దుస్తులతో పాటు ఇతర నిత్యవసర వస్తువులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో పాఠశాలలే కాకుండా వసతి గృహాలను అందులో విద్యార్థులకు కార్పోరేట్ స్థాయిలో సౌకర్యాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని, అది ముఖ్యమంత్రితో పాటు విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ఆశయమని ఆయన తెలియజేశారు. వసతి గృహాల్లో చేర్పించేందుకు విద్యార్థులు తల్లిదండ్రులు పోటీపడే విధంగా వసతి గృహాల నిర్వహణ ఉంటుందని అందుకు ప్రభుత్వం సంపూర్ణంగా నిధులు మంజూరు చేస్తుందని తెలిపారు. విద్యార్థులకు అవసరమైన పుస్తకాలతో పాటు దుస్తులు మౌలిక సదుపాయాలు, సుశిక్షితులైన ఉపాధ్యాయులు నియమించడంలో ప్రభుత్వం దృష్టి సారించిందని తెలిపారు. అవకాశాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని చదువులలో ప్రతిభను చూపి భవిష్యత్తులో తమ జీవితాలను ఎంతో అందంగా ఉన్నతంగా తీర్చిదిద్దుకోవాలని కోరారు.

# ఎమ్మెల్యే పల్లా చొరవతో వంటిల్లు కూడలికి నూతన సొబగులు



గాజువాక (చైతన్యరథం): పట్టణాన్ని అందంగా తీర్చిదిద్దే క్రమంలో ఇక్కడి వంటిల్లు కూడలిలో చేపడుతోన్న ఆధునీకరణ పనుల్లో భాగంగా నూతన ఫౌంటెన్ ప్రారంభానికి ముందే స్థానికులను కట్టిపడేస్తుంది. ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు సూచనలతో జీవీఎంసీ అధికారులు అధునాతన ఫౌంటెన్‌ను అందుబాటులోకి తెచ్చారు. సోమవారం సాయంత్రం ఎస్ఈ రాయల్ బాబు, డీఈ వెంకటేశ్వరరావు, ఏఈ వినోద్ లు పర్యవేక్షించి ట్రయల్ రన్ చేశారు. కాసేపు విద్యుత్ దీప కాంతుల మధ్య జిగేల్ మనిపించిన ఫౌంటెన్ ను అందరూ చూస్తూ ఉండిపోయారు. త్వరలోనే ఎమ్మెల్యే చేతుల మీదుగా దీనిని ప్రారంభించనున్నారు.

# రామాయణ పఠనంతో ఆధ్యాత్మికతత్వం అలవడుతుంది

రంపచోడవరం (చైతన్యరథం): రామాయణ పఠనం ద్వారా ఆధ్యాత్మికతత్వం అలవడుతుందని రాష్ట్ర ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్ పర్సన్ ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి అన్నారు. రాజవొమ్మంగి మండలం కొమ్మరపేట రామాలయాన్ని సోమవారం ఆమె పుట్టిన రోజు సందర్భంగా సందర్శించారు. రామాలయ అభివృద్ధికి గోపురం నిర్మాణానికి రూ.3,00,000 ఆర్థిక సాయం అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆధ్యాత్మిక తత్వం నేటి సమాజానికి చాలా అవసరమన్నారు. సర్వమతాలు ఆధ్యాత్మిక తత్వంపై ప్రజలు అవగాహన కలిగి మంచి జీవన విధానాలు అవలంబించాలని కోరారు. అనంతరం ఆమె స్థానిక పురోహితులకు పెద్దల సమక్షంలో రూ.3,00,000లు ఆర్థిక సాయం అందించారు. ఆయా నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేసుకోవాలని కమిటీ సభ్యులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఆమె వెంట APIIC డైరెక్టర్ మండల పార్టీ అధ్యక్షులు గొల్లపూడి పెద్దిరాజు తదితరులు పాల్గొన్నారు.

# విద్యారంగంలో జిల్లాను ఆదర్శంగా నిలపాలి : ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణయ్య




ఏలూరు (చైతన్యరథం): విద్యారంగంలో ఏలూరు జిల్లాను ఆదర్శంగా నిలిపేందుకు సమిష్టిగా కృషిచేద్దామని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి పిలుపునిచ్చారు. సోమవారం పెదపాడు మండలం వట్లూరులోని సర్.సి.ఆర్. రెడ్డి ఇంజినీరింగ్ కళాశాల ఆడిటోరియంలో షైనింగ్ స్టార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఏలూరు ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణయ్య (చంటి), దెందులూరు మండలం ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ పాల్గొన్నారు. షైనింగ్ స్టార్ కార్యక్రమం ద్వారా ఏలూరు జిల్లాలో 2025–26 సంవత్సరానికి పదో తరగతిలో అద్భుతమైన ఫలితాలు సాధించిన 187 మంది విద్యార్థులకు రూ.37.40 లక్షలు, 35 మంది ఇంటర్మీడియట్ విద్యార్థులకు రూ.7 లక్షల నమూనా చెక్కులను అందజేశారు. విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.20 వేలు చొప్పున చెక్కులతోపాటు, ప్రశంసాపత్రాలను, మెడల్స్ను అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. పాఠశాల విద్యార్థుల బతుకులు మార్చే దేవాలయం అని అన్నారు. వంద రోజులు యాక్షన్ ప్లాన్ను సమర్థంగా అమలు చేసి, ఉత్తీర్ణతా శాతాన్ని పెంచిన విద్యాశాఖ అధికారులు, ప్రధాన ఉపాధ్యాయులు, ఉపాధ్యాయులను, విద్యార్థులను జిల్లా కలెక్టర్ అభినందించారు. ఈ కార్యక్రమంలో పలువురు ఉన్నతాధికారులు తదితరులు పాల్గొన్నారు.

## అధారాలు లేకుండా నాపై చేసిన ఆరోపణలు వెనక్కి తీసుకోండి లేకపోతే పరువు నష్టం దావా తప్పదు : ఎమ్మెల్యే గళ్ళా మాధవి

**●అంబటి రాంబాబు వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్**



గుంటూరు (చైతన్యరథం): గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలోని కృష్ణబాబు కాలనీలో ఇటీవల ఓ మహిళపై జరిగిన దారుణ ఘటనను రాజకీయ లబ్ధి కోసం వక్రీకరిస్తూ తనపై నిరాధార ఆరోపణలు చేసిన మాజీ మంత్రి అంబటి రాంబాబు వెంటనే క్షమాపణ చెప్పాలని, లేనిపక్షంలో పరువు నష్టం దావా వేస్తానని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి హెచ్చరించారు. సోమవారం క్యాంప్ కార్యాలయంలో గళ్ళా మాధవి మాట్లాడుతూ... గుంటూరు కృష్ణబాబు కాలనీలో మహిళపై జరిగిన ఘటనను రాష్ట్రవ్యాప్తంగా అందరూ ఖండించారని, మహిళా కమిషన్ సహా సంబంధిత శాఖలు స్పందించి చర్యలు తీసుకున్నాయని తెలిపారు. ప్రస్తుతం ఘటనకు బాధ్యులైన వ్యక్తులు చట్టపరమైన శిక్షను ఎదుర్కొంటున్నారని చెప్పారు. అయితే జరిగిన ఘటనను వక్రీకరిస్తూ కొందరు వైసీపీ నాయకులు కొత్త కథనాలు సృష్టించి సోషల్ మీడియాలో ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. ముఖ్యంగా మాజీ మంత్రి అంబటి రాంబాబు ప్రత్యేకంగా విలేకర్ల సమావేశం నిర్వహించి, అనంతరం ఒక ప్రత్యేక వీడియో రూపొందించి విడుదల చేయడం ద్వారా అసత్యాలను ప్రచారం చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేశారని ఆరోపించారు. ఎలాంటి ఆధారాలు లేకుండా అంబటి రాంబాబు ప్రత్యక్ష సాక్షిలా వ్యవహరిస్తూ, ఎమ్మెల్యే జోక్యం, పోలీసుల వ్యవహారం, ఘటన వెనుక జరిగిన పరిణామాల పై కల్పిత కథనాలు అల్లుతూ వీడియో విడుదల చేయడం బాధ్యతాయుతమైన రాజకీయ నాయకుడికి తగదన్నారు. ప్రజల్లో గందరగోళం సృష్టించడమే లక్ష్యంగా ఈ ప్రచారం సాగుతోందని విమర్శించారు. మహిళలపై జరిగిన అనేక దారుణ ఘటనల సమయంలో వైసీపీ నాయకులు ఎలా స్పందించారో ప్రజలు మర్చిపోలేదన్నారు. తమ హయాంలో జరిగిన మహిళలపై దాడులు, అవమానాలపై స్పందించని వారు, ఇప్పుడు ఒక మహిళ అనుభవించిన బాధను రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగించుకోవడం దురదృష్టకరమన్నారు. ఒక మహిళ న్యాయం కోసం తమ పార్టీ కార్యాలయానికి వచ్చిన వెంటనే అధికారులను ఆదేశించామని, నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించామని తెలిపారు.

# ఇన్నోవేటివ్‌గా ఆలోచిస్తే విజయ శిఖరాలు

**●షైనింగ్ అవార్డుల ప్రధానోత్సవంలో ఎమ్మెల్యేలు నసీర్, గళ్ళామాధవి, బూర్ల రామాంజనేయులు**




గుంటూరు (చైతన్యరథం): విద్యార్థులు సంప్రదాయ కోర్సులు కాకుండా ఇన్నోవేషన్‌గా ఆలోచిస్తే సెన్సేషన్ క్రియేట్ చేయొచ్చని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే అసెంబ్లీ మైనార్టీ కమిటీ చైర్మన్ నసీర్ అన్నారు. 10, ఇంటర్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు స్థానిక ఏఎస్ కన్వెన్షన్‌లో షైనింగ్ స్టార్స్ అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. కలెక్టర్ శ్రీకాంత్ వర్మ, ఎమ్మెల్యేలు గళ్ళా మాధవి, బూర్ల రామాంజనేయులుతో కలిసి ఎమ్మెల్యే నసీర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో యువత బంగారు భవిష్యత్తుకు పునాదులు వేసేందుకు ముఖ్య మంత్రి నారా చంద్రబాబునాయుడు, విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలు సత్ఫలితాలు ఇస్తున్నాయని చెప్పారు. విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలలో విద్యనభ్యసించే 10, ఇంటర్ విద్యార్థులకు కేవలం పుస్తకాలలో పాఠాలను బోధించడమే కాకుండా ఇన్నోవేషన్, సాంకేతిక నైపుణ్య శిక్షణ అందిస్తున్నామని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని మౌలిక వసతులు కల్పిస్తూ మోడల్‌గా తీర్చిదిద్దుతున్నామని తెలిపారు. దీంతో ప్రభుత్వ పాఠశాలలు కార్పొరేట్ కు దీటుగా ఫలితాలు సాధిస్తున్నాయన్నారు.విద్యార్థులు కేవలం చదువులకే పరిమితం కాకుండా మారుతున్న కాలానికి అనుగుణంగా సాంకేతికతను ఒడిసి పట్టుకోవాలన్నారు. పారిశ్రామికవేత్తలుగా ఎదిగి పది మందికి ఉద్యోగావకాశాలు కల్పించాలని సూచించారు. ఉత్తమ ఫలితాలు సాధించిన 170 మంది విద్యార్థులకు అభినందనలు తెలిపారు.

## టిడ్కో గృహ నిర్మాణ పనుల పురోగతిపై ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ సమీక్ష



జగ్గయ్యపేట (చైతన్యరథం): పట్టణంలోని టిడ్కో గృహాల నిర్మాణ ప్రాంతాన్ని స్థానిక శాసనసభ్యులు, తెలుగుదేశం పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు శ్రీరాం రాజగోపాల్ సోమవారం సందర్శించి, నిర్మాణ పనుల పురోగతిని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా సంబంధిత శాఖ అధికారులతో సమావేశమైన ఎమ్మెల్యే... టిడ్కో గృహాల నిర్మాణ పనుల ప్రస్తుత పరిస్థితిని సమీక్షించారు. పనులను మరింత వేగవంతంగా పూర్తి చేసి, లబ్ధిదారులకు ఇళ్లను త్వరితగతిన అందించేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. నిర్మాణ నాణ్యతలో ఎలాంటి రాజీ పడకుండా, నిర్ణయించిన గడువులో పనులు పూర్తి చేయాలని స్పష్టం చేశారు. అలాగే టిడ్కో గృహాల నిర్మాణానికి సంబంధించిన సమస్యలు, పనుల పురోగతి, చేపట్టాల్సిన తదుపరి కార్యాచరణపై సమగ్రంగా చర్చించేందుకు ఈ నెల 24వ తేదీన జగ్గయ్యపేట మున్సిపల్ కార్యాలయంలో కాంట్రాక్టర్లు, సంబంధిత శాఖ అధికారులతో ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) వెల్లడించారు. ఈ కార్యక్రమంలో జగ్గయ్యపేట మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, కౌన్సిలర్లు వెంకటీ, పుల్లారావు, నాయకులు రఘు, శ్రీనాథ్, అక్బర్, సంబంధిత శాఖ అధికారులు మరియు స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందించాలి

**●నీటి పారుదల సలహా మండలి సమావేశంలో నేతల సూచన**



గన్నవరం (చైతన్యరథం): కృష్ణా జిల్లా కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధ్యక్షతన ఆంధ్రప్రదేశ్ జలవనరుల శాఖ నిర్వహించిన 43వ నీటి పారుదల సలహా మండలి (ఐఏబీ) సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు, పామర్రు శాసనసభ్యులు వర్ల కుమార్ రాజా, పెడన శాసనసభ్యులు కాగిత కృష్ణ ప్రసాద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా గన్నవరం నియోజకవర్గ రైతులు ఎదుర్కొంటున్న సాగునీటి సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పలు కీలక సూచనలు చేశారు. ఏలూరు కాలువ డిజైన్ డిశ్చార్జ్ 1,650 క్యూసెక్కులు ఉన్నప్పటికీ ప్రస్తుతం 800 క్యూసెక్కులు మాత్రమే విడుదల చేస్తున్నారని ఎమ్మెల్యే తెలిపారు. దీంతో రామవరప్పాడు నుంచి పెరికీడు వరకు ఉన్న రైతులకు తూములు, రెగ్యులేటర్ల ద్వారా సాగునీరు సక్రమంగా అందడం లేదని పేర్కొన్నారు. రైతుల సాగు అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఏలూరు కాలువకు నిరంతరంగా 1,200 క్యూసెక్కుల నీటిని విడుదల చేయాలని జలవనరుల శాఖ అధికారులను కోరారు. ప్రస్తుత వర్షాభావ పరిస్థితుల్లో నీటి సంఘాల అధ్యక్షులు సమన్వయంతో వ్యవహరించి, ప్రతి కాలువ చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందేలా చర్యలు చేపట్టాలని సూచించారు. నీటి పంపిణీలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. బుడమేరు వరదల నుంచి ఏలూరు కాలువను రక్షించేందుకు ఎనికేపాడు అండర్ టన్నెల్ సామర్థ్యాన్ని 5,000 క్యూసెక్కుల నుంచి 25,000 క్యూసెక్కులకు పెంచే ప్రతిపాదనకు రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం తెలిపి, రూ.36 కోట్లు మంజూరు చేయడం హర్షణీయమని యార్లగడ్డ వెంకట్రావు పేర్కొన్నారు.

## బ్రాహ్మణులు, పంచాంగకర్తల సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యం

**●బ్రాహ్మణ సంక్షేమ కార్పొరేషన్ చైర్మన్ కె. బుచ్చిరాంప్రసాద్**




విజయవాడ (చైతన్యరథం): అఖిల భారతీయ బ్రాహ్మణ మహాసంఘము (ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభాగం) ఆధ్వర్యంలో రాష్ట్ర అధ్యక్షులు శిరోమణి ఇంద్రకంటి ప్రసాద్ ఆర్య సిద్ధాంతి నాయకత్వంలోని ప్రతినిధి బృందం సోమవారం గొల్లపూడిలోని ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సంక్షేమ కార్పొరేషన్ కార్యాలయంలో కార్పొరేషన్ చైర్మన్ కె.బుచ్చిరాంప్రసాద్‌ని మర్యాదపూర్వకంగా కలిసి, రాష్ట్రంలోని బ్రాహ్మణులు మరియు పంచాంగ కర్తలు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సంక్షేమ కార్పొరేషన్ స్టేట్ ఎగ్జిక్యూటివ్ వర్కింగ్ ప్రెసిడెంట్ పుల్లభట్ల ఫణి కుమార్ శర్మ, చైర్మన్ కె. బుచ్చిరాంప్రసాద్‌తో కలిసి ప్రతినిధి బృందాన్ని ఆహ్వానించి, కార్యక్రమాన్ని సమన్వయం చేశారు. ఈ సందర్భంగా మహాసంఘం ప్రతినిధులు మాట్లాడుతూ... కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత బ్రాహ్మణ సంక్షేమానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని, బ్రాహ్మణ సంక్షేమ కార్పొరేషన్‌ను దేవాదాయ శాఖ పరిధిలోకి తీసుకురావడం చారిత్రాత్మక నిర్ణయమని పేర్కొంటూ రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, విద్యా-ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్‌కి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం పంచాంగ కర్తల తరపున అమరావతిలో "దైవజ్ఞ భవన్" నిర్మాణం, పంచాంగ కర్తలకు అధికారిక గుర్తింపు కార్డులు, నెలవారీ గౌరవ వేతనం, నివాస స్థలాల కేటాయింపు, ప్రముఖ దేవాలయాలలో ప్రతి సంవత్సరం ఒకసారి ఎగ్రా దర్శన సౌకర్యం, అలాగే దృక్ గణిత పంచాంగ కర్తలను ప్రధాన దేవాలయాలలో ఆస్థాన సిద్ధాంతులుగా నియమించాలని కోరుతూ పలు కీలక డిమాండ్లను చైర్మన్ దృష్టికి తీసుకువచ్చారు. వినతిపత్రాన్ని స్వీకరించిన బ్రాహ్మణ సంక్షేమ కార్పొరేషన్ చైర్మన్ కె. బుచ్చిరాంప్రసాద్ మాట్లాడుతూ... బ్రాహ్మణులు, వేద పండితులు, పంచాంగ కర్తల సంక్షేమం కూటమి ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యత కలిగిన అంశమని, సమర్పించిన ప్రతి డిమాండ్‌ను సానుకూలంగా పరిశీలించి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు.

# లబ్ధిదారులకు ఎ.ఎల్.ఓ.సి పత్రాలు అందజేసిన ఎమ్మెల్యే వసంత



మైలవరం (చైతన్యరథం): పేద మరియు మధ్యతరగతి కుటుంబాలకు వైద్య చికిత్సలు భారంగా మారకుండా ప్రభుత్వం అందిస్తున్న సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని మైలవరం నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్ వ్యాఖ్యానించారు. సోమవారం విజయవాడ రూరల్ మండలంలోని గొల్లపూడిలోని ఎమ్మెల్యే కార్యాలయంలో ఎల్.ఓ.సి (లెటర్ ఆఫ్ క్రెడిట్) పత్రాలను లబ్ధిదారులకు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... ప్రజల ఆరోగ్యమే ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యత అని అన్నారు. ఆర్థిక ఇబ్బందులతో చికిత్స పొందలేని నిరుపేదలకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నాయకత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలుస్తోందని పేర్కొన్నారు. ప్రజల నుంచి వచ్చిన ప్రతి అర్జీని పరిశీలించి అర్హులకు వీలైనంత త్వరగా వైద్య సహాయం అందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఎల్.ఓ.సిలు అందుకున్న లబ్ధిదారులు తమకు వైద్య సహాయం అందేలా కృషి చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకి, ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాదుకి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి కుటుంబ సభ్యులు, లబ్ధిదారుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# స్వచ్ఛ రక్షణ కార్యక్రమాలపై వారం రోజుల్లో యాక్షన్ ప్లాన్ : చైర్మన్ పట్టాభి



అమరావతి (చైతన్యరథం): స్వచ్ఛ ఆంధ్ర కార్పోరేషన్ ఆధ్వర్యంలో ఏఐఐఎల్ఎస్‌జీ, సాహస్, వాష్ ఏజన్సీలు నిర్వహించే సీబీ (కెపాసిటీ బిల్డింగ్), ఐఈసీ(ఇన్ఫర్మేషన్, ఎడ్యుకేషన్ అండ్ కమ్యూనికేషన్) కార్యక్రమాలకు చాంబర్ ఆఫ్ కామర్స్, హోటల్స్ అసోసియేషన్స్, స్వచ్ఛంద సంస్థలు, లయన్స్, రోటరీ... వంటి పెద్ద పెద్ద అసోసియేషన్స్ వారిని ఆహ్వానించి, వారు పాల్గొనే విధంగా కార్యక్రమాలను చేపట్టాలని ఏజెన్సీల వారిని స్వచ్ఛ ఆంధ్ర కార్పోరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ ఆదేశించారు. అమరావతిలోని కార్పోరేషన్ కార్యాలయంలో సోమవారం జరిగిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఐఈసీ, సీబీ ప్రాజెక్ట్ పనులను సమీక్షించారు. ఈ సందర్భంగా చైర్మన్ పట్టాభిరామ్ మాట్లాడుతూ... స్వచ్ఛత కార్యక్రమాలలో చాంబర్ ఆఫ్ కామర్స్, హోటల్స్ అసోసియేషన్స్, స్వచ్ఛంద సంస్థ వారు తప్పనిసరిగా పాల్గొనే విధంగా, వారితో మాట్లాడి కార్యక్రమాలు రూపొందించాలని చెప్పారు. నివాస కాలనీలు, వెల్ఫేర్ అసోసియేషన్‌లవారు కూడా పాల్గొనే విధంగా కార్యక్రమాలు రూపొందించాలన్నారు. వెల్ఫేర్ అసోసియేషన్స్‌కి సంబంధించి జాతీయ, రాష్ట్రస్థాయి అసోసియేషన్లు ఉన్నట్లు తెలిపారు. ఉపాధ్యాయులకు నిర్వహించే రెండు మూడు ఐఈసీ కార్యక్రమాలలో తాను కూడా పాల్గొంటానని చైర్మన్ చెప్పారు. 'స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర'పై ప్రజలలో సంపూర్ణ అవగాహన కల్పించేందుకు అత్యధిక కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు.

**స్వచ్ఛ ఆంధ్ర లక్ష్య సాధనలో విస్తృత ప్రజా అవగాహన**

రాష్ట్రంలోని 26 జిల్లాల్లో అర్బన్, గ్రామీణ ప్రాంతాల్లో చేపట్టిన సీబీ, ఐఈసీ కార్యక్రమాల వివరాలను ఏఐఐఎల్ఎస్‌జీ, సాహస్, వాష్ సంస్థలకు చెందిన ప్రతినిధులు చైర్మన్ పట్టాభిరామ్‌కు వివరించారు. స్వచ్ఛ ఆంధ్ర లక్ష్య సాధనలో విస్తృత ప్రజా అవగాహన, సామర్థ్యాభివృద్ధికి వాష్ ఇన్‌స్టిట్యూట్ కీలక భాగస్వామ్యం వహిస్తున్నట్లు ఆ సంస్థ ప్రతినిధులు తెలిపారు.

# కూటమి విచ్ఛిన్నమే లక్ష్యంగా జగన్ విధ్వంస రాజకీయం : ఎమ్మెల్యే ప్రత్తిపాటి

- విధ్వంస రాజకీయాలు చేసినందునే ప్రజలు వైసీపీకి బుద్ధి చెప్పారు
- కక్ష సాధింపులకు పాల్పడితే... జగన్‌కు మనకు తేడా ఏముంటుంది
- టీడీపీ శిక్షణా తరగతుల్లో యూనిట్ ఇన్ ఛార్జులకు ప్రత్తిపాటి దిశానిర్దేశం



చిలకలూరిపేట (చైతన్యరథం): కూటమి ఐక్యతను విచ్ఛిన్నం చేసి, రాష్ట్రాభివృద్ధిని అడ్డుకొని తన విధ్వంస రాజకీయాలతో ప్రజల్ని దోచుకోవాలన్నదే జగన్ లక్ష్యమని, గొడ్డలిపార్టీ విషప్రచారాలను సమర్థంగా తిప్పికొట్టి, స్థానిక ఎన్నికల్లో మరోసారి తిరుగులేని ప్రజావిజయాన్ని సొంతం చేసుకోవాలని టీడీపీ జోనల్ కోఆర్డినేటర్, శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు టీడీపీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. సోమవారం ఆయన మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన టీడీపీ యూనిట్ ఇన్ ఛార్జుల శిక్షణా తరగతుల్లో మాట్లాడారు. తొలుత ఇన్ ఛార్జులను పరిచయం చేసుకున్న ప్రత్తిపాటి... వారిని పేరుపేరునా పలకరించారు. అనంతరం కూటమిపార్టీల ఐక్యత, దానివల్ల రాష్ట్రానికి, ప్రజలకు కలిగే ప్రయోజనాలను వారికి వివరించారు. స్థానిక ఎన్నికల్లో కూటమిపార్టీల విజయంతో ఏపీకి ఎనలేని ప్రయోజనాలు చేకూరతాయన్నారు.

**విధ్వంసాన్ని నమ్ముకున్నందునే ప్రజలు వైసీపీకి బుద్ధిచెప్పారు..**

పార్టీ శ్రేణులు ఎలాంటి అసమ్మతి, అసంతృప్తికి తావు లేకుండా రాష్ట్రాన్ని, ప్రజల్ని దృష్టిలో పెట్టుకొని పనిచేయాలన్న ప్రత్తిపాటి.. విధ్వంసాన్ని నమ్ముకొని, విద్వేషాల్ని రెచ్చగొట్టినందునే ప్రజలు వైసీపీకి బుద్ధి చెప్పారనే వాస్తవాన్ని శ్రేణులు గ్రహించాలన్నారు. జగన్ మాదిరే అధికారం కోసం గొడ్డలిని, ఫ్యాక్షన్ రాజకీయాల్ని, కక్షసాధింపుల్ని నమ్ముకుంటే.. వైసీపీకి, కూటమికి తేడా ఏముంటుందన్న ప్రత్తిపాటి. ప్రజలు ఐదేళ్ల జగన్ సాగించిన అరాచకాలకు ఎలా చెక్ పెట్టారో గ్రహించాలన్నారు.

**'స్థానిక' సమరంలో కూటమి విజయమే.. వైసీపీ విషప్రచారాలకు అసలైన విరుగుడు**

త్వరలో జరిగే స్థానిక ఎన్నికల్లోకూటమి పార్టీలతో టీడీపీ శ్రేణులు గతంలో కంటే మెరుగ్గా సమన్వయం చేసుకోవాలని, మూడుపార్టీల ఐక్యతతో ప్రజలు అందించే విజయమే వైసీపీ విషప్రచారానికి అసలైన విరుగుడు అని ప్రత్తిపాటి అభిప్రాయపడ్డారు. మూడుపార్టీల మధ్య అగ్గిరాజేసి, ఆ మంటల్లో చలికాచుకోవాలని, జగన్ రోజుకో కొత్త కుట్రకు తెరలేపుతున్నాడని ప్రత్తిపాటి చెప్పారు. చంద్రబాబు నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం ఎప్పటికప్పుడు సమర్థవంతంగా వైసీపీ కుట్రలను తిప్పికొట్టడం వల్లే ప్రజలు ప్రశాంతంగా జీవిస్తున్నారన్నారు.

# జాతీయ అప్రెంటిస్‌షిప్ ప్రమోషన్ పథకం ద్వారా ఆంధ్రప్రదేశ్ యువతకు కొత్త ఆశలు

● పార్లమెంట్‌లో లోక్‌సభ సభ్యుడు కేశినేని శివనాథ్ అడిగిన ప్రశ్నకు కేంద్ర నైపుణ్యాభివృద్ధి శాఖ మంత్రి జయంత్ చౌదరి రాతపూర్వక సమాధానం




విశాఖపట్నం (చైతన్యరథం): ఆంధ్రప్రదేశ్‌లో జాతీయ అప్రెంటిస్ ప్రమోషన్ పథకం (NAPS2.0) ద్వారా ఆంధ్రప్రదేశ్ యువతకు కొత్త ఆశలు వచ్చాయని నాలుగేళ్లలో ఆంధ్రప్రదేశ్లో దాదాపుగా వేల మందికి యువతీ యువకులకు వివిధ రంగాల్లో అప్రెంటీసులుగా చేరి క్షేత్రస్థాయిలో శిక్షణ మరియు నైపుణ్య అభివృద్ధిని మొదలు పెట్టడం వల్ల ఎంతో మంది యువతకు ఉపాధి అవకాశాలు లభించాయని వారికి స్టైఫండ్ కూడా జమ చేసినట్లు కేంద్ర నైపుణ్య అభివృద్ధి మరియు వ్యవస్థాపక మంత్రి శాఖ సహాయ మంత్రి జయంతి చౌదరి వెల్లడించారు. లోక్‌సభలో సోమవారం ఎంపీ కేశినేని శివనాథ్ ఆంధ్రప్రదేశ్‌లో జాతీయ అప్రెంటిస్ ప్రోత్సాహక పథకం (NAPS)2.0 ద్వారా ఎంతమందికి అప్రెంటిస్ షిప్ ట్రైనింగ్ పరిశ్రమల ద్వారా పొందిన అవకాశాలు లబ్ధి పొందిన వారి సంఖ్య స్టైఫండ్ వంటి వివిధ అంశాలపై కేంద్ర నైపుణ్యాభివృద్ధి మరియు వ్యవస్థాపక మంత్రి శాఖను ప్రశ్నించగా ఆ శాఖ సహాయ మంత్రి జయంతి చౌదరి రాతపూర్వకంగా సమాధానం ఇచ్చారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో యువతకు కేంద్రం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న జాతీయ అప్రెంటిస్ షిప్ ప్రమోషన్ పథకం (పీఎంఆర్ 2.0) కొత్త ఆశలు చిగురింప చేసేలా చేస్తుంది. రాష్ట్రంలో ఈ పథకం గడచిన నాలుగు సంవత్సరాలలో దాదాపుగా 93 094 మంది యువతీ యువకులకు అప్రెంటిస్ షిప్ పూర్తిచేసి పరిశ్రమల అవసరాలకు తగ్గట్టుగా క్షేత్రస్థాయిలో శిక్షణ ఇస్తూ వారి నైపుణ్యాలకు పదును పెట్టి యువతీ యువకులకు ఉపాధి అవకాశాలు మెరుగుపడేలా చేసింది.

కేవలం అప్రెంటిస్ షిప్ సంఖ్య పెరగడమే కాకుండా రాష్ట్రంలో వారికి శిక్షణ ఇచ్చేందుకు1135 ప్రత్యేక పరిశ్రమలు ముందుకు వచ్చాయని తెలియజేశారు. పైగా ఎలాంటి మధ్యవర్తుల ప్రమేయం లేకుండా ప్రభుత్వం అందించే స్టైఫండ్ మద్దతును డైరెక్టర్ బెనిఫిట్ ట్రాన్స్ఫర్ (డిబిటి) ద్వారా నేరుగా అప్రెంటిస్ షిప్ తీసుకునే వారి బ్యాంకు ఖాతాలోనే జమ చేస్తుండడం వల్ల ఈ పథకానికి ఆదరణ మరియు పారదర్శకత పెరిగింది.

ప్రతి సంవత్సరం ఈ కార్యక్రమానికి కేంద్ర ఆర్థిక మద్దతు కూడా గణనీయంగా పెరుగుతుంది 2021- 22లో 4.43 కోట్లుగా ఉన్న నిధులు 2024-25 నాటికి ఏకంగా 19.65 కోట్లకు కేంద్రం చేర్చింది. ఈ చేరిక ద్వారానే కేంద్ర ప్రభుత్వం ఈ పథకానికి ఎంత ప్రాధాన్యత ఇచ్చిందో చాలా సుస్పష్టంగా అర్థమవుతుంది. అయితే కేవలం నిధులు కేటాయింపు గణాంకాల పెరుగుదలతో సరిపెట్టుకోకుండా రాష్ట్ర ప్రభుత్వం కూడా దీనిపై ప్రత్యేక దృష్టి సాధించాలని తెలియజేశారు.

# పేదల ఆరోగ్యానికి అండగా కూటమి ప్రభుత్వం



పెదకూరపాడు (చైతన్యరథం): అనారోగ్యంతో ఆసుపత్రుల్లో చికిత్స పొందుతూ ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొన్న బాధిత కుటుంబాలకు కూటమి ప్రభుత్వం అండగా నిలుస్తోందని పెదకూరపాడు నియోజకవర్గ కూటమి నాయకులు పేర్కొన్నారు. నియోజకవర్గ క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా మంజూరైన చెక్కులను నియోజకవర్గంలోని బాధితులకు నాయకులు పంపిణీ చేశారు. పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ ప్రత్యేక కృషితో అమరావతి, పెదకూరపాడు, అచ్చంపేట, క్రోసూరు, బెల్లంకొండ మండలాలకు చెందిన 69 మంది బాధితులకు మొత్తం రూ.56,33,350 విలువైన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు అందజేశారు. ఆసుపత్రి పాలై, కష్టకాలంలో అప్పులు చేసి చికిత్స పొందిన పేద, మధ్యతరగతి కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి ఎంతో భరోసానిస్తోందని నాయకులు తెలిపారు. ప్రజల కష్టాలను తెలుసుకుని వారికి అండగా నిలవాలనే ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సంకల్పానికి సీఎం సహాయనిధి ఒక నిదర్శనమని పేర్కొన్నారు. ఆపదలో ఉన్న ప్రతి కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని, పేదల ఆరోగ్యం, సంక్షేమం పట్ల కూటమి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోందని నాయకులు అన్నారు.

# ఇచ్చిన హామీని నిలబెట్టుకున్న కూటమి ప్రభుత్వం

- అంగన్వాడీ టీచర్లు,హెల్పర్లు, పారిశుద్ధ్య కార్మికులకు "తల్లికి వందనం"
- అసెంబ్లీలో లేవనెత్తిన సమస్యకు పరిష్కారం - బొండా ఉమ కృషితో జీవో విడుదల

విజయవాడ (చైతన్యరథం): విజయవాడ సింగ్‌నగర్‌లోని సెంట్రల్ నియోజకవర్గ శాసనసభ్యుల కార్యాలయం వద్ద సెంట్రల్ నియోజకవర్గ తెలుగు మహిళ కమిటీ ఆధ్వర్యంలో అంగన్వాడీ టీచర్లు, హెల్పర్లు, మున్సిపల్ డ్వాక్రా పారిశుద్ధ్య కార్మికులకు "తల్లికి వందనం" పథకాన్ని వర్తింపజేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిన సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్, సెంట్రల్ నియోజకవర్గ శాసనసభ్యులు బొండా ఉమామహేశ్వరరావు డ్వాక్రా మహిళలు, అంగన్వాడీ టీచర్లు, హెల్పర్లు, పారిశుద్ధ్య కార్మికులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా బొండా ఉమ మాట్లాడుతూ... రాష్ట్ర ప్రజలకు ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం సంపూర్ణ నిబద్ధతతో పనిచేస్తోందన్నారు. "తల్లికి వందనం" పథకాన్ని ప్రతి అర్హ కుటుంబానికి వర్తింపజేస్తూ మరోసారి ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నామని తెలిపారు. గత ప్రభుత్వం "అమ్మ ఒడి" పథకం పేరుతో అందరికీ లబ్ధి కల్పిస్తామని హామీ ఇచ్చి, అధికారంలోకి వచ్చిన తర్వాత లక్షలాది కుటుంబాలను పథకం పరిధి నుంచి తప్పించి నిరాశపరిచిందని విమర్శించారు. కానీ కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రకటించినట్లుగానే ఒక కుటుంబంలో ఎంతమంది



అర్హులైన విద్యార్థులు ఉంటే అంతమందికీ "తల్లికి వందనం" పథకం వర్తింపజేస్తూ సామాజిక న్యాయానికి పెద్దపీట వేసిందన్నారు.

# స్లాబు కూలి ఇల్లు ధ్వంసం

## బాధితులకు బాసటగా మునిసిపల్ మంత్రి నారాయణ



నెల్లూరు (చైతన్యరథం): నగరంలోని 49వ డివిజన్ యనమలవారి వీధిలో సోమవారం 60 ఏళ్ల నాటి పాత ఇంటి స్లాబు ఒక్కసారిగా కూలింది. శిథిలాల కింద చిక్కుకున్న ముగ్గురిని అగ్నిమాపక, రెస్క్యూ సిబ్బంది సమయస్ఫూర్తితో సురక్షితంగా బయటకు తీసుకువచ్చారు. సమాచారం అందుకున్న రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ హుటాహుటిన ఘటనాస్థలికి చేరుకుని కూలిన ఇంటిని పరిశీలించారు. బాధితులు, అధికారులు, స్థానికులతో మాట్లాడి ఘటనకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. సహాయక చర్యలను పర్యవేక్షించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, కూలిన ఇల్లు సుమారు 60 ఏళ్ల క్రితం నిర్మించిందని తెలిపారు. ఆ భవనంలో ఎనిమిది కుటుంబాలు నివాసం ఉంటున్నాయని చెప్పారు. శిథిలాల కింద చిక్కుకున్న ముగ్గురిని సురక్షితంగా బయటకు తీసుకురావడంలో సమయస్ఫూర్తితో వ్యవహరించిన అగ్నిమాపక శాఖ సిబ్బందిని అభినందించారు. బాధిత ఎనిమిది కుటుంబాలకు టిడ్కో ఇళ్లు మంజూరు చేసినట్లు మంత్రి వెల్లడించారు. ఎవరు ఆపదలో ఉన్నా కూటమి ప్రభుత్వం అండగా నిలుస్తుందని, బాధితులకు తక్షణ సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో కమిషనర్ నందన్, మేయర్ సుజాత, డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్, మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ తాళ్లపాక అనురాధ, మాజీ జెడ్పిటిసి విజేతారెడ్డి, 48వ డివిజన్ ప్రెసిడెంట్ బండి ప్రసాద్ ,కో-క్లస్టర్ ఖాదర్ బాషా, క్లస్టర్ కప్పిరి శ్రీనివాసులు, రేవతి ,ముజీబ్, గౌస్ మస్తానమ్మ, షబ్బీర్ స్థానిక టిడిపి నేతలు తదితరులు పాల్గొన్నారు




# వినాయక విగ్రహాల నిమజ్జనాల ఏర్పాట్లపై ఎమ్మెల్యే కోటంరెడ్డి సమీక్ష

నెల్లూరు (చైతన్యరథం): రూరల్ ఎమ్మెల్యే కార్యాలయంలో గణేష్ నిమజ్జన ఏర్పాట్లపై సింహపురి గణేష్ ఉత్సవ సమితి సభ్యులతో కలసి రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి, నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి విలేకరుల సమావేశం నిర్వహించారు. చిన్న చిన్న విగ్రహాలు గణేష్ ఘాట్‌లో, పెద్ద విగ్రహాలు పెన్నా బ్యారేజీలో వేసే విధంగా మంత్రి నారాయణ, నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి , నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డితో మాట్లాడి 2,3రోజుల్లో స్పష్టత ఇస్తామన్నారు. గణేష్ భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా జిల్లా అధికారులు గానీ ప్రజాప్రతినిధులుగా మేము గాని ఏర్పాటు చేస్తామన్నారు. గణేష్ ఉత్సవాలను నెల్లూరు నగరంలో సింహపురి ఉత్సవ సమితి ఆధ్వర్యంలో అనేక సంవత్సరాల నుండి అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారని గుర్తు చేశారు. భవిష్యత్తులో నిధులు వచ్చిన తర్వాత పూర్తిస్థాయిలో గణేష్ నిమజ్జనానికి మంత్రి నారాయణతో మాట్లాడి అద్భుతమైన ఏర్పాట్లను చేస్తామని రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి వెల్లడించారు.

# ప్రభుత్వ బడుల్లోకి కార్పొరేట్ విద్యార్థులు



ఒంగోలు (చైతన్యరథం): ప్రభుత్వ బడుల్లో విద్యార్థుల సంఖ్య, నాణ్యమైన వసతులు, విద్య అందించేందుకు చేస్తున్న ప్రయత్నాలు సత్ఫలితాలనిస్తున్నాయి. ప్రభుత్వం చేస్తున్న విప్లవాత్మక మార్పులకు తోడు, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, గ్రామాల ప్రజలు సమన్వయంతో ముందడుగేస్తే ప్రభుత్వ పాఠశాలలు కార్పొరేట్‌కు ధీటుగా తయారవుతాయని నిరూపించారు జరుగుమల్లి మండలంలోని పచ్చవ మోడల్ ప్రైమరీ స్కూల్ ఉపాధ్యాయులు, పచ్చవ గ్రామస్తులు.

### పెరిగిన విద్యార్థులు

గడిచిన ఏడాది ఈస్కూల్‌లో 1నుంచి 5వ తరగతి వరకు 53 మంది విద్యార్థులున్నారు. వీరిలో ఐదో తరగతి చదివిన 14 మంది విద్యార్థులు 6వ తరగతికి గ్రామంలోని జడ్పీస్కూల్‌కు వెళ్లారు. దీంతో 39 మంది మాత్రమే మిగిలారు. ఉపాధ్యాయులు, గ్రామస్థులతో కలిసి గ్రామం నుంచి డబ్బుల బడులకు (ప్రైవేటు స్కూల్స్‌కు) వెళ్లేవారిని నిలువరించడంలో విశేష కృషి చేసి విజయం సాధించారు. అలా 13 మందిని నిలువరించారు. అంతేగాక వారంతట వారుగా మరికొందరు చేరారు. దీంతో ఈ ఏడాది విద్యార్థుల శాతం గణనీయంగా పెరిగింది. మొత్తం 75 మంది ఎన్‌రోల్ అయ్యారు. 1వ తరగతి 17 మంది, 2వ తరగతి 17 మంది, 3వ తరగతి 18 మంది, 4వ తరగతి 11 మంది, 5వ తరగతి 12 మంది ఉన్నారు. స్కూల్ భవనాలు పురాతనమైనవి కావడంతో కొంత ఇబ్బందికరంగా ఉంది. అదనంగా కొత్త భవనాలు నిర్మించాల్సిన అవసరం ఉంది.

### గ్రామస్తుల కృషి

స్కూల్‌లో హెచ్‌ఎం కల్యాణితోపాటు జి. మాలకొండయ్య, బి. రాఘవమ్మ, జి. శ్రీనివాసరావు అనే ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు. విద్యార్థుల సంఖ్య ఆధారంగా త్వరలోనే మరో ఉపాధ్యాయుడుగాని, ప్రత్యేక బోధకుడు గాని వచ్చే అవకాశం ఉంది. ఉపాధ్యాయుల కృషికి తోడు గ్రామస్థులను సమన్వయం చేసుకుంటూ హెచ్‌ఎం ముందుకు వెళుతున్నారు. ఎప్పటికపుడు విద్యార్థుల పఠనా సామర్థ్యాలను తల్లితండ్రులకు ఉపాధ్యాయులు వివరిస్తున్నారు. గ్రామానికి చెందిన దాతలు సరస్వతీ విగ్రహం, విద్యార్థులకు ప్రభుత్వం ఇస్తున్న ప్రోత్సాహకాలకు తోడు చదువుకోవడానికి అవసరమైన సామగ్రిని అందజేస్తున్నారు. స్కూల్‌కు కుర్చీలు, ఇతర వసతులను సమకూరుస్తున్నారు.



ఒంగోలు లోని జీజీహెచ్ ఆడిటోరియంలో ప్రకాశం జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన "షైనింగ్ అవార్డ్స్ 2026" కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు అధికారులతో కలిసి పాల్గొన్న ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్దన్ రావు



# ఎమ్మెల్యే కావ్య అనుమతిస్తే మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి భరతం పడతాం

## కావలి టీడీపీ నేతల హెచ్చరిక

కావలి (చైతన్యరథం): అంతకుముందెన్నడూ లేని విధంగా గత వైసీపీ ప్రభుత్వం దళిత, గిరిజనులపై దాడులు, హత్యలు, హత్యా రాజకీయాలకు శ్రీకారం చుట్టిందని కావలి నియోజకవర్గం ఎస్సీ, ఎస్టీ సెల్ ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు విమర్శించారు. సోమవారం కావలి టీడీపీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో కావలి పట్టణ టీడీపీ ప్రధాన కార్యదర్శి జ్యోతి బాబురావు, జిల్లా నాయకులు చంద్రశేఖర్, దావులూరి దేవకుమార్, తదితర ఎస్సీ నాయకులు మాట్లాడారు. గొడ్డలి పార్టీ అధినేత జగన్మోహన్ రెడ్డి నీడలో కావలి మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి అరాచకాలు సాగించారన్నారు. కావలి రూరల్ మండలం సర్వాయపాలెం పంచాయతీ, తాగేటిపాలెం నకు చెందిన చాట్ల వాసు అనే వ్యక్తి పార్టీలో బలంగా ఉన్నాడన్న కారణంగా, టీడీపీ కార్యకర్త లను వైసిపి మాజీ ఎమ్మెల్యే ప్రతాప్ కుమార్ రెడ్డి అనుచరుడు, మాజీ సర్పంచ్ మంద మధు ఆధ్వర్యంలో ప్రధాన నిందితుడిగా ఉండి హత్యకు పాల్పడటం, ఆ గ్రామంలో భయాందోళన చేయించి, పార్టీ కేడర్ ను బలహీన పరిచే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. గతంలో వైసిపి అధికారంలో ఉన్నపుడు దుగ్గిరాల కరుణాకర్, తేజ, పైడి హర్ష అనే టిడిపి ఎస్సీ నేతలపై గొడ్డలి పార్టీ మాజీ ఎమ్మెల్యే ప్రతాప్ కుమార్ రెడ్డి హత్య రాజకీయాలు చేశారన్నారు. టిడిపి కార్యకర్త చాట్ల వాసు మర్డర్, టిడిపి మాజీ ఎంపీటీసీ అరగల కిష్టయ్యపై వైసిపి నేతలు దాడులకు పాల్పడటం చూస్తుంటే ఈ వైసీపీ గొడ్డలి పార్టీ ఆధ్వర్యంలోనే ఎస్సీ, ఎస్టీ లపై దాడులు చేస్తున్నారని, ఎస్సీలపై ఎస్సీలను, ఎస్టీ లపై ఎస్టీ లను పురుగోలిపి వీరిని హత్యలకు గురిచేయడం, జైళ్లకు పంపడం వెనుక పక్కా ప్రణాళికలు చేపడుతున్నారన్నారు.కావలి నీ ప్రశాంతంగా ఉంచాలని చూస్తున్న ఎమ్మెల్యే కృష్ణారెడ్డి ఓపికను పరిశీలిస్తున్నారా అని ప్రశ్నించారు. మా ఎమ్మెల్యే కృష్ణారెడ్డి కానుసైగ చేస్తే కావలిలో వైసిపి కనుమరుగు కావడం ఖాయం అన్నారు. కావలిని అభివృద్ధి చేసి అనేక కంపెనీలు కావలికి తీసుకు రావాలి అన్నదే కావ్య కృష్ణరెడ్డి ప్రణాళిక అన్నారు. అంతేగానీ హత్య రాజకీయాలు ఆయనకు తెలియవు అన్నారు. ఎస్సీ, ఎస్టీ లను పావులుగా వాడుకుంటున్న ఈ గొడ్డలి పార్టీ నేతలను కావలి మేధావులు, ఆయా పార్టీలలో ఉన్న ఎస్సీ ఎస్టీ నాయకులు గుర్తించి మేలుకోవాలన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో వాసు చురుకుగా ఉంటారనే ఉద్దేశ్యంతో మాజీ ఎమ్మెల్యే ప్రతాప్ కుమార్ రెడ్డి అనుచరుడు మంద మధు హతమార్చారని అన్నారు. నిందితులను కఠినంగా శిక్షించాలని , ఆ కుటుంబానికి టిడిపి పార్టీ, ప్రభుత్వం అండగా ఉంటుందని తెలిపారు. వైసిపి తీరు మారకపోతే మా ఎమ్మెల్యే కృష్ణారెడ్డి అనుమతి తెలుసుకొని గొడ్డలి పార్టీ నేతలకు బుద్ధి చెపుతున్నారు. కులాల మధ్య, మతాల మధ్య రాజకీయాలు చేస్తూ , కుటుంబాల మధ్య సంబంధాలు లేకుండా చేసి రాజకీయాలు చేయడం ఈ గొడ్డలి పార్టీ నైజం అన్నారు. ఈ కార్యక్రమంలో దళిత నాయకులు,జ్యోతి బాబురావు, ఏగూరి చంద్రశేఖర్,దావులూరి దేవకుమార్, లేలపల్లి సుధీర్,వల్లేరి కిరణ్ కుమార్,చెవురుపాటి కొండయ్య, మొగిలి విజయ్,అక్కిలిగుంట సూరి ప్రకాష్, కమతం శీను,పత్రి రవి, తాళ్లపాలెం రవి,రమణ తదితరులు పాల్గొన్నారు .

# ఎల్‌నినోపై అంతటా అప్రమత్తం

## అనంతపురం అధికారులతో మంత్రి పయ్యావుల కేశవ్



అనంతపురం (చైతన్యరథం): ప్రస్తుతం నెలకొన్న ఎల్‌నినో పరిస్థితులపై అప్రమత్తంగా ఉండాలని ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ పిలుపునిచ్చారు. వ్యవసాయ, ఉద్యాన, హెచ్ఎన్ఎస్ఎస్, హెచ్.ఎల్.సి, మైనర్ ఇరిగేషన్, కేసీకే శాస్త్రవేత్తలు, ఆర్డబ్ల్యుఎస్, డిపిఒ, ఆయా శాఖల జిల్లా అధికారులతో జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్, అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ లతో కలిసి రాష్ట్ర ఆర్థిక, ప్రణాళిక, వాణిజ్య పన్నులు శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రివర్యులు పయ్యావుల కేశవ్ నగరంలోని ఆర్.అండ్.బి అతిథి గృహంలో సోమవారం జరిగిన సమీక్ష సమావేశంలో పాల్గొన్న అసిస్టెంట్ కలెక్టర్ సుయాశ్ కుమార్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ పద్మావతి, జిల్లా వ్యవసాయ అధికారి సాలురెడ్డి, జిల్లా ఉద్యాన శాఖ అధికారి ఉమాదేవి, రెడ్డిపల్లి కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ డా.మల్లీశ్వరి, హెచ్.ఎల్.సి ఎస్ఈ సుధాకర్ రావు, డిపిఒ నాగరాజునాయుడు, కళ్యాణదుర్గం కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త చెన్నరాయుడు, హెచ్ఎన్ఎస్ఎస్ సర్కిల్-2 ఎస్ఈ సిఆర్.రాజగోపాల్, మైనర్ ఇరిగేషన్ ఎస్ఈ విశ్వనాథరెడ్డి, ఆర్డబ్ల్యుఎస్ ఎస్ఈ కె.శ్రీనివాసులు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.



# మంత్రి పయ్యావుల ప్రజాదర్బార్

అనంతపురం (చైతన్యరథం): అనంతపురం (చైతన్యరథం): రామ్ నగర్‌లో ఉన్న రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి క్యాంపు కార్యాలయంలో "ప్రజా దర్బార్" కార్యక్రమాన్ని రాష్ట్ర ఆర్థిక, ప్రణాళిక, వాణిజ్య పన్నులు మరియు శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రివర్యులు పయ్యావుల కేశవ్ నిర్వహించారు. ఈ ప్రజాదర్బార్ కార్యక్రమంలో వివిధ రకాల ప్రజా సమస్యలపై ప్రజలు, నాయకుల నుంచి వినతి పత్రాలను మంత్రి పయ్యావుల కేశవ్ స్వీకరించారు. సమస్యలను పరిష్కరించేందుకు అన్ని విధాల చర్యలు తీసుకుంటామని మంత్రి పేర్కొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పయ్యావుల కేశవ్ మాట్లాడుతూ గౌరవ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలోని కూటమి ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రత్యేక దృష్టి సారించడం జరిగిందని పేర్కొన్నారు. తమ ప్రభుత్వానికి అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్ళు లాంటివని, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గారు రాష్ట్రంలో అర్హులైన పేదలందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందజేస్తూ.. అనేక అభివృద్ధి పనులు చేయడం జరుగుతోందని, రాష్ట్రాన్ని ప్రగతి పథంలో ముందుకు తీసుకెళ్లడం జరుగుతోందన్నారు. ఈ సందర్భంగా మంత్రివర్యులు జిల్లా నలుమూలల నుంచి వచ్చిన బాధితులు, నాయకులు, ప్రజల సమస్యలను అర్జీల రూపంలో స్వీకరించి, ఎలాంటి ఆలస్యం కాకుండా ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు తక్షణం చర్యలు తీసుకుంటామని మంత్రి తెలిపారు.

# సీమ ద్రోహి గొడ్డలి పార్టీ అధినేత జగన్‌రెడ్డే

## విపక్షాల విమర్శలపై విరుచుకుపడిన టీడీపీ ప్రముఖులు



పుట్టపర్తి (చైతన్యరథం): రాయలసీమ రైతాంగానికి అసలైన ద్రోహం చేసింది వైఎస్ జగన్మోహన్ రెడ్డి నాయకత్వంలోని వైసీపీ ప్రభుత్వమేనని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవితపుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మడకశిర ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు, మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి, ధర్మవరం నియోజవర్గ టీడీపీ ఇన్చార్జ్ పరిటాల శ్రీరామ్ లు విమర్శించారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో రాయలసీమకు ఒక్క చుక్క అదనపు సాగునీరు తీసుకురాలేదన్నారు. ఒక్క కొత్త పరిశ్రమను కూడా తీసుకురాలేకపోయారని అన్నారు. రాయలసీమ అభివృద్ధి గురించి మాట్లాడే నైతిక అర్హత వైసీపీ నేతలకు లేదని స్పష్టం చేశారు. ఉమ్మడి అనంతపురం జిల్లా చెందిన వైసిపి నేతలు హంద్రీనీవా ప్రాజెక్టు పనుల్లో అవినీతి అక్రమాలు జరిగాయని, రాయలసీమ ద్రోహి చంద్రబాబు అని చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ వైసిపి నేతలపై సత్యసాయి జిల్లా టిడిపి ప్రజా ప్రతినిధులు రాష్ట్ర మంత్రి సవితమ్మ, ఎమ్మెల్యేలు పల్లె సింధూరరెడ్డి ,ఎమ్మెస్ రాజు, మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి, పరిటాల శ్రీరామ్ లు మండిపడ్డారు. వైసీపీ చేసిన ఆరోపణలు తీవ్రంగా ఖండిస్తూ కూటమి ప్రభుత్వంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నాయకత్వంలో రాయలసీమకు ఉమ్మడి అనంతపురం జిల్లాకు చేసిన అభివృద్ధి పనులు, కృష్ణా జలాల ద్వారా చెరువులను నింపిన ఘనత మాదే అని సోమవారం పుట్టపర్తి నియోజకవర్గంలోని బుక్కపట్నం చెరువు వద్ద నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో వారు మాట్లాడారు. 2014, 2019 మధ్య ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని ప్రభుత్వం రాయలసీమ సాగునీటి ప్రాజెక్టుల అభివృద్ధికి రూ.12 వేల కోట్లకు పైగా ఖర్చు చేసి, హంద్రీ నీవా సహా పలు ప్రాజెక్టులకు వేగం తీసుకొచ్చిందని తెలిపారు. దీనికి భిన్నంగా, జగన్ ప్రభుత్వం తన ఐదేళ్ల పాలనలో రాయలసీమ సాగునీటి ప్రాజెక్టులపై కేవలం రూ.2 వేల కోట్ల మేర మాత్రమే ఖర్చు చేసిందని విమర్శించారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో హంద్రీ--నీవా ప్రాజెక్టు అభివృద్ధికి కొత్త ఊపిరి పోసిందని పేర్కొన్నారు. ఈ రెండేళ్లలోనే హంద్రీ, నీవా ప్రాజెక్టు లైనింగ్, ఆధునీకరణ, అభివృద్ధి పనుల కోసం రూ.3,890 కోట్లతో పనులు చేపట్టామని వెల్లడించారు. రాష్ట్రంలో రెండవ అతిపెద్ద చెరువైన బుక్కపట్నం చెరువును సందర్శించిన టీడీపీ ప్రజాప్రతినిధులు, కృష్ణా జలాలతో కళకళలాడుతున్న చెరువును పరిశీలించారు. ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు ఉన్నప్పటికీ హంద్రీ, నీవా ద్వారా కృష్ణా జలాలు చేరడంతో చెరువు పూర్తిగా నీటితో నిండిందని తెలిపారు. చెరువులో బోటింగ్ చేస్తూ పుష్కలంగా నిల్వ ఉన్న నీటిని పరిశీలించి, వైసీపీ నేతలు ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేయకుండా వాస్తవాలను గుర్తించాలని సూచించారు. రాయలసీమ రైతాంగ సంక్షేమం, సాగునీటి ప్రాజెక్టుల పూర్తి, వ్యవసాయాభివృద్ధి విషయంలో కూటమి ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని, రైతులకు శాశ్వత సాగునీటి భద్రత కల్పించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బుక్కపట్నం, కొత్త చెరువు, పుట్టపర్తి మండలాలకు చెందిన కూటమి ప్రజా ప్రతినిధులు, కూటమి పార్టీల నాయకులు కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేసిన పరిటాల

ధర్మవరం (చైతన్యరథం): పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో పరిటాల శ్రీరామ్ సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. ధర్మవరం, బత్తలపల్లి మండలాలతో పాటు ధర్మవరం పట్టణానికి చెందిన మొత్తం 10మందికి 4 లక్షల 17 వేల రూపాయల విలువైన చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆయా మండలాల నాయకులు, లబ్ధిదారుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. చెక్కులు అందుకున్న లబ్ధిదారులు ముఖ్యమంత్రి చంద్రబాబుతో పాటు పరిటాల శ్రీరామ్‌కు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా శ్రీరామ్ మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యం విషయంలో ప్రభుత్వం ఖర్చు చూడటం లేదన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో మౌలిక వసతులు పెంచడమే కాకుండా వైద్యసేవలను మరింత బలోపేతం చేశారన్నారు. ఎవరైనా అత్యవసర పరిస్థితుల్లో ప్రైవేటు ఆసుపత్రుల్లో చికిత్సలు పొంది ఆర్థికంగా ఇబ్బంది పడితే వారిని సీఎంఆర్ఎఫ్ ద్వారా ఆదుకుంటున్నట్లు వివరించారు. ఇప్పటివరకు ధర్మవరం నియోజకవర్గంలో 421 మందికి 2 కోట్ల 70 లక్షల విలువైన చెక్కులను అందజేశారన్నారు. ఇంత పెద్ద ఎత్తున సహాయం చేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబుకు ధర్మవరం నియోజకవర్గ ప్రజల తరపున శ్రీరామ్ కృతజ్ఞతలు తెలియజేశారు.






# చదువులతోనే బాలలకు బంగారు భవిష్యత్తు

పుట్టపర్తి (చైతన్యరథం): విద్యార్థులే దేశ భవిష్యత్తు అని, చదువుతోనే ఉజ్వల భవిష్యత్తు సాధ్యమవుతుందని పుట్టపర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి అన్నారు. జగత్‌లో అత్యంత శక్తివంతమైనది విద్య ఒక్కటేనని పేర్కొంటూ విద్యార్థులు లక్ష్యసాధన దిశగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. పుట్టపర్తిలో విద్యాశాఖ ఆధ్వర్యంలో పుట్టపర్తి మండలం జగరాజుపల్లి వద్ద మహీ శ్రీనివాస గార్డెన్ లో సోమవారం నిర్వహించిన "షైనింగ్ స్టార్స్ అవార్డ్స్--2026" కార్యక్రమంలో బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవితమ్మ, ఎమ్మెల్యే శ్రీమతి పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి, జిల్లా కలెక్టర్ శ్యాంప్రసాద్, జిల్లా విద్యాశాఖ అధికారి (డీఈఓ) కిష్టప్పతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా పదో తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన 237 మంది షైనింగ్ స్టార్స్ విద్యార్థులకు మొత్తం రూ.47 లక్షల 40 వేల నగదు ప్రోత్సాహకాలు, ప్రశంసా పత్రాలు, అవార్డులను మంత్రి సవిత, ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి,జిల్లా కలెక్టర్ శ్యాంప్రసాద్, మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి,విద్యాశాఖ అధికారుల చేత ఘనంగా అందజేసి విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు.ఈ సందర్భంగా మంత్రి సవితమ్మ మాట్లాడుతూ, ప్రతిభను గుర్తించి విద్యార్థులను ప్రోత్సహించడం ద్వారా మరింత ఉన్నత లక్ష్యాలను చేరుకునేలా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. విద్యార్థుల విజయాల్లో తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు.ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం విద్యకు అత్యున్నత ప్రాధాన్యత ఇస్తోందని, ప్రతిభావంతులైన విద్యార్థులను అన్ని విధాలుగా ప్రోత్సహిస్తూ వారి భవిష్యత్తుకు బలమైన పునాది వేస్తోందన్నారు. ఈ అవార్డులు విద్యార్థుల్లో మరింత ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తాయని తెలిపారు.మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి మాట్లాడుతూ, విద్యార్థులు నిరంతరం కష్టపడి చదివి రాష్ట్రానికి, దేశానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. విద్య ద్వారానే సమాజాభివృద్ధి సాధ్యమని అన్నారు. ప్రపంచంలో అత్యంత శక్తివంతమైనది విద్య ఒక్కటే అని కొనియాడారు. కృషితో నాస్తి దుర్భిక్షం అంటూ కష్టపడి చదివితే ఏదైనా సాధ్యమే అని పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ శ్యాంప్రసాద్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం విద్యా శాఖ ఆధ్వర్యంలో అత్యంత ప్రతిభావంతులైన విద్యార్థులకు షైనింగ్ స్టార్స్ అవార్డ్స్ ఇవ్వడం అభినందనీయం అని ఈ అవార్డు పొందిన షైనింగ్ స్టార్స్ విద్యార్థులకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. విద్యార్థులు కష్టపడి విద్యను అభ్యసించి ఉన్నత శిఖరాన్ని అధిరోహించాలని కోరారు. పిల్లలను బాగా చదివించి ఉన్నత స్థాయిలో రాణించేలా వారి తల్లిదండ్రులు అన్ని విధాలుగా అండగా నిలబడాలని అందుకు ప్రభుత్వం, జిల్లా అధికారులు వెన్నంటి ఉంటారని పేర్కొన్నారు. కార్యక్రమంలో డీఈఓ కిష్టప్ప, డీఐఈఓ చెన్నకేశవులు, విద్యాశాఖ అధికారులు శంకర్ రెడ్డి, త్రిమూర్తి, చంద్రశేఖర్, కూటమి పజాప్రతినిధులు రాష్ట్ర డైరెక్టర్లు కాలే నాయక్, ఒలిపి శ్రీనివాసులు, కురబ శ్రీనివాసులు ,మార్కెట్ యార్డ్ చైర్మన్ పూల శివప్రసాద్, సామకోటి ఆదినారాయణ, ఉపాధ్యాయులు గోపీనాథ్, చంద్రశేఖర్, కేటీ ప్రసాద్, పలువురు ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# గ్లోబల్ టెక్ రంగంలో తెలుగు వెలుగు




## ప్రపంచ ఏఐ దిగ్గజ సంస్థలో అగ్ర స్థానం

## ఓపెన్ ఏఐ సీటీవోగా ఉదయ్ రుద్దర్రాజు

**శాన్‌ఫ్రాన్సిస్కో:** గ్లోబల్ టెక్ రంగంలో తెలుగు వారి ప్రతిభ మరోసారి అంతర్జాతీయ స్థాయికి చేరింది. ప్రపంచ ప్రసిద్ధ కృత్రిమ మేధ (AI) పరిశోధనా సంస్థ ఓపెన్ ఏఐ (OpenAI)లో హైదరాబాద్‌కు చెందిన ఉదయ్ ఆర్ (ఉదయ్ రుద్దర్రాజు–Uday Ruddarraju) కీలక బాధ్యతల్లో నియమితుల య్యారు. గత ఏడాది కాలంగా ఇదే సంస్థలో సేవలందిస్తున్న ఆయన తాజాగా కంప్యూట్ విభాగానికి చీఫ్ టెక్నాలజీ ఆఫీసర్ (CTO - Compute)గా ప్రమోషన్ పొందినట్టు సామాజిక మాధ్యమాల వేదికగా స్వయంగా వెల్లడించారు. ప్రపంచంలోనే అతిపెద్ద కంప్యూటింగ్ మౌలిక సదుపాయాలను నిర్మించే బాధ్యతను సంస్థ ఆయనకు అప్పగించింది.

ఎటువంటి ఐఐటీ (IIT) లేదా ఎన్ఐటీ (NIT) ట్యాగ్ లేకుండానే కేవలం ప్రతిభతోనే ఉదయ్ అగ్రస్థాయికి చేరారు. హైదరాబాద్‌లోని ప్రముఖ ఇంజనీరింగ్ కళాశాల 'సీబీఐటీ' (CBIT–చైతన్య భారతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ)లో కంప్యూటర్ సైన్స్ విభాగంలో బీఈ (BE) పూర్తి చేశారు. కాలేజీలో చదువుతున్న రోజుల్లోనే ప్రతిష్టాత్మక 'అమెజాన్ వెబ్ సర్వీసెస్' (AWS)లో ఇంటర్న్‌గా ఎంపికై సత్తా చాటారు. ఆ తర్వాత ఉన్నత చదువుల కోసం అమెరికా వెళ్లి 'యూనివర్సిటీ ఆఫ్ మిన్నెసోటా'లో మాస్టర్స్ పూర్తి చేశారు. 2013 నుంచి 2018 వరకు ప్రముఖ ఈ–కామర్స్ దిగ్గజం 'ఈబే' (eBay)లో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేశారు.

**కీలక ప్రయాణం:** ఆ తర్వాత 'రాబిన్‌హుడ్' సంస్థలో ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ విభాగానికి సీనియర్ డైరెక్టర్‌గా ఎదిగారు. అనంతరం ఎలాన్ మాస్క్‌కు చెందిన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సంస్థ 'ఎక్స్ఏఐ' (xAI)లో 'హెడ్ ఆఫ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇంజనీరింగ్'గా కీలక బాధ్యతలు నిర్వహించారు. అక్కడి నుంచి ఓపెన్ ఏఐలోకి మారిన ఐదుగురు ప్రముఖుల్లో ఒకరిగా ఉదయ్ అప్పట్లో వార్తల్లో నిలిచారు.

ఓపెన్ ఏఐలో గడిచిన 12 నెలల ప్రయాణం ఎంతో సంతృప్తికరంగా సాగిందని ఉదయ్ పేర్కొన్నారు. రాబోయే సరికొత్త అడ్వాన్స్‌డ్ ఏఐ మోడల్స్ అయిన జీపీటీ 5.6 (GPT 5.6) వంటి వాటి శిక్షణకు అవసరమైన కంప్యూట్, నెట్‌వర్క్, స్టోరేజ్, మెషిన్ లెర్నింగ్ (ML) వ్యవస్థల సామర్థ్యాలను పెంచే పనిలో తమ బృందం నిమగ్నమై ఉందని ఆయన తెలిపారు.

ఫ్రంటియర్ ఏఐ టెక్నాలజీ ప్రపంచంలోని ప్రతి ఒక్కరికీ, ప్రతి పనికీ అందుబాటులోకి రావాలనే లక్ష్యంతో ప్రపంచంలోనే అతిపెద్ద కంప్యూట్ నెట్‌వర్క్‌ను నిర్మించే దిశగా ఓపెన్ ఏఐ భారీ రోడ్‌మ్యాప్‌ను సిద్ధం చేసిందని, ఇందుకోసం డిస్ట్రిబ్యూటెడ్ సిస్టమ్స్, హార్డ్‌వేర్, డేటా సెంటర్ ఇంజనీరింగ్ విభాగాల్లో ప్రతిభావంతులను రిక్రూట్ చేసుకుంటున్నట్టు ఆయన సామాజిక మాధ్యమాల్లో పంచుకున్నారు.

## ఆగస్టు 3 నుంచి 'మాటా' ఆధ్వర్యంలో

# సమ్మర్ క్యాంప్

**యూఎస్ఏ:** మన అమెరికా తెలుగు సంఘం (మాటా) విద్యార్థుల కోసం ప్రత్యేకంగా 'SAT సమ్మర్ క్యాంప్' నిర్వహిస్తోంది. SAT పరీక్షలో మంచి స్కోరు సాధించేందుకు వీలుగా నిపుణులైన అధ్యాపకుల పర్యవేక్షణలో ఈ శిక్షణ కార్యక్రమాన్ని రూపొందించారు.




ఈ క్యాంప్ ఆగస్టు 3 నుంచి 28వ తేదీ వరకు (సోమవారం నుంచి శుక్రవారం) జరుగుతుంది. ప్రతిరోజూ రాత్రి ఏడు నుంచి 8.30 గంటల వరకు మొత్తం 30 గంటల పాటు తరగతులు ఉంటాయి. SAT మ్యాథ్, ఇంగ్లీష్ (రైటింగ్, రీడింగ్) విభాగాల్లోని అన్ని ముఖ్యమైన అంశాలపై దృష్టి సారించి పరీక్షా విధానంపై అవగాహన కల్పిస్తారు. మెంబర్స్ కోసం $130, నాన్–మెంబర్స్ కోసం $150 ఫీజుగా నిర్ణయించారు (సాధారణ ఫీజు $500).

**రిజిస్ట్రేషన్ వివరాలు:**

ఆసక్తి గల విద్యార్థులు ఇమేజ్‌లో ఉన్న క్యూఆర్ కోడ్ ద్వారా లేదా అందించిన లింక్ ద్వారా నమోదు చేసుకోవచ్చు. మరిన్ని వివరాలకు లక్ష్మీకాంత్ గజులను (732–619–7991) సంప్రదించవచ్చు. సీట్లు పరిమితంగా ఉన్నందున కళాశాల ప్రవేశాలకు సిద్ధమవుతున్న విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు కోరారు.

# క్లీవ్‌లాండ్‌లో విషాదం

## అనారోగ్యంతో పల్నాడు జిల్లా యువకుడు రవితేజ మృతి

**క్లీవ్‌లాండ్:** అమెరికాలో స్థిరపడిన ఓ తెలుగు కుటుంబంలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. పల్నాడు జిల్లాకు చెందిన రవితేజ రావిపాటి (34) అరుదైన గుండె సంబంధిత వ్యాధితో (టైప్–ఎ అయోర్టిక్ డిసెక్షన్) కన్నుమూశాడు. ఇటీవలే కొత్త ఇల్లు కొనుగోలు చేసి ఎంతో సంతోషంగా గృహప్రవేశం చేసుకున్న కొద్దిరోజుల్లోనే ఈ విషాదం జరగడంతో ఆ కుటుంబం తీవ్ర దిగ్భ్రాంతికి గురైంది.



పల్నాడు జిల్లా గురజాల మండలం దైదా గ్రామానికి చెందిన కోటేశ్వరమ్మ–శ్రీనివాసరావు దంపతుల కుమారుడైన రవితేజ ఉన్నత చదువుల కోసం 2013లో అమెరికా వెళ్లాడు. ప్రస్తుతం ఓహియోలోని క్లీవ్‌లాండ్‌లో నివసిస్తూ ఒక ప్రైవేటు ఇన్సూరెన్స్ కంపెనీలో పనిచేస్తున్నాడు. రవితేజకు భార్య, రెండేళ్ల కుమారుడు ఉన్నారు. ఇటీవలే ఆయన అక్కడ ఒక కొత్త ఇల్లు కొనుగోలు చేసి గృహప్రవేశం చేశారు. ఆ వేడుక కోసం రవితేజ తల్లిదండ్రులు కూడా అమెరికా వెళ్లారు. అందరూ కలిసి సంతోషంగా గడుపుతున్న సమయంలోనే ఈ ఘోరం జరిగిపోయింది.

### అసలేం జరిగిందంటే...

రవితేజ మరణంపై అతడి సోదరి అనుప్రియ అందించిన వివరాల ప్రకారం.. ఈ నెల 17వ తేదీ అర్ధరాత్రి దాటిన తర్వాత (అమెరికా కాలమానం ప్రకారం రాత్రి 2 గంటల సమయంలో) రవితేజ తన సోదరితో వీడియో కాల్‌లో మాట్లాడుతుండగా అకస్మాత్తుగా 'కాలు లాగేస్తోంది' అని చెప్పాడు. వెంటనే ఉపశమనం కోసం వజ్రాసనంలో కూర్చున్నాడు. ఈలోపు కుటుంబ సభ్యులు అత్యవసర నెంబరు 911కి కాల్ చేసి అంబులెన్స్‌ను రప్పించారు. ఆ సమయంలో ఆయనకు ఛాతిలో తీవ్రంగా నొప్పిగా ఉన్నట్లు చెప్పారు. వెంటనే రవితేజను సమీప ఆసుపత్రికి తరలించి ప్రాథమిక వైద్యం అందించారు. అయితే అక్కడ కార్డియాలజిస్ట్ అందుబాటులో లేకపోవడంతో మరో ఆసుపత్రికి తరలించాల్సి వచ్చింది. ఈ క్రమంలో కొంత ఆలస్యమైంది. ఆసుపత్రికి వెళ్లేసరికి ఆయన కిడ్నీలు దెబ్బతిన్నాయని వైద్యులు వెల్లడించారు. ఆ తర్వాత స్టెంట్ వేసి డయాలసిస్ కూడా చేయడంతో ఆయన కోలుకుంటున్నట్లు కుటుంబ సభ్యులు భావించారు. కానీ ఆ తర్వాత ఆరోగ్యం మళ్లీ క్షీణించడంతో ఈ నెల 18వ తేదీ వేకువజామున రవితేజ ప్రాణాలు విడిచాడు. ఈ బుధవారం అమెరికాలోనే అన్నయ్య అంత్యక్రియలు నిర్వహిస్తామని సోదరి అనుప్రియ చెప్పింది.



# వైభవంగా సహస్ర కమలార్చన

## వేద మంత్రోచ్ఛారణల నడుమ వెయ్యి మంది భక్తుల సామూహిక రుద్రాభిషేకం

## సెయింట్ లూయిస్‌లో ఐదో రోజుకు శతచండీ సహిత రుద్ర యాగం

**మిస్సోరి:** అమెరికాలోని మిస్సోరీ రాష్ట్రం సెయింట్ లూయిస్ హిందూ దేవాలయం వేద ఘోషతో మార్మోగుతోంది. అక్కడ ప్రతిష్టాత్మకంగా జరుగుతున్న 'నవకుండాత్మక శతచండీ సహిత రుద్రయాగం' ఐదో రోజుకు చేరుకుంది. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు ఆధ్యాత్మిక వేడుకలో భాగస్వాములై పునీతులయ్యారు.

ఉదయం గోమాత పూజ అనంతరం మహన్యాస పారాయణం, రుద్ర హోమం, నవగ్రహ హోమం శాస్త్రోక్తంగా సాగాయి. మధ్యాహ్నం చండీ పారాయణం, చండీ హోమం చేశారు. దుర్గాదేవి, సరస్వతీదేవి, గాయత్రీదేవి, మహాలక్ష్మీదేవిలకు వెయ్యి కమలాలతో అత్యంత వైభవంగా 'సహస్ర కమలార్చన' జరిపించారు. వెయ్యి మంది భక్తులతో నిర్వహించిన సామూహిక రుద్రాభిషేకం ప్రధాన ఆకర్షణగా నిలిచింది. ప్రతి భక్తుడికి మట్టి శివలింగాన్ని, ప్రత్యేక పూజా సామగ్రిని ఆలయ యాజమాన్యం అందించింది. వేదపండితుల మంత్రోచ్ఛారణల మధ్య భక్తులు భక్తిశ్రద్ధలతో రుద్రాభిషేకం నిర్వహించారు. ఉత్తర అమెరికాలో ఇంతమంది భక్తులు సామూహికంగా రుద్రాభిషేకంలో పాల్గొనడం ఇదే తొలిసారి అని నిర్వాహకులు పేర్కొన్నారు. ఏర్పాట్లను ఆలయ కమిటీ అధ్యక్షుడు గంగవరపు రజనీకాంత్, ఉపాధ్యక్షుడు సాక్షి విజయ్, కార్యదర్శి జంగా కిషోర్, కోశాధికారి పుట్టగుంట మురళీ, మీడియా విభాగ సమన్వయకర్త రాజా సూరపనేని పర్యవేక్షించారు.





# సోనమ్ వాంగ్‌చుక్ దీక్ష విరమణ

## కేంద్రమంత్రి జేపీ నడ్డాతో సీజేపీ ప్రతినిధుల చర్చలు



ప్రముఖ పర్యావరణ ఉద్యమకారుడు సోనమ్ వాంగ్‌చుక్ చేపట్టిన నిరాహార దీక్షను విరమించారు. సోమవారం కేంద్ర మంత్రి జేపీ నడ్డాతో కాక్రోచ్ జనతా పార్టీ ప్రతినిధులు సమావేశమయ్యారు. అనంతరం సోనమ్.. తన దీక్షను విరమించారు. దీంతో గత 23 రోజులుగా ఆయన చేస్తున్న దీక్ష ముగిసినట్లు అయింది. నీట్ పరీక్ష ప్రశ్నాపత్రం లీక్, విద్యావ్యవస్థలోని లోపాలు నేపథ్యంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ సోనమ్ వాంగ్‌చుక్ నిరాహార దీక్ష చేపట్టారు. జూన్ 28వ తేదీన ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ఆయన ఈ దీక్ష ప్రారంభించారు. అయితే ఢిల్లీ హైకోర్టు ఆదేశాల నేపథ్యంలో జంతర్ మంతర్ వద్ద ఆయన చేస్తున్న దీక్షను పోలీసులు భగ్నం చేశారు. అనంతరం ఆయన్ని సఫ్దర్ జంగ్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ కూడా ఆయన తన దీక్షను కొనసాగించారు. సోనమ్ ఆరోగ్యం నిలకడగా ఉందని ఆయన ఆరోగ్య పరిస్థితిపై ఆసుపత్రి వైద్యులు ఆదివారం హెల్త్ బులెటిన్ విడుదల చేశారు. కాక్రోచ్ పార్టీ జులై 20వ తేదీన చేపట్టిన చలో పార్లమెంట్ యాత్రకు కూడా ఆయన మద్దతు ప్రకటించిన విషయం విదితమే.

నీట్, ఇతర పరీక్షల నిర్వహణలో చోటుచేసుకున్న అవకతవకలపై కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తున్న కాక్రోచ్ జనతా పారీ ప్రతినిధులు కేంద్ర మంత్రి జేపీ నడ్డాను కలిశారు. ఈ మేరకు పలు డిమాండ్లతో కూడిన ఓ లేఖను ఆయనకు అందజేశారు. సీజేపీ అధికార ప్రతినిధులు సౌరవ్ దాస్, ఆశుతోష్ రంకా సుమారు పది నిమిషాల పాటు నడ్డాతో భేటీ అయ్యారు. వారి డిమాండ్లను పరిశీలించి, ప్రభుత్వంలోని సంబంధిత స్థాయిలో చర్చిస్తానని నడ్డా హామీ ఇచ్చారని సౌరవ్ దాస్ తెలిపారు. అయితే ఇప్పటివరకు ఎలాంటి స్పష్టమైన హామీలు లభించలేదని, డిమాండ్లు నెరవేరే వరకు శాంతియుత నిరసనలు కొనసాగిస్తామని వెల్లడించారు. జేపీ నడ్డాకు సమర్పించిన లేఖలో కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌పై సీజేపీ తీవ్ర విమర్శలు చేసింది. నీట్ యూజీ 2026 ప్రశ్నపత్రం లీకేజీ సహా ఇతర పరీక్షల నిర్వహణలో తలెత్తిన లోపాలకు మంత్రి బాధ్యత వహించాలని పేర్కొంది. సీబీఎస్ఈ 12వ తరగతి పోర్టల్ సమస్యలు, సీయూఈటీ పరీక్షల్లో జాప్యం వంటి పరిణామాలు వంటివి కూడా వైఫల్యాలేనని ఆరోపించింది. పరీక్షల వ్యవస్థలో అవసరమైన సంస్కరణలు చేపట్టడంలో ధర్మేంద్ర ప్రధాన్ విఫలమయ్యారని సీజేపీ పేర్కొంది.





# జిప్‌లైన్ ప్రమాదంలో జారిపడిన పర్యాటకుడు

## తీవ్ర గాయాలతో ఆసుపత్రి పాలు ... యాజమాన్యంపై తీవ్ర విమర్శలు

కర్ణాటకలోని దండేలీలో జిప్‌లైన్ ప్రమాదం చోటుచేసుకుంది. జిప్‌లైన్ రైడ్ చేస్తుండగా సేఫ్టీ లాక్ ఊడిపోవటంతో ఓ పర్యాటకుడు 40 అడుగుల ఎత్తునుంచి కిందపడిపోయాడు. దీంతో అతడికి తీవ్రగాయాలు అయ్యాయి. ఈ సంఘటనకు సంబంధించిన పూర్తి వివరాల్లోకి వెళితే.. విజయపురకు చెందిన కుబేర్ సుర్పూర్ అనే వ్యక్తి తన ఫ్యామిలీతో కలిసి పర్యటన నిమిత్తం దండేలీ రిసార్ట్‌కు వెళ్లాడు. అతడు జిప్‌లైన్ రైడ్ చేస్తుండగా.. జిప్‌లైన్ సేఫ్టీ లాక్ ఊడిపోయింది. దీంతో అతడు 40 అడుగుల ఎత్తునుంచి కిందపడిపోయాడు. కాళ్లు, చేతులు విరిగిపోయాయి. కుటుంబసభ్యులు హుటాహుటిన అతడిని దండేలీ గవర్నమెంట్ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం అక్కడినుంచి మిరాజ్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. రిసార్ట్ యాజమాన్యం నిర్లక్ష్యం కారణంగానే ఈ ప్రమాదం జరిగిందని కుబేర్ కుటుంబసభ్యులు ఆరోపిస్తున్నారు. జిప్‌లైన్ పరికరాల నిర్వహణ సరిగా లేదని, ఆ పరికరాలు తుప్పుపట్టిపోయి ఉన్నాయని అంటున్నారు. జిప్‌లైన్ పరికరాలు సరైన స్థితిలో ఉండి ఉంటే ఈ ప్రమాదం జరిగేది కాదని చెబుతున్నారు. ఈ ప్రమాదంపై రిసార్ట్ యాజమాన్యం పూర్తి స్థాయి బాధ్యత వహించాలని డిమాండ్ చేస్తున్నారు. ఇక, ఈ సంఘటనకు సంబంధించిన దృశ్యాలను ఓ వ్యక్తి తన మొబైల్ ఫోన్‌లో వీడియో తీశాడు. ఆ వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఆ వీడియోపై స్పందిస్తున్న నెటిజన్లు.. రిసార్ట్ యాజమాన్యంపై తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బాధితుడికి న్యాయం జరగాలని డిమాండ్ చేస్తున్నారు.

## అనుమానాస్పద స్థితిలో

# కేరళ డీజీపీ ధన్‌కడ్ మృతి



త్రిపుర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డీజీపీ) అనురాగ్ ధన్‌ఖడ్ అనుమానాస్పద స్థితిలో మృతి చెందారు. పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో విగతజీవిగా పడి ఉన్న ఆయనను సోమవారం పోలీసులు గుర్తించారు. అనురాగ్ ఆత్మహత్య చేసుకుని చనిపోయి ఉండొచ్చని వారు అనుమానిస్తున్నారు. పోలీసుల ప్రాథమిక దర్యాప్తు వివరాల మేరకు.. సోమవారం మధ్యాహ్నం 12 గంటల ప్రాంతంలో ఆఫీస్ ఛాంబర్‌లో విగతజీవిగా పడి ఉన్న అనురాగ్‌ను పోలీసులు గుర్తించారు. ఆయనను గోవింద్ భల్లబ్ పంత్ ఆస్పత్రికి తరలించగా.. అప్పటికే చనిపోయినట్లు డాక్టర్లు ధ్రువీకరించారు. అనురాగ్ మరణానికి గల సరైన కారణాలు ఇంకా తెలియరాలేదు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. కాగా, అనురాగ్ ధన్‌ఖడ్ 1994 బ్యాచ్‌కు చెందిన త్రిపుర క్యాడెర్ ఐపీఎస్. 2025 మే నెలలో త్రిపుర డీజీపీగా బాధ్యతలు చేపట్టారు. అంతకు ముందు త్రిపురలో డైరెక్టర్ జనరల్(ఇంటెలిజెన్స్)గా పని చేశారు. ఆయన సీబీఐలో కూడా విశేషమైన సేవలు అందించారు.

# కోర్టులు రాజకీయ వేదికలు కాదు



అయోధ్య రామమందిర నిధుల దుర్వినియోగం కేసుపై సుప్రీం కోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. ఆలయ విరాళాలు దారిమళ్లాయనే ఆరోపణలకు సంబంధించి దాఖలైన పిటిషన్లను సుప్రీంకోర్టు సోమవారం విచారించింది. ఈ కేసును స్థానిక పోలీసుల ద్వారా కాకుండా సీనియర్ అధికారులతో కూడిన ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్) ద్వారా విచారణ జరిపే అంశాన్ని పరిశీలించాలని కేంద్ర ప్రభుత్వానికి సూచించింది. విచారణ సందర్భంగా సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా దర్యాప్తు పురోగతిపై స్టేటస్ రిపోర్టును ధర్మాసనానికి సమర్పించారు. ఈ కేసులో ఇప్పటివరకు 8 మందిని అరెస్ట్ చేసినట్లు కేంద్రం న్యాయస్థానానికి తెలిపింది. ఎస్ఐటీ ఏర్పాటుపై ప్రభుత్వం నుంచి స్పష్టమైన ఆదేశాలు స్వీకరించి కోర్టుకు తెలియజేస్తామని ఎస్‌జీ వెల్లడించారు. ఈ సందర్భంగా సీజేఐ నేతృత్వంలోని ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. ఈ వ్యవహారాన్ని రాజకీయ కోణంలో చూడవద్దని పిటిషనర్లను హెచ్చరించింది. కోర్టులు రాజకీయ వేదికలు కావన్న ధర్మాసనం.. ఈ ఆరోపణలపై నిష్పాక్షికంగా, సమగ్రంగా దర్యాప్తు జరగడమే ప్రధాన లక్ష్యమని స్పష్టం చేసింది. పిటిషనర్ల తరఫు న్యాయవాదులు భక్తులు సమర్పించిన కానుకలు, విరాళాలకు సంబంధించిన అన్ని రికార్డులను భద్రపరచాలని కోర్టును కోరారు. అలాగే విరాళాలకు సంబంధించిన రసీదులను ప్రత్యేక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచేలా ఆదేశాలివ్వాలని విజ్ఞప్తి చేశారు. ఈ అంశాలన్నింటినీ పరిగణనలోకి తీసుకున్న న్యాయస్థానం తదుపరి విచారణను ఈ నెల 27కు వాయిదా వేసింది.



# అయోధ్య రాముడి కానుకల లెక్కింపునకు కొత్త వ్యవస్థ

## ఎస్బీఐ పర్యవేక్షణలో డిజిటల్ యంత్రాల వినియోగం

అయోధ్య రామమందిరానికి భక్తుల నుంచి అందుతున్న విరాళాల లెక్కింపు ప్రక్రియను మరింత పారదర్శకంగా, వేగవంతంగా నిర్వహించేందుకు శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ ఒక కీలక నిర్ణయం తీసుకుంది. ఇకపై ఆలయ విరాళాల (కానుకల) లెక్కింపు బాధ్యతలను దేశంలోనే అతిపెద్ద ప్రభుత్వ రంగ బ్యాంక్ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా పర్యవేక్షించనుంది. భక్తుల రద్దీ విపరీతంగా పెరగడం, అందుకు అనుగుణంగా కానుకల రూపంలో వస్తున్న నగదు, బంగారు, వెండి కానుకలను ఎప్పటికప్పుడు లెక్కించడం ట్రస్ట్ సిబ్బందికి పెద్ద సవాలుగా మారింది. ఈ నేపథ్యంలోనే ఈ కీలక మార్పులు చేపట్టారు.

**ఎస్బీఐ పర్యవేక్షణ:** విరాళాల లెక్కింపు మొత్తం నిపుణులైన ఎస్‌బీఐ బ్యాంక్ సిబ్బంది సమక్షంలో, పూర్తి భద్రత నడుమ జరుగుతుంది. పెరిగిపోతున్న కానుకల నిల్వలను దృష్టిలో ఉంచుకుని, రోజుకు 12 గంటల పాటు లెక్కింపు ప్రక్రియను కొనసాగించనున్నారు. ఈ 12 గంటల లెక్కింపు నిరంతరాయంగా సాగేందుకు వీలుగా సిబ్బందిని రెండు షిఫ్టులుగా విభజించారు. బాలరాముడి దర్శనం కోసం దేశ విదేశాల నుంచి ప్రతిరోజూ లక్షలాది మంది భక్తులు అయోధ్యకు పోటెత్తుతున్నారు. కానుకల పెట్టెలు (హుండీలు) అతి తక్కువ సమయంలోనే నిండిపోతుండటంతో, సాంప్రదాయ పద్ధతిలో లెక్కింపు ఆలస్యమవుతోంది. ట్రస్ట్ వర్గాల సమాచారం ప్రకారం ఈ కొత్త వ్యవస్థ ద్వారా లెక్కింపు ప్రక్రియలో ఎలాంటి లోపాలకు తావులేకుండా, అత్యంత వేగంగా, పారదర్శకంగా నగదును బ్యాంక్ ఖాతాల్లో జమ చేయడానికి వీలవుతుంది. డిజిటల్ లెక్కింపు యంత్రాలను కూడా ఇందుకోసం పెద్ద ఎత్తున వినియోగించనున్నారు.

# ఇరాన్‌పై అమెరికా భీకర వైమానిక దాడులు



- చాలా తీవ్రంగా దాడి చేశాం: ట్రంప్
- హర్మూజ్‌లో రెండు నౌకల్లో పేలుళ్లు, తామే చేశామన్న ఇరాన్
- చుక్క చమురు కూడా జలసంధి దాటబోదని హెచ్చరిక

అమెరికా–ఇరాన్ మధ్య ఘర్షణలు మరోసారి తీవ్రరూపం దాలుస్తున్నాయి. సోమవారం తెల్లవారుజామున అగ్రరాజ్యం మరోసారి దాడులు చేపట్టింది. తమ సైనికుల మరణాలకు ప్రతీకారం తీర్చుకున్నామని, శక్తిమంతమైన దాడులు చేశామని అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేర్కొన్నారు. వంతెనలు, ఇతర మౌలిక సదుపాయాలు ధ్వంసం చేశామన్నారు. అమెరికా సెంట్రల్ కమాండ్ సోమవారం తెల్లవారుజామున ఇరాన్‌పై వైమానిక దాడులు చేపట్టింది. జులై 18న ఉత్తర ఇరాక్‌లో కూల్చివేసిన ఇరాన్ డ్రోన్‌కు చెందిన పేలుడు పదార్థాలను అమెరికా సైనికులు నిర్వీర్యం చేస్తున్నారని.. ఆ సమయంలో పేలుడు సంభవించి ఓ సైనికుడు మృతిచెందగా, మరొకరు స్వల్పంగా గాయపడ్డారని తెలిపింది. ఈ నేపథ్యంలోనే తాజాగా ప్రతీకార దాడులు చేపట్టినట్లు వెల్లడించింది. ఈ విషయాన్ని సోషల్ మీడియా వేదిక ఎక్స్‌లో పోస్ట్ చేసింది.

అమెరికా తూర్పు కాలమానం ప్రకారం ఆదివారం సాయంత్రం 7 గంటలకు ఈ కొత్త దాడులు ప్రారంభమైనట్లు తెలిపింది. వరుసగా తొమ్మిదో రోజు దాడులు నిర్వహించినట్లు వెల్లడించింది. హర్మూజ్ జలసంధి గుండా ప్రయాణిస్తున్న వాణిజ్య నౌకలు, పౌర నావికులపై దాడులకు వినియోగిస్తున్న ఇరాన్ సైనిక సామర్థ్యాలను బలహీన పరచడమే ఈ ఆపరేషన్ లక్ష్యమని పేర్కొంది.

### చాలా తీవ్రంగా దాడి చేశాం: ట్రంప్

ఇరాన్‌పై చేసిన తాజా దాడులపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్పందించారు. ఇటీవల ప్రాణాలు కోల్పోయిన అమెరికా సైనికుల గౌరవార్థమే ఈ దాడులు నిర్వహించామని ఆయన తెలిపారు.'ఈరోజు రాత్రి ఇరాన్‌పై చాలా తీవ్రంగా దాడి చేశాం. దేశం కోసం ప్రాణత్యాగం చేసిన గొప్ప దేశభక్తుల గౌరవార్థమే ఈ చర్యలు చేపట్టాం' అని ట్రంప్ పేర్కొన్నారు. ఇరాన్ అణ్వాయుధాలను పొందకుండా అడ్డుకోవడానికే అమెరికా సైనికులు పోరాడుతున్నారని ఆయన చెప్పారు.

### నౌకల్లో పేలుళ్లు

అదే సమయంలో తమ హెచ్చరికలను ఖాతరు చేయకుండా హర్మూజ్ జలసంధి మీదుగా వెళ్తున్న రెండు నౌకలను లక్ష్యంగా చేసుకుని ఇరాన్‌కు చెందిన ఐఆర్‌జీసీ దాడి చేసింది. ఆ నౌకల్లో పేలుడు సంభవించిందని, అవి కదల్లేని స్థితిలో ఉన్నాయని వెల్లడించింది. అమెరికా దురాక్రమణ కొనసాగుతున్నంత కాలం ఒక్క చుక్క చమురు కూడా సురక్షితంగా హర్మూజ్‌ను దాటదని ఐఆర్జీసీ ఈ సందర్భంగా హెచ్చరించింది. ప్రతీకార చర్యలకు సిద్ధంగా ఉండాలని అమెరికాను ఉద్దేశించి వ్యాఖ్యలు చేసింది. కాగా, అమెరికా దాడుల సమయంలోనే ఒమన్ తీరంలోని హర్మూజ్ జలసంధిలో ఓ నౌకలో మంటలు చెలరేగినట్లు బ్రిటిష్ సైన్యం వెల్లడించింది. అగ్నిప్రమాదానికి కారణాలపై ఇంకా స్పష్టత రాలేదని పేర్కొంది. ఈ ఘర్షణల్లో ఇప్పటివరకు అమెరికా వైపు ప్రాణనష్టం 17కు పెరిగింది. ఇదిలా ఉండగా.. పశ్చిమాసియా దద్దరిల్లుతుండటంతో చమురు ధరలు మళ్లీ భగ్గుమంటున్నాయి. సోమవారం బ్రెంట్ క్రూడ్ ఒక బ్యారెల్ ధర 90 డాలర్లకు చేరింది.

### ఇరాన్ ప్రతీకార దాడులు..

మరోవైపు అమెరికా చర్యలకు ప్రతిగా ఇరాన్ కూడా దాడులు కొనసాగిస్తోంది. మధ్యప్రాచ్యంలో అమెరికా మిత్రదేశాలైన బహ్రెయిన్, జోర్డాన్, కువైట్ వైపు ఇరాన్ క్షిపణులు, డ్రోన్లను ప్రయోగించినట్లు తెలుస్తోంది. దీంతో ఆయా దేశాలు తమ వైమానిక రక్షణ వ్యవస్థలను మళ్లీ అప్రమత్తం చేశాయి. ఇరాన్ పశ్చిమ ప్రాంతంలోని లోరెస్తాన్ ప్రావిన్స్ నుంచి శత్రు లక్ష్యాలపై మరో విడత క్షిపణులను ప్రయోగించినట్లు ఆ దేశ అధికారిక వార్తా సంస్థ తెలిపింది. కువైట్లోని అల్ సుబియా పవర్ జనరేషన్, వాటర్ డీసాలినేషన్ ప్లాంట్పై టెహ్రాన్ దాడులు చేసింది. దాంతో భారీగా మంటలు చెలరేగాయి. దీనికి సంబంధించిన దృశ్యాలు వైరల్ అవుతున్నాయి.

### బహ్రెయిన్‌కు అమెరికా హెచ్చరిక..

బహ్రెయిన్ రాజధాని మనామా మధ్య ప్రాంతంలోని కొన్ని ప్రాంతాలను ఇరాన్ లక్ష్యంగా చేసుకునే అవకాశం ఉందని అమెరికా రాయబార కార్యాలయం హెచ్చరిక జారీ చేసింది. అయితే ముప్పు ఉన్న ప్రాంతాల వివరాలను వెల్లడించలేదు. ఇదిలా ఉండగా, జోర్డాన్ వైపు ఇరాన్ ప్రయోగించిన క్షిపణుల శకలాలు ఇజ్రాయెల్ భూభాగంలో పడే అవకాశం ఉందని, వాటి కారణంగా అగ్నిప్రమాదాలు సంభవించే ప్రమాదం ఉందని ఇజ్రాయెల్ తమ ప్రజలను హెచ్చరించింది.

# భూతల దాడికి దిగితే తీవ్ర పరిణామాలు

## - ట్రంప్ ప్రకటనపై ఇరాన్ ఘాటైన స్పందన

అమెరికా–ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు అంతకంతకూ పెరుగుతూనే ఉన్నాయి. ఇరాన్‌పై దాడుల్ని మరింత తీవ్రం చేస్తామని అగ్రరాజ్య అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇటీవల చేసిన వ్యాఖ్యలపై ఇరాన్ ఘాటుగా స్పందించింది. ఇరాన్ చమురు నిల్వలకు కీలక ప్రాంతమైన ఖార్గ్ ద్వీపాన్ని స్వాధీనం చేసుకునేందుకు అమెరికా చేసే ఏ సాహసానికైనా తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించింది. ఆ దేశ సైన్యం ఎలాంటి భూతల దండయాత్ర చేసినా.. ఎదుర్కొనేందుకు తాము సిద్ధంగా ఉన్నామని ఇరాన్ విదేశాంగ ప్రతినిధి ఇస్మాయిల్ బఘేయి హెచ్చరించారు. ఇరాన్ తీరానికి 55 కి.మీ. దూరంలో బుషెహర్ ప్రావిన్స్‌లో ఉన్న ఖార్గ్.. ఇరాన్ చమురు పరిశ్రమకు అత్యంత ప్రధానమైంది. ఆ దేశ చమురు ఎగుమతుల్లో సుమారు 90 శాతం ఈ ద్వీపమే నిర్వహిస్తోంది.

కాగా.. అమెరికాతో కుదిరిన మధ్యంతర ఒప్పందంపై ఇరాన్ వైఖరిని బఘేయి పునరుద్ఘాటించారు. దానిపై పూర్తి స్పష్టత ఉందని, అందులోని 14 నిబంధనలపై ఎలాంటి సందేహమూ అక్కర్లేదని ఆయన చెప్పుకొచ్చారు. హర్మూజ్ జలసంధి భవిష్యత్తు నిర్వహణ బాధ్యత ఇరాన్‌పైనే ఉంటుందని మేం మొదట్నుంచీ చెబుతూనే ఉన్నాం. అదే విషయాన్ని ఒమన్‌తో సంప్రదింపులు, ప్రాంతీయ దేశాలతో చర్చల ద్వారా ముందుకు తీసుకువెళ్తాం. దౌత్యపరమైన కట్టుబాట్ల నుంచి వాషింగ్టన్ వైదొలగకూడదు. ఈ ఒప్పందం పూర్తి స్పష్టంగా ఉంది. దీనిని ఉల్లంఘించేందుకు అమెరికాకు ఎలాంటి సహేతుక కారణాలూ లేవని బఘేయి చెప్పారు.



అమెరికా అధ్యక్షుడు ట్రంప్.. ఖార్గ్ ద్వీపాన్ని స్వాధీనం చేసుకునే ప్రయత్నంతో పాటు సైనిక చర్యలను ముమ్మరం చేయడం గురించి పదేపదే ప్రస్తావించారు. ఒకవేళ ఖార్గ్‌ను యూఎస్ స్వాధీనం చేసుకుంటే.. ఇరాన్ చమురు ఎగుమతులకు కీలకమైన ఆ ప్రదేశంపై అమెరికా సైన్యం నియంత్రణ సాధించి, ఇరాన్ ఆర్థిక వ్యవస్థపై ఒత్తిడి తెచ్చినట్టువుతుంది. అయితే.. ఖార్గ్‌ను స్వాధీనం చేసుకోవడం, ఆక్రమించుకోవడం వల్ల అమెరికాకు తీవ్ర నష్టం వాటిల్లే అవకాశముందని నిపుణులు భావిస్తున్నారు. ఖర్గ్ ద్వీపాన్ని స్వాధీనం చేసుకునే సైనిక సామర్థ్యం అమెరికాకు ఉన్నప్పటికీ.. దాన్ని ఎక్కువ రోజులు ఆధీనంలో ఉంచుకోవడం అంత సులభం కాదని భద్రతా నిపుణులు చెబుతున్నారు. ఒక వేళ ఆక్రమణకు దిగితే ఇరాన్ క్షిపణులు, డ్రోన్ల దాడులకు పాల్పడే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు.



## అమెరికా ఉపాధ్యక్షుడి ఇంట ఆనందం

### నాలుగో బిడ్డకు జన్మనిచ్చిన ఉషా వాన్స్

అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ శుభవార్త పంచుకున్నారు. ఆయన సతీమణి ఉషా వాన్స్ ఆదివారం ఉదయం (అమెరికా కాలమానం ప్రకారం) పండంటి మగబిడ్డకు జన్మనిచ్చినట్లు తెలిపారు.అతనికి అలెక్ నీల్ వాన్స్ అని పేరు పెట్టామని చెప్పారు. తల్లి,బిడ్డ ఇద్దరూ ఆరోగ్యంగా ఉన్నారంటూ జేడీ వాన్స్ తన ప్రకటనలో పేర్కొన్నారు. తమ ముగ్గురు పిల్లలు తమ్ముడిని చూసి ఎంతో సంతోషిస్తున్నారని తెలిపారు.

2014లో ఉష,జేడీ వాన్స్ వివాహం చేసుకున్నారు. వీరికి ఇప్పటికే ఇద్దరు కుమారులు – ఇవాన్ (9ఏళ్లు), వివేక్ (6ఏళ్లు), కుమార్తె మిరాబెల్ (4ఏళ్లు) ఉన్నారు. ఇప్పుడునాలుగో సంతానానికి జన్మనిచ్చారు.ఉషా వాన్స్ తెలుగు మూలాలున్న వ్యక్తి అన్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే తమ చిన్న కుమారుడి పేరులో 'నీల్' అని చేర్చడం ఆసక్తికరంగా మారింది.

కాగా.. పదవిలో ఉండగా అమెరికా ఉపాధ్యక్షుడి కుటుంబంలో చిన్నారి జన్మించడం 156 ఏళ్ల తర్వాత ఇదే తొలిసారి. అంతకుముందు 1870లో నాటి ఉపాధ్యక్షుడు స్కైలర్ కోల్ఫాక్స్ పదవిలో ఉండగా.. ఆయన భార్య ఎల్లెన్ మగ బిడ్డకు జన్మనిచ్చారు.

41ఏళ్ల వాన్స్ అమెరికా చరిత్రలో మూడో అత్యంత పిన్న వయస్కుడైన ఉపాధ్యక్షుడిగాబాధ్యతలు చేపట్టారు. అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వంలో కీలక నాయకుడిగా కొనసాగుతున్నారు.

## కాంగోలో ఆందోళనకరంగా ఎబోలా




మధ్య ఆఫ్రికా దేశం కాంగోలో ఎబోలా వైరస్ ఆందోళనకర పరిస్థితులు సృష్టిస్తోంది. వేగంగా వ్యాప్తి చెందుతున్న ఈ వైరస్ దెబ్బకు గత రెండు నెలల్లో దేశ వ్యాప్తంగా 2,344కేసులు నమోదు కాగా..దాదాపు 930మంది ప్రాణాలు కోల్పోయినట్లు ఆ దేశ ఆరోగ్య శాఖ తాజాగా వెల్లడించింది. శుక్రవారం నుంచి 24 గంటలవ్యవధిలో 37మరణాలు నమోదైనట్లు తెలిపింది. ప్రస్తుతం కాంగోలో నమోదవుతున్న కేసులన్నీ బుండిబుగ్యో ఎబోలా రకానివే.ఈతరహా కేసులు నమోదవుతున్నట్లు మే 15న అక్కడి ప్రభుత్వం ప్రకటించింది. ఈ వైరస్‌ను అరికట్టేందుకు ప్రస్తుతం వ్యాక్సిన్‌గానీ, చికిత్సగానీ అందుబాటులో లేవు.

సాధారణంగా ఎబోలా వైరస్ జంతువులు, గబ్బిలాలకు సోకుతుంది. అది సోకిన జంతువులను వేటాడి వాటి మాంసం తినడం వల్ల మనుషులకు వ్యాపిస్తుంది. ఈ వ్యాధి లక్షణాలు కనిపించడానికి 21రోజులు పడుతుంది. ఫ్లూ,మలేరియా,జ్వరం వంటి లక్షణాలు తొలుత కనిపించినా..చివరకు అవయవాల వైఫల్యానికి దారితీసే ప్రమాదం ఉంది. కొన్ని కేసుల్లో శరీరం లోపలా, బయటా రక్తస్రావం అవుతుంటుంది.వైరస్ సోకిన వ్యక్తి శరీర ద్రవాల ద్వారా ఇది ఇతరులకూ వ్యాపిస్తుంది.

## పెరూలో భూకంపం

# ఆరుగురు మృతి

పెరూలోని ఆండిస్ ప్రాంతంలో 5.5 తీవ్రతతో భూకంపం సంభవించింది. స్థానిక కాలమానం ప్రకారం శనివారం రాత్రి 9.24గంటలకు హువాంకాయో ప్రావిన్సులోని సికాయా నగరానికి 2 కిలోమీటర్ల దూరంలో భూకంప కేంద్రాన్ని గుర్తించారు. భూ ఉపరితలం నుంచి 10కిలోమీటర్ల లోతులో భూకంపం సంభవించినట్లు అమెరికా జియోలాజికల్ సర్వే వెల్లడించింది. స్థానికంగా ఓ చర్చి,కాన్వెంట్‌తోపాటు పలు ఇళ్లు ధ్వంసమయ్యాయని అధికారులు తెలిపారు. ఈ ఘటనలో ఆరుగురు ప్రాణాలు కోల్పోగామరో 20మంది గాయపడినట్లు పేర్కొన్నారు. దాదాపు 300మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించినట్లు పేర్కొన్నారు.





# అద్భుతంగా ఆడారు!

## ఫిఫా వరల్డ్‌కప్ విజేత స్పెయిన్‌కు ప్రశంసలు - ఫైనల్లో అర్జెంటీనాపై 1-0తో విజయం

ఫిఫా ప్రపంచకప్‌ను కైవసం చేసుకున్న స్పెయిన్ జట్టుపై ప్రపంచవ్యాప్తంగా ప్రశంసలు వెల్లువెత్తాయి. రాజకీయ, క్రీడా, కార్పొరేట్ రంగాలకు చెందిన పలువురు ప్రముఖులు సామాజిక మాధ్యమాల వేదికగా ఈ జట్టుకు శుభాకాంక్షలు తెలిపారు. టోర్నీ మొత్తం అద్భుతంగా ఆడారని అభినందించారు.

ప్రతిష్ఠాత్మక ఫుట్‌బాల్ ప్రపంచకప్‌లో ఆద్యంతం నిలకడగా ఆడిన జట్టే విజేతగా నిలిచింది. వరుసగా రెండో కప్పు గెలవాలన్న అర్జెంటీనా ఆశలకు గండికొడుతూ.. తమ ఖాతాలో రెండో ట్రోఫీని జమ చేసుకుంది స్పెయిన్. భారత కాలమానం ప్రకారం సోమవారం తెల్లవారుజామున 3.30 గంటలకు ముగిసిన ఫిఫా వరల్డ్‌కప్ ఫైనల్లో స్పెయిన్ 1-0తో అర్జెంటీనాను ఓడించింది. నిర్ణీత 90 నిమిషాల్లో ఇరు జట్లు గోల్ కొట్టకపోవడంతో మ్యాచ్ అదనపు సమయానికి మళ్లగా.. 106వ నిమిషంలో ఫెరాన్ టోరెస్ అద్భుత గోల్‌తో స్పెయిన్‌కు చిరస్మరణీయ విజయాన్నందించాడు. పెడ్రో పోరో క్రాస్‌ను నికో విలియమ్స్ తలతో టోరెస్ వైపు మళ్లించగా.. అతను అర్జెంటీనా గోల్‌కీపర్ ఎమిలియానో మార్టినెజ్‌కు అందకుండా నెట్లోకి బంతిని పంపించి స్పెయిన్‌ను సంబరాల్లో ముంచెత్తాడు. సెమీస్ లో ఫ్రాన్స్ లాంటి మేటి జట్టును మట్టికరిపించిన స్పెయిన్.. ఫైనల్లోనూ పక్కా ప్రణాళికలతో ఆడి విజయం సాధించింది.

ఈసారి టోర్నీ మొత్తంలో ప్రత్యర్థులకు స్పెయిన్ ఒకే ఒక్క గోల్ ఇవ్వడం విశేషం. ఆ జట్టు ఇంతకుముందు 2010లో ప్రపంచకప్ గెలిచింది. అర్జెంటీనా మూడుసార్లు (1978, 1986, 2022) విజేతగా నిలిచింది. న్యూయార్క్-న్యూజెర్సీ స్టేడియంలో జరిగిన ప్రపంచకప్ ఫైనల్‌కు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఆయన సతీమణి మెలానియా, ఫిఫా అధ్యక్షుడు గియాని ఇన్ఫాంటినో, హాలీవుడ్ సూపర్ స్టార్ టామ్ క్రూజ్ సహా ఎంతోమంది ప్రముఖులు హాజరయ్యారు.

ఈ విజయంపై స్పెయిన్ ప్రధాని పెడ్రో సాంచెజ్ ఆనందం వ్యక్తం చేశారు. మనం ఇప్పుడు ప్రపంచ ఛాంపియన్లం. కలను నిజం చేసిన మా జట్టుకు కృతజ్ఞతలు అంటూ ప్రశంసలు కురిపించాడు. గూగుల్ సీఈఓ సుందర్ పిచాయ్ కూడా స్పెయిన్ విజయంపై హర్షం వ్యక్తం చేశారు. అద్భుతమైన ప్రదర్శనతో స్పెయిన్ ఈసారి ప్రపంచకప్‌ను ఇంటికి తీసుకెళ్లింది. ఈ విజయాన్ని వీరు అన్ని విధాలా అర్హులు. టోర్నీ ఆసాంతం సమష్టిగా రాణించారు. ఫైనల్ వరకూ చేరుకున్న అర్జెంటీనా, మెస్సీకి అభినందనలు. ఈ ప్రపంచకప్‌ను గుర్తుండిపోయేలా చేసిన అన్ని జట్లకు శుభాకాంక్షలు తెలియజేస్తున్నానన్నారు. ఇక, యాపిల్ సీఈఓ టిమ్ కుక్ స్పందిస్తూ.. అద్భుతమైన ఫైనల్ మ్యాచ్.. స్పెయిన్‌కు అభినందనలు.. ఇక 2030 కోసం ఎదురుచూస్తున్నా అన్నారు. స్పెయిన్‌కే చెందిన టెన్నిస్ దిగ్గజం రఫెల్ నాదల్ ఆ విజయంపై హర్షం వ్యక్తం చేశారు. ఎంతో గర్వంగా ఉంది.. ఛాంపియన్లకు అభినందనలు అంటూ పోస్ట్ పెట్టారు.

# స్పెయిన్ కెప్టెన్ రోడ్రీకి 'గోల్డెన్ బాల్'



ఫిఫా ప్రపంచ కప్-2026లో టీమ్‌గానే కాకుండా వ్యక్తిగత ప్రదర్శనలోనూ స్పెయిన్ ఆటగాళ్లు సత్తాచాటారు. ఫైనల్లో అర్జెంటీనాపై 1-0తో విజయం సాధించి రెండోసారి ప్రపంచకప్‌ను కైవసం చేసుకున్న స్పెయిన్.. గోల్డెన్ బాల్, గోల్డెన్ గ్లోవ్ సహా బెస్ట్ యంగ్ ప్లేయర్ అవార్డునూ సొంతం చేసుకుంది.

టోర్నీ ఆద్యంతం అద్భుతమైన ఆటతీరుతో జట్టును ముందుండి నడిపించిన స్పెయిన్ మిడ్‌ఫీల్డర్ రోడ్రీకి అత్యుత్తమ ఆటగాడికి దక్కే గోల్డెన్ బాల్ పురస్కారం లభించింది. ఫైనల్ సహా ప్రతి మ్యాచ్‌లోనూ జట్టు విజయాల్లో కీలకపాత్ర పోషించినందుకు గానూ ఈ గౌరవాన్ని అందుకున్నాడు రోడ్రీ. ఫుట్‌బాల్ మ్యాచ్‌లో విజయం దక్కాలంటే డిఫెండర్ల సహకారం.. మిడ్‌ఫీల్డర్ల దూకుడు.. ఫార్వార్డ్ ప్లేయర్ల వేగం అవసరం. వీటన్నింటిని సమన్వయం చేసుకుంటూ ఆడితే కప్ గెలవచ్చని నిరూపించాడు రోడ్రీ. తన కెప్టెన్సీలో స్పెయిన్‌కు కప్పు అందించిన 'గోల్డెన్ బాల్' విజేత అతడు. సహచర ఆటగాళ్లకు పాసులను అందించడం.. గోల్స్ కొట్టేలా అవకాశాలు కల్పించే విషయంలో రోడ్రీ ప్రపంచంలోనే అత్యుత్తమ మిడ్‌ఫీల్డర్. ఈ ప్రపంచం కప్‌లో అతడు 747 పాసులను అందించాడు. అతడి సక్సెస్ రేటు 90 శాతం. తీవ్ర ఒత్తిడి సమయంలోనూ బంతిని పాస్ చేయడంలో నేర్పరి.

ఫిఫా ప్రపంచ కప్లో ఎక్కువగా గోల్డెన్ బూట్ గురించే చర్చ జరగుతుంది. కానీ, గోల్డెన్ బాల్ కూడా అత్యంత విలువైందే. ఎక్కువ గోల్స్ చేసిన ప్లేయర్లకు ఇచ్చేది గోల్డెన్ బూట్. కానీ, గోల్డెన్ బాల్‌ను అత్యుత్తమ ప్లేయర్‌కు ఇస్తారు. క్రికెట్లో ప్లేయర్ ఆఫ్ ది టోర్నీ కి ఇచ్చినట్లు.. ఇక్కడ టోర్నీ మొత్తం ఉత్తమ ఆటను ప్రదర్శిస్తే ఈ బంగారు బంతిని అందజేస్తారు. ఈ ఏడాది ఎంబాపె. మెస్సీని దాటి రోడ్రీ ఈ 'గోల్డెన్ బాల్‌ను సొంతం చేసుకున్నాడు.

స్పెయిన్ గోల్ కీపర్ ఉనై సైమన్ గోల్డెన్ గ్లోవ్ అవార్డును దక్కించుకున్నాడు. 8 మ్యాచ్‌ల్లో 7 క్లీన్ షీట్లు సాధించిన అతడు.. టోర్నీలో ఒకే ఒక్క గోల్ ఇచ్చి, స్పెయిన్ పటిష్ఠ డిఫెన్స్‌కు వెన్నెముకలా నిలిచాడు. వరుసగా 650 నిమిషాల పాటు గోల్ సమర్పించకుండా ప్రపంచ కప్‌లో సరికొత్త రికార్డును కూడా నెలకొల్పాడు సైమన్. ఇక అదే జట్టుకు చెందిన యంగ్ డిఫెండర్ పౌ కుబార్సీ ఫిఫా బెస్ట్ యంగ్ ప్లేయర్ అవార్డును అందుకున్నాడు. 19ఏళ్ల ఈ యువ ఆటగాడు తన నిలకడైన ప్రదర్శనతో టోర్నీలో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నాడు.



## ఎంబాపే.. గోల్డెన్ బూట్

ఫిఫా ప్రపంచ కప్-2026లో అత్యధిక గోల్స్ చేసిన ఫ్రాన్స్ స్టార్, కెప్టెన్ కిలియన్ ఎంబాపే (8 మ్యాచ్‌ల్లో 10 గోల్స్) గోల్డెన్ బూట్ అవార్డును గెలుచుకున్నాడు. వరుసగా రెండు ప్రపంచకప్‌ల్లోనూ గోల్డెన్ బూట్ అందుకున్న తొలి ఆటగాడిగా చరిత్ర సృష్టించిన ఎంబాపే.. పురుషుల ప్రపంచకప్ చరిత్రలో అత్యధిక గోల్స్(22) సాధించిన ఆటగాడిగా తన రికార్డును మరింత మెరుగుపరుచుకున్నాడు. టోర్నీలో రెండో అత్యుత్తమ ఆటగాడిగా అర్జెంటీనా కెప్టెన్ లియోనెల్ మెస్సీ-సిల్వర్ బాల్, మూడో అత్యుత్తమ ఆటగాడిగా ఎంబాపే-బ్రాంజ్ బాల్ అందుకున్నారు. గోల్స్ విభాగంలో మెస్సీ-సిల్వర్ బూట్, ఇంగ్లండ్ స్టార్ జూడ్ బెల్లింగ్‌హామ్ బ్రాంజ్ బూట్ సొంతం చేసుకున్నారు. ఇక.. ఉత్తమ క్రీడాస్ఫూర్తిని ప్రదర్శించినందుకు గానూ నెదర్లాండ్స్ జట్టుకు ఫిఫా ఫెయిర్ ప్లే ట్రోఫీ దక్కింది.

**ప్రపంచకప్-2026 అవార్డుల జాబితా:**

గోల్డెన్ బాల్: రోడ్రీ (స్పెయిన్)
సిల్వర్ బాల్: లియోనెల్ మెస్సీ (అర్జెంటీనా)
బ్రాంజ్ బాల్: కిలియన్ ఎంబాపే (ఫ్రాన్స్)
గోల్డెన్ బూట్: కిలియన్ ఎంబాపే (ఫ్రాన్స్)
సిల్వర్ బూట్: లియోనెల్ మెస్సీ (అర్జెంటీనా)
బ్రాంజ్ బూట్: జూడ్ బెల్లింగ్‌హామ్ (ఇంగ్లాండ్)
గోల్డెన్ గ్లోవ్: ఉనై సైమన్ (స్పెయిన్)
ఉత్తమ యువ ఆటగాడు: పౌ కుబార్సీ (స్పెయిన్)
ఫెయిర్ ప్లే ట్రోఫీ: నెదర్లాండ్స్

# ట్రంప్ సార్.. పక్కకు జరగండి!

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నకు ప్రచార ఆర్భాటం ఎక్కువ అని అందరికీ తెలిసిందే. ఈ ప్రచార పిచ్చితోనే ఆయన విమర్శలపాలవుతున్నారు. 2026 ఫిఫా ప్రపంచకప్ ఫైనల్ అనంతరం ట్రోఫీ ప్రదానోత్సవంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌నకు సంబంధించిన ఓ వీడియో నెట్టింట వైరల్ అవుతోంది. ఇందులో ట్రంప్ వ్యవహరించిన తీరు విస్తృత చర్చకు దారితీసింది. స్పెయిన్ జట్టు ట్రోఫీ అందుకున్న తర్వాత కూడా ట్రంప్ పోడియంపై కొద్దిసేపు అలాగే ఉండిపోవడంతో అసౌకర్యకర పరిస్థితి నెలకొంది.

ఆదివారం అర్ధరాత్రి న్యూయార్క్-న్యూజెర్సీ స్టేడియంలో జరిగిన ప్రపంచకప్ ఫైనల్‌కు ట్రంప్, ఆయన సతీమణి మెలానియా హాజరయ్యారు. ఈ మ్యాచ్‌లో స్పెయిన్ 1-0తో అర్జెంటీనాను ఓడించి ప్రపంచ కప్‌ను ముద్దాడింది. మ్యాచ్ అనంతరం ట్రోఫీ ప్రదానోత్సవానికి గియానితో కలిసి ట్రంప్ మైదానంలోకి వచ్చారు. స్పెయిన్ కెప్టెన్ రోడ్రీకి ట్రంప్ వరల్డ్ కప్ ట్రోఫీని అందించారు. స్పెయిన్ జట్టు ఆటగాళ్లు ట్రోఫీని ముద్దాడుతూ సంబరాలు చేసుకుంటుండగా ట్రంప్ కెమెరా ఫ్రేమ్‌లోనే ఉండేందుకు ప్రయత్నించి కాసేపు అక్కడే నిలబడ్డారు. ఈ విషయాన్ని గమనించిన రోడ్రీ ఆయనను సున్నితంగా పక్కకు జరగమని సైగ చేశాడు. కానీ, ట్రంప్ మాత్రం



కదలకుండా స్పెయిన్ జట్టు ఆటగాడి పక్కనే నిలబడ్డారు. చివరికి ఫిఫా అధ్యక్షుడు గియానీ జోక్యం చేసుకుని ట్రంప్‌ను పక్కకు తీసుకువెళ్లాల్సి వచ్చింది. ఇందుకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. 'మరి ఇంత ప్రచార పిచ్చా'.. 'ఫొటోలకు పోజులు ఇవ్వడం కోసమే ట్రంప్ పోడియంపై నుంచి పక్కకు వెళ్లడానికి నిరాకరించారు' అంటూ నెటిజన్లు విమర్శిస్తున్నారు.

# చైతన్య రథం సినిమా

మంగళవారం 21 జూలై 2026 X





## ఆకట్టుకుంటున్న.. రావే చెలియా!

ఘట్టమనేని జయకృష్ణ హీరోగా అజయ్ భూపతి తెరకెక్కిస్తోన్న చిత్రం 'శ్రీనివాస మంగాపురం'. రషా థడానీ కథానాయికగా అలరించనున్నారు. జులై 30న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో తాజాగా ఈ సినిమా నుంచి లిరికల్ సాంగ్ రిలీజ్ చేశారు.

రావే చెలియా అంటూ సాగే ఈ పాటలో 'నా ప్రాణం నను వీడి.. నీ వైపే కదిలేనే' అనే లిరిక్స్ యువతను బాగా ఆకట్టుకుంటున్నాయి. యువజంట ప్రేమ భావాలను తెలియచెప్పేలా పాట ఆహ్లాదకరంగా సాగింది.

## మీ సినిమాలో నటించడానికి సిద్ధం..



జపాన్ ఓపెన్‌టైటిల్ విజేతగానిలిచి భారత స్టార్ షట్లర్ పీవీ సింధు సరికొత్త చరిత్ర సృష్టించిన సంగతి తెలిసిందే. దీంతో ఈ తెలుగు తేజంపై సోషల్ మీడియాలో ప్రశంసల వర్షంకురుస్తోంది. ఈనేపథ్యంలో అగ్ర దర్శకుడు రాజమౌళి పోస్ట్‌కు సింధు ఇచ్చిన జవాబు అందరినీ ఆకర్షిస్తూనే నెట్టింట ఆసక్తికర చర్చకు దారి తీసింది.

సింధును అభినందిస్తూ రాజమౌళి ఎక్స్‌వేదికగా పోస్ట్‌పెట్టారు."జపాన్ ఓపెన్ గెలిచిన తొలి భారతీయురాలిగా చరిత్ర సృష్టించావు. మంచి కమ్ బ్యాక్ ఇచ్చావు. కంగ్రాట్స్ సింధు.నిన్ను చూసి దేశం గర్విస్తోంది" అని శుభాకాంక్షలు తెలిపారు. దీనికి స్పందించిన ఆమె.."ధన్య వాదాలు రాజమౌళి సర్.మీ వారణాసి కోసం ఆసక్తిగా ఎదురు చూస్తున్నా. ఒకవేళ మీరు తెరకెక్కించే ఏసినిమాలోఅయినా బ్యాడ్మింటన్ ప్లేయర్ పాత్ర ఉంటే..మీపరిచయ నటిగా మారడానికి నేను ఎంతో సంతోషిస్తాను" అంటూ నవ్వుతున్న ఎమోజీలను పంచుకున్నారు. ప్రస్తుతం సింధు రిప్లై నెట్టింట వైరల్ అవుతుండగా..రాజమౌళికి క్రీడాకారుల నుంచి ఈ తరహా రిక్వెస్టు రావడం ఇదేం తొలిసారికాదు.గతంలో ఆస్ట్రేలియా క్రికెటర్ డేవిడ్ వార్నర్ కూడా జక్కన్నకు ఇలాంటి రిప్లై ఇచ్చారు. తెలుగు సినిమా పాటలకు తనదైనస్టైల్లో డ్యాన్స్‌వేస్తూ పోస్టు పెట్టే వార్నర్‌కు..దర్శకధీరుడు 'బాహుబలి' కీరిటాన్ని కూడాపంపారు.ఇక సూపర్‌స్టార్ మహేష్‌బాబుతో రాజమౌళి తెరకెక్కిస్తున్న పాన్ వరల్డ్ సినిమా 'వారణాసి' విషయానికొస్తే..దీని షూటింగ్ ప్రస్తుతం చివరి దశలో ఉంది. అక్టోబర్ నాటికి పూర్తి చేసి వచ్చే ఏడాది ఏప్రిల్ 7న ప్రపంచ వ్యాప్తంగా విడుదల చేయనున్నారు.

## ఎప్పటికీ మర్చిపోలేని ఫైనల్ ..



ఫిఫా ప్రపంచకప్ ఫైనల్ మ్యాచ్‌లో డిఫెండింగ్ చాంపియన్ అర్జెంటీనాపై స్పెయిన్ జట్టు విజయం సాధించి విశ్వ విజేతగా నిలిచింది. ఈ చరిత్రాత్మక ఘట్టాన్ని స్టేడియం నుంచి ప్రత్యక్షంగా వీక్షించిన మళయాళ సూపర్‌స్టార్ మోహన్‌లాల్ సోషల్ మీడియా వేదికగా స్పందిస్తూ భావోద్వేగ పోస్టును పంచుకున్నారు. స్టేడియంలో కూర్చుని ఈఆటను చూడడం నాకుచాలా ఆనందంగా ఉంది. ఎప్పటికీ మర్చిపోలేనిఫైనల్ ఇది. స్పెయిన్, అర్జెంటీనా జట్లు గొప్ప ఆటతీరును కనబర్చాయి. ఈ టోర్నీలో అద్భుతంగా ఆడి ప్రపంచ ఛాంపియన్‌గా నిలిచిన స్పెయిన్‌కు అభినందనలు. శత్రుత్వం,సరిహద్దులను పక్కన పెట్టి యావత్ ప్రపంచాన్ని ఒక్కటి చేసే శక్తి ఈ ఆటకే ఉందని మరోసారి రుజువు చేసినందుకు ఫుట్‌బాల్‌కు ధన్యవాదాలు అంటూ మోహన్ లాల్ శుభాకాంక్షలు తెలిపారు. మామూలుగా క్రీడలను ఇష్టపడే మోహన్‌లాల్ అర్జెంటీనా స్టార్ ప్లేయర్ మెస్సీకి వీరాభిమాని. మోహన్ లాల్‌తో పాటు మరికొందరు సినీప్రముఖులు ఫుట్ బాల్ ఫైనల్ మ్యాచ్‌లో సందడి చేశారు. హాలీవుడ్ హీరో టామ్ క్రూజ్, తమిళ దర్శకుడు నెల్సన్ దిలీప్‌కుమార్ మ్యాచ్‌ను ప్రత్యక్షంగా వీక్షించారు. ఇక, బాలీవుడ్ హీరోయిన్ కరీనా కపూర్ ఓ ఫొటోను పంచుకుని స్పెయిన్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

### ఎన్టీఆర్, త్రివిక్రమ్ మూవీలో

## కియారా?

మ్యాన్ ఆఫ్ మాసెస్ ఎన్టీఆర్, మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ కాంబినేషన్‌లో రాబోతున్న భారీ పౌరాణిక చిత్రం గాడ్ ఆఫ్ వార్ గురించి నెట్టింట రకరకాల కథనాలు చక్కర్లు కొడుతున్నాయి. కుమారస్వామి (సుబ్రహ్మణ్య స్వామి) గాథ ఆధారంగా తెరకెక్కుతున్న ఈ పౌరాణిక చిత్రంలో ఎన్టీఆర్ మురుగన్ పాత్రలో కనిపించబోతున్నాడని టాక్.పురాణాల ప్రకారం సుబ్రహ్మణ్య స్వామికి శ్రీవల్లి, దేవసేన అనేఇద్దరు భార్యలు ఉంటారు. దీంతో ఈ సినిమాలో ఆరెండు కీలక పాత్రల్లో ఏ హీరోయిన్లు నటిస్తారనే ఆసక్తి అందరిలోనూ నెలకొంది. అయితే అందులో ఒకకథానాయికగా బాలీవుడ్ బ్యూటీ కియారా అద్వానీని ఎంపిక చేసినట్లు సమాచారం. గతంలో వీరిద్దరూ కలసి వార్ 2 చిత్రంలో నటించినప్పటికీ, అందులో కియారా హృతిక్ రోషన్‌కి జోడీగా కనిపించింది. ఈసారి మాత్రం నేరుగా ఎన్టీఆర్ సరసన నాయికగా నటించబోతుండటం విశేషం.



### మూడు రోజుల్లో

## రూ.2,548 కోట్లు!

భారీ అంచనాల మధ్య విడుదలైన 'ది ఒడిస్సీ' బాక్సాఫీస్ వద్ద చరిత్ర సృష్టిస్తోంది. క్రిస్టఫర్ నోలన్ దర్శకత్వంలో ప్రముఖ హాలీవుడ్ నటుడు మాట్‌డామన్ ప్రధానపాత్రలో నటించిన ఈ చిత్రం..విడుదలైన మొదటివీకెండ్లోనే ప్రపంచ వ్యాప్తంగా 264 మిలియన్ డాలర్లకు పైగా (భారత కరెన్సీలో దాదాపు రూ.2,548 కోట్లకు పైనే) గ్రాస్ వసూళ్లను సాధించింది. నోలన్ కెరీర్లోనే ఇది అత్యుత్తమ ఓపెనింగ్ కావడం విశేషం.

'ది ఒడిస్సీ' తొలిరోజు భారత్లో రూ.20.76కోట్లు వసూళ్లతోరికార్డు సృష్టించి, ప్రపంచవ్యాప్తంగా 50మిలియన్ డాలర్లు సాధించింది. తాజాగా ఈసినిమా వారంతపువసూళ్లను తెలుపుతూ నిర్మాణసంస్థ పోస్ట్‌పెట్టింది. మొదటి మూడురోజుల్లో 264 మిలియన్ డాలర్లు తనఖాతాలో వేసుకుందని.. ఈ మొత్తంలో ఉత్తర అమెరికా నుంచే 124మిలియన్ డాలర్లు వచ్చినట్లు తెలిపింది.గతంలో నోలన్ దర్శకత్వంలో సూపర్‌హిట్‌గా నిలిచిన'ది డార్క్ నైట్ రైజెస్'(249 మిలియన్ డాలర్లు),'ఒప్పెన్ హైమర్'(181మిలియన్ డాలర్లు) తొలి వీకెండ్ వసూళ్లను ఈసినిమా బ్రేక్ చేసింది.

హోమర్ రాసిన 'ది ఒడిస్సీ' ఇతిహాసం ఆధారంగా క్రిస్టఫర్ నోలన్ ఈచిత్రాన్ని రూపొందించారు. సుమారు రూ.2వేల కోట్ల బడ్జెట్‌తో కేవలం 91రోజుల్లో ఈమూవీషూటింగ్ పూర్తి చేయడం విశేషం. మూడు రోజుల్లోనే ఈ సినిమా రికార్డుస్థాయి కలెక్షన్లు రాబట్టింది. దీంతో మరికొన్ని రోజుల్లోనే ఈ చిత్రం వన్‌బిలియన్ క్లబ్‌లో చేరడం ఖాయమని ట్రేడ్ విశ్లేషకులు అంచ నా వేస్తున్నారు.







## ఆజాద్ హింద్ ఫౌజ్ సైనికుడిగా ప్రభాస్

పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ హీరోగా, హను రాఘవపూడి దర్శకత్వంలో రూపొందుతున్న తాజా చిత్రం 'ఫౌజీ'. ఇందులో ప్రభాస్.. ఆజాద్ హింద్ ఫౌజ్ సైనికుడిగా కనిపించనున్నారని సమాచారం. నేతాజీ సుభాష్ చంద్రబోస్ నాయకత్వంలో భారత స్వాతంత్య్రం కోసం ఆయన చేసే పోరాటమే ఈ సినిమా ప్రధాన కథాంశమని తెలుస్తోంది.ఇందులో ప్రభాస్ ముందుగా బ్రిటీష్ ఇండియన్ ఆర్మీలో సైనికుడిగా పనిచేసి, ఆ తర్వాత సుభాష్ చంద్రబోస్ నేతృత్వంలోని ఆజాద్ హింద్ ఫౌజ్‌లో చేరుతారట.

ఇది నేతాజీ బయోపిక్‌లా కాకుండా, భారతదేశ స్వాతంత్య్రం కోసం పోరాడిన సైనికుల కథను చూపించే చిత్రంగా ఉండనున్నట్లు టాక్.ఈ మూవీలో ప్రభాస్ పాత్ర ధైర్యసాహసాలు,త్యాగం, దేశభక్తితో నిండి ఉంటుందని సమాచారం. అయితే దీనిపై ఇంకా ఎలాంటి అధికారిక ప్రకటన రాలేదు. డిసెంబరు 3న 'ఫౌజీ' విడుదల కానున్నట్లు తెలుపుతూ చిత్ర బృందం ఇటీవల పోస్టర్ విడుదల చేసింది. ఆ పోస్టర్‌లో మునుపెన్నడూ చూడని లుక్‌లో ప్రభాస్ కనిపించడంతో ప్రేక్షకుల్లో అంచనాలు రెట్టింపయ్యాయి. ఈ చిత్రంలో హీరోయిన్‌గా ఇమాన్వి మెరవనున్నారు. మిథున్ చక్రవర్తి, అనుపమ్ ఖేర్, జయప్రద కీలక పాత్రలు పోషిస్తున్నారు.

ప్రస్తుతం, ప్రభాస్ పలు భారీ ప్రాజెక్టులతో బిజీగా ఉన్నారు. ఫౌజీ తరువాత సందీప్‌రెడ్డి వంగా దర్శకత్వంలో 'స్పిరిట్'లో కనిపించనున్నారు. ఇందులో కథానాయికగా త్రిప్తి దిమ్రీ నటిస్తున్నారు. ఆ తర్వాత 'సలార్: పార్ట్ 2', 'కల్కి 2898 ఏడీ: పార్ట్ 2' సీక్వెల్స్ షూటింగ్స్‌లోనూ ప్రభాస్ పాల్గొననున్నారు.

### 30 రోజుల వ్యవధిలో

## మూడు భారీ సినిమాలు..

వరుసగా భారీ సినిమాలను లైన్‌లో పెట్టి మళమాళ ముద్దుగుమ్మ మమితా బైజు మంచి జోరుమీదుంది. ప్రేమలు, డ్యూడ్ చిత్రాలతో బ్యాక్ టు బ్యాక్ సూపర్ హిట్స్ అందుకున్న ఈ బ్యూటీ.. ధనుష్ 'కర' సినిమాతో ఫ్లాప్‌ను అందుకుంది. ఇప్పుడు ఊహించని విధంగా కేవలం నెల రోజుల గ్యాప్‌లో మూడు క్రేజీ సినిమాలతో ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు రెడీ అయింది.

ఈ జోరులో మొదటిగా రాబోతున్న చిత్రం జననాయగన్. నిజానికి ఈ సినిమా ఈ ఏడాది సంక్రాంతి కానుకగా విడుదల కావాల్సిన ఈ సినిమా ఎట్టకేలకు అన్ని అడ్డంకులను దాటుకుని ఈ నెల 23న ప్రపంచ వ్యాప్తంగా భారీ స్థాయిలో విడుదలకు సిద్ధమవుతోంది. టాలీవుడ్ సూపర్ హిట్ భగవంత్ కేసరి రీమేక్‌గా వస్తున్న ఈ చిత్రంపై కోలీవుడ్‌లో భారీ అంచనాలు ఉన్నాయి. అన్నిటికంటే ముఖ్యంగా ఈ సినిమా దళపతి విజయ్ ఆఖరి చిత్రం కావడం విశేషం. దీనితో బాక్సాఫీస్ వద్ద సరికొత్త రికార్డులు క్రియేట్ అవ్వడం ఖాయమని ట్రేడ్ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. ఇలాంటి ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్‌లో మమితా భాగం కావడం ఆమె కెరీర్‌కు ప్లస్ కానుంది.

జననాయగన్ హడావుడి ముగియక ముందే.. కోలీవుడ్ స్టార్ హీరో సూర్య కథానాయకుడిగా, టాలెంటెడ్ డైరెక్టర్ వెంకీ అట్లూరి దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం విశ్వనాథ్ అండ్ సన్స్ చిత్రంలో మమితా మెయిన్ హీరోయిన్‌గా కనిపించనుంది. ఈ భారీ చిత్రం ఆగష్టు 14న పాన్ ఇండియా లెవెల్లో విడుదల కాబోతుంది. విజయ్ సినిమా వచ్చిన మూడు వారాల వ్యవధిలోనే సూర్య లాంటి పెద్ద స్టార్ పక్కన నటించిన సినిమా రిలీజ్ కావడం మమితా క్రేజ్‌ను మరింత పెంచేలా కనిపిస్తోంది.

తమిళంలో సూర్య నటించిన సినిమా విడుదలైన వారం గ్యాప్‌లోనే తన సొంత గడ్డ అయిన మలయాళంలోనూ 'బెత్లెహెం కుడుంబా యూనిట్' సినిమాతో మమితా మెరవనుంది. 'ప్రేమలు' దర్శకుడు గిరీష్ ఏడీ కాంబినేషన్‌లో నివిన్ పాలీ హీరోగా తెరకెక్కుతున్న రొమాంటిక్ ఫ్యామిలీ డ్రామా ఇది. ప్రేమలు లాంటి ఇండస్ట్రీ హిట్ తర్వాత అదే డైరెక్టర్‌తో చేస్తున్న సినిమా కావడంతో మాలీవుడ్‌లో ఈ ప్రాజెక్ట్‌పై భారీ హైప్ క్రియేట్ అయింది. ఈ సినిమా కూడా ఆగష్టు 21 వ తేదీన రిలీజ్ కానుండడంతో మమిత ఫుల్ జోష్‌లో ఉంది.

